www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 9-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 123 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా.1:37 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: మూల తె. 4:50 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.11:46-1:29, తె.3:07-4:50, దుర్ముహూర్తం: ఉ.11:54-12:46, అమృతఘడియలు: రా.10:00-11:43, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:50, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిహార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో

మహిళలకు 35% కోటా

యువత అభ్యున్నతి, సంక్షేమానికి కమిషన్ ఏర్పాటు

ఎన్నికలకు ముందు నితీశ్ ప్రభుత్వం కీలక ప్రకటన

2

విశాఖలో జీసీసీ



ఇన్నోవేషన్ క్యాంపస్‌పై మంత్రి లోకేశ్ సమక్షంలో ఏఎన్ఎస్సార్‌తో ఎంవోయూ

మధురవాడలో ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు

బెంగళూరులో ఏఎన్ఎస్సార్‌తో ఒప్పందం

- 10 వేల ఉద్యోగాలు కల్పించే అవకాశం
- నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యం
- ఇందులో ఐటీ, జీసీసీఎస్ రంగాల్లో 5 లక్షలు
- విశాఖ నుంచే ప్రయాణానికి శ్రీకారం
- ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తాం: లోకేశ్
- ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రతిష్ఠాత్మక సంస్థలకు గమ్యంగా మారుతుంది
- ఏఎన్ఎస్సార్ సీఈవో ఆహూజా వెల్లడి

విశాఖకు క్యాప్ జెమిని

- డబ్ల్యుఎన్ఎస్ కంపెనీని కొనుగోలు చేసిన సంస్థ
- సొంత కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు
- భూకేటాయింపునకు ప్రభుత్వం సిద్ధం

బెంగళూరు/అమరావతి/విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) స్థాపన, నిర్వహణలో ప్రపంచంలోనే అగ్రగామి సంస్థగా ఉన్న ఏఎన్ఎస్సార్.. విశాఖలో ప్రత్యేక ఇన్నోవేషన్ క్యాంపస్ స్థాపించనుంది. ఇందుకోసం ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ సమక్షంలో బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. దీనిపై ఏఎన్ఎస్ఆర్ సంస్థ సీఈవో లలిత్ ఆహూజా, రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సంతకాలు చేశారు. మధురవాడ ఐటీ క్లస్టర్‌లో అత్యాధునిక జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు ద్వారా ఐదేళ్లలో 10 వేల మందికి

మిగతా 14వ పేజీలో...

ఏపీకి స్వాగతం

స్థిరాస్తి రంగంలో పెట్టుబడులతో రండి

- ప్రెస్టేజ్, సత్వ అధినేతలకు లోకేశ్ ఆహ్వానం
- బెంగళూరులో వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ
- సిలికాన్ వ్యాలీలా 6 నెలల్లో క్వాంటమ్ వ్యాలీ
- ఐటీ హబ్‌గా విశాఖ మహానగరం
- ప్రపంచమంతా రాష్ట్రం వైపు చూస్తోంది
- పెట్టుబడులకు ఇదే సరైన సమయం: లోకేశ్

14

రాష్ట్రాభివృద్ధిపై జగన్ కుట్రలు!



14

- ఎండీసీ బాండ్లు కొనొద్దంటూ 200 మంది ఇన్వెస్టర్లకు మెయిల్లు
- ప్రధాని, ఆర్థిక మంత్రి, ఆర్బీఐ, సెబీ, ఇతర ఎక్స్ఛేంజీలకు ఫిర్యాదు
- హైకోర్టులో కేసులు.. వాటిపై బుగ్గన ప్రెస్‌మీట్లు.. జగన్ ట్వీట్లు
- అయినా చంద్రబాబు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోని ఇన్వెస్టర్లు
- ఏపీఎండీసీ ఇష్యూ ఓవర్ సబ్‌స్క్రైబ్ కావడమే దీనికి నిదర్శనం: పయ్యావుల

‘అన్నదాత-సుఖీభవ’

జాబితాలు సిద్ధం

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో...
- ‘మనమిత్ర’ వాట్సా్ప్‌లోనూ సమాచారం
- 10 లక్షల మందికి రేపు రెండో విడత తల్లికి వందనం
- ఈ వారంలోనే ధాన్యం బకాయిల సొమ్ము
- ఎస్సీ గురుకుల విద్యార్థులకు నజరానా
- ఐఐటీ, నీట్‌లో అర్హత సాధిస్తే లక్ష బహుమతి

12



నాలుగు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం డ్యాం నుంచి కిందకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

జలమే జీవం!

సంపద, అభివృద్ధికి నీరే ఆధారం

గోదావరితో ఉభయ రాష్ట్రాలు సుభిక్షం: సీఎం

- ఏటా 2 వేల టీఎంసీలు సాగరం పాలు
- చెరో 200 టీఎంసీలు వాడుకున్నా చాలు
- బనకచర్ల సాకారమైతే కరువు ఉండదు
- రాయలసీమ నుంచి దుర్భిక్షాన్ని తరిమేస్తాం
- నాడు ఐదేళ్లలో సాగునీటిపై 68 వేల కోట్ల ఖర్చు
- మేమే వచ్చినట్లైతే పోలవరం పూర్తయ్యేది: బాబు
- శ్రీశైలం జలాశయం గేట్లెత్తి నీటి విడుదల
- కృష్ణా జలాలకు జలహారతి.. గంగమ్మ తల్లికి సారె

నంద్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నదీ జలాలే రాష్ట్రానికి సంపద, అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో మంగళవారం ఆయన పర్యటించారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి కృష్ణా జలాలను దిగువకు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. ‘గోదావరి

మిగతా 13వ పేజీలో...



కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి. పక్కన మంత్రి నిమ్మల, నేతలు

25% పనులు పూర్తికాని నీటి ప్రాజెక్టులూ ముందుకే!

సీఎం నిర్ణయం.. నేడు క్యాబినెట్ భేటీలో ప్రతిపాదన

12

రాజధాని నిర్మాణాలపై ప్రత్యేక సమీక్ష



భారత్‌లో మీడియాపై

సెన్సార్‌షిప్!

ప్రభుత్వ ఆదేశాలతో రాయిటర్స్ హ్యాండిల్ ఆపేశాం

- గంట టైమిచ్చి 2,355 ఖాతాల్ని ఆపమన్నారు
- ‘ఎక్స్’ ఇండియా విభాగం సంచలన ఆరోపణ
- అది ఆపరేషన్ సిందూర్ టైంలో జరిగింది ఇప్పుడు కాదు.. కేంద్ర ఐటీ శాఖ వివరణ

న్యూఢిల్లీ, జూలై 8: భారత ప్రభుత్వం మీడియా సంస్థల ‘ఎక్స్’ ఖాతాలను స్తంభింపజేయడం ద్వారా మీడియాపై సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఎక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. దీన్ని ఎదుర్కొనేందుకు తాము ఇప్పటికే భారతదేశంలో అవకాశమున్న అన్ని చట్టపరమైన మార్గాలనూ పరిశీలిస్తున్నామని

మిగతా 2వ పేజీలో...

స్కూలు బస్సును ఢీకొన్న రైలు

- తమిళనాడులోని కడలూరు జిల్లాలో పట్టాలు దాటుతుండగా ఘటన
- ముగ్గురు విద్యార్థుల దుర్మరణం
- డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు
- గేటుమ్యాన్‌కు తమిళం రాకపోవడం వల్లే అక్కడ వరుస ప్రమాదాలు
- డీఎంకే ఆరోపణలు.. రాజకీయ దుమారం

2

విపక్షం నిరసన ర్యాలీలో మంత్రి

- ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరాఠీ అస్తిత్వ ర్యాలీలో బాబూరావు
- ధైర్యముంటే అరెస్టు చేయాలని సవాలు
- అంతకుముందు ర్యాలీకి అనుమతి నిరాకరించిన మహారాష్ట్ర ప్రభుత్వం

అన్ని భాషలూ జాతీయ భాషలే

ఒకే భాషను బలవంతంగా రుద్దటాన్ని మేం సమర్థించం: ఆర్ఎస్ఎస్

2



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కోవూరులో తెలుగు మహిళల భారీ ర్యాలీ

మారని ప్రసన్న తీరు!

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అవే అనుచిత వ్యాఖ్యలు.. వాటికే కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన సెగలు రేగుతున్నా నిస్సిగ్గుగా సమర్థించుకున్న వైసీపీ నేత

ప్రసన్న వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసన

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పలువురి సంఘీభావం.. ప్రసన్నను అరెస్టు చేయాలని డిమాండ్
- ఏఎస్పీకి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు.. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: మహిళా కమిషన్

ఆ వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం

- మహిళలను అవమానించడం వైసీపీ డీఎన్ఏలోనే ఉంది
- మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు

13

పెగ్గు మీద పెగ్గు

రాష్ట్రంలో భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు

- లిక్కర్ 24%.. బీరు ఏకంగా 129%
- మొదటి క్వార్టర్‌లోనే 7,890 కోట్లు
- అదనపు విక్రయాలతో అధిక ఆదాయం
- నెలకు సగటున 2,300 కోట్లు రాబడి
- టాప్‌లో తిరుపతి.. చివరన అల్లూరి
- పశ్చిమలో రివర్స్ ట్రెండ్.. జిల్లాలో పెరిగిన నకిలీ మద్యం విక్రయాలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. మద్యం ప్రియులు పెగ్గు మీద పెగ్గు కొడుతూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా బీరు అమ్మకాలు ఏకంగా 129శాతం పెరగడం విశేషం. లిక్కర్ విక్రయాలు దాదాపు 24శాతం పెరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం బ్రాండ్లు తాగలేక మద్యం

మిగతా 14వ పేజీలో...

సర్దుపోటు లేదు.. ట్రూఅప్ బాదుడూ ఉండదు

ఈ ఏడాది కరెంటు చార్జీలు పెరగవు: డిస్కంలు

3

- అధిక ధరలతో విద్యుత్ కొనుగోళ్లు తగ్గించాం.. దీంతో ఆదాయం పెరిగింది
- జగన్ హయాంలో ఏటా జనంపై భారం.. మూడేళ్లలో 18,568 కోట్ల బాదుడు

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35% కోటా

బిహార్‌లో ఎన్నికలకు ముందు నితీశ్ ప్రభుత్వం కీలక ప్రకటన


పాట్నా, జూలై 8: ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువత కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను నితీశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అన్ని విభాగాలు, స్థాయిల్లోని ఉద్యోగాల్లో బిహార్ శాశ్వత నివాసితులైన మహిళా అభ్యర్థులకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళా శక్తిని పెంచడం, రాష్ట్ర పరిపాలనలో వారు చురుకైన పాత్ర పోషించేలా చేయాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'బిహార్ యూత్ కమిషన్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చైర్‌పర్సన్, ఇద్దరు వైస్ చైర్‌పర్సన్లు, ఏడుగురు సభ్యులతో ఏర్పాటయ్యే ఈ కమిషన్.. రాష్ట్రంలో యువత అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వానికి సలహాలు ఇస్తుందని తెలిపారు. యువతకు మెరుగైన విద్య, ఉద్యోగావకాశాలు కల్పించడానికి, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం దక్కేలా ఈ కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు.

రాముడు నేపాల్‌లోనే పుట్టాడు!

- శివుడు, విశ్వామిత్రుడు కూడా ఇక్కడే జన్మించారు
- నేపాల్ ప్రధాని ఓలి వివాదాస్పద వ్యాఖ్యలు



కాఠ్‌మాండూ, జులై 8: శ్రీరాముడి జన్మస్థలంపై నేపాల్ ప్రధానిన కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రామ భగవానుడు నేపాల్‌లోనే జన్మించాడని పునరుద్ఘాటించారు. రాముడితోపాటు శివుడు, విశ్వామిత్రుడు కూడా నేపాల్‌లోనే పుట్టారని చెప్పారు. కాఠ్‌మాండూలో అధికార సీపీఎన్-యూఎంఎల్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఓలి ఈ వ్యాఖ్యలు చేశారు. రాముడు నేపాల్‌లోనే జన్మించాడని.. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని ఓలి అన్నారు. "రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉంది. దీన్ని మనం అంతగా జనంలోకి తీసుకెళ్లలేకపోతున్నాం" అని చెప్పారు. రాముడు పుట్టింది నేపాల్‌లో అయితే.. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరు? అని ఓలి ప్రశ్నించారు. ఓలి గతంలోనూ ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. అయోధ్య నేపాల్‌లోని చిత్వాన్ జిల్లా థోరిలో ఉందని 2020 జులైలో చెప్పారు. ఇక్కడే రాముడు పుట్టాడనీ అన్నారు. అక్కడ రామ మందిరం నిర్మించాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసిన ప్రాంతం కూడా నేపాల్‌లోనే ఉందన్నారు.





ప్రతిపక్షం నిరసన ర్యాలీలో మంత్రి

ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరాఠా అస్తిత్వ ర్యాలీలో ప్రతాప్ బాబూరావు..అరెస్టు చేయాలని సవాలు

న్యూఢిల్లీ, జూలై 8: 'మరాఠా అస్తిత్వం' కోసమంటూ మహారాష్ట్రలో ప్రతిపక్ష ఎంఎన్ఎస్ పార్టీ మంగళవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో ఏకంగా ఆ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఏక్‌నాథ్ శిందే శివసేన వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ప్రతాప్ బాబూరావు సర్‌నాయక్ పాల్గొనడం సంచలనమైంది. ఆందోళనల్లో పాల్గొనడమే కాకుండా ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఎంఎన్ఎస్ ర్యాలీకి ప్రభుత్వం అనుమతినీయకపోడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "నేను ర్యాలీలో పాల్గొంటున్నాను. పోలీసులకు అంత ధైర్యం ఉంటే, అరెస్టు చేస్తే చేసుకోనీయండి. నాది అన్ని వేళలా మరాఠా అస్తిత్వం కోసం పోరాడే వాళ్ల పక్షమే" అని తేల్చి చెప్పారు. వేరే రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు వచ్చిన వ్యాపారులు కూడా స్థానికంగా మరాఠీలోనే మాట్లాడాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. జూలై 1న భయందేర్ ప్రాంతంలో ఓ ఫుడ్ స్టాల్ యజమాని మరాఠీలో మాట్లాడనందుకు ఎంఎన్ఎస్ కార్యకర్త కొట్టారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా ఎంఎన్ఎస్ కార్యకర్త చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో మంగళవారం థానేలోని మీరా రోడ్డులో మరాఠా అస్తిత్వ ర్యాలీని నిర్వహించేందుకు మరాఠీ ఏకీకరణ్ సమితి, ఇంకా చాలా సంస్థలు అనుమతి కోరాయి. అయితే ప్రభుత్వం అందుకు నిరాకరించింది. అయినా, ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఏ భాషనూ బలవంతంగా రుద్దొద్దు: ఆరెస్సెస్

న్యూఢిల్లీ, జూలై 8: మహారాష్ట్రలో భాషలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో దేశంలోని భాషలన్నీ జాతీయ భాషలేనని ఆరెస్సెస్ స్పష్టం చేసింది. ఒకే భాషను బలవంతంగా అమలు చేయడాన్ని సమర్థించేది లేదని ప్రకటించింది. ఇటీవల జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో ఈమేరకు పేర్కొంది. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో హిందీ అమలుపై వివాదాలు నెలకొన్న నేపథ్యంలో ఈమేరకు స్పష్టతనిచ్చింది. జాతీయ నూతన విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగమైన మూడు భాషల ఫార్ములా నుంచే ఈ వివాదం మొదలైంది. ఎన్ఈపీ ద్వారా హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాగా మహారాష్ట్రలో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ మూడు భాషల ఫార్ములాకి సంబంధించి జారీ చేసిన రెండు ఆదేశాలను అక్కడి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది.

తమిళనాడులో స్కూలు బస్సును ఢీకొన్న రైలు

- ముగ్గురు విద్యార్థుల మృతి.. డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు
- గేటుమ్యాన్‌కు తమిళం రాకపోవడం వల్లే ప్రమాదం: డీఎంకే

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి)/న్యూఢిల్లీ: తమిళనాడులోని కడలూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం సెమ్మంకుప్పం రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న ఓ స్కూలు బస్సును రైలు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతిచెందగా, బస్సు డ్రైవర్, మరో విద్యార్థి గాయపడ్డారు. స్కూల్‌కు వెళ్లడంలో ఆలస్యం కాకుండా ఉండేందుకు మూసివున్న గేటును తెరవాలని బస్సు డ్రైవర్ ఒత్తిడి చేశాడని, దీంతో నిబంధనలకు విరుద్ధంగా గేటుకీపర్ అందుకు అనుమతించాడని దక్షిణ రైల్వే చెబుతుండగా.. బస్సు వచ్చిన సమయానికి గేటు తెరిచే ఉందని డ్రైవర్ శంకర్‌తో పాటు గాయపడిన విద్యార్థి విశ్వేష్ చెప్పారు. మరోవైపు ఈ ప్రమాదంపై ఒక కొత్త కోణంలో రాజకీయ దుమారం రేగింది. క్రాసింగ్ వద్ద నియమించిన రైల్వే గేట్‌మ్యాన్‌కు తమిళం అర్థం కాలేదని అధికార డీఎంకే ఆరోపించింది. స్థానిక భాష తెలియకపోవడం వల్ల కమ్యూనికేషన్ లోపం జరిగిందని, చివరకు అది ఘోర దుర్ఘటనకు దారితీసిందని పేర్కొంది. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ మాట్లాడుతూ 'ఘటనాస్థలిలో ఇప్పటికే ఒక ప్రమాదం జరిగింది. అక్కడ ఉండే వ్యక్తికి తమిళ భాష తెలియకపోవమే అందుకు కారణమని రైల్వే అథారిటీ స్వయంగా చెప్పింది. ఇతరులు ఏం చెప్పారో ఆయనకు అర్థం కావడం లేదు. అదే ఇప్పటి ఘటనలో కూడా జరిగింది' అని పేర్కొన్నారు. అలాంటి ముఖ్యమైన చోట్ల స్థానిక భాష తెలిసిన వారిని నియమించి, ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి అరెస్టు

- ముందస్తు బెయిల్ ఉత్తర్వులు చూపడంతో విడుదల



తిరుపతి(నేర విభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసులో మాజీ ఆర్డీవో మురళిని మంగళవారం తిరుపతిలో సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. గతేడాది జూలై 21వ తేదీ రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు కాలిపోయిన కేసులో ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ, మాధవరెడ్డిని అరెస్టు చేశారు. నాటి ఆర్డీవో మురళి అటు పోలీసులు, ఇటు సీఐడీ అధికారుల కళ్లగప్పి షిర్డీ, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నారు. మంగళవారం తిరుపతిలోని కేఆర్ నగర్‌లో ఆయన ఉన్నట్లు తెలియడంతో సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ తన బృందంతో వెళ్లి అరెస్టు చేశారు. అక్కడి నుంచి సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారిస్తుండగా.. సుప్రీంకోర్టు నుంచి పొందిన ముందస్తు బెయిల్‌ను చూపడంతో ఆయనను విడుదల చేశారు.

ఏపీ హోంగార్డులను రాష్ట్రానికి రప్పించండి

- సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ వినతి

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల వేతనాల పెంపు, విదేశీ వైద్య విద్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర సచివాలయంలో సీఎంను కలసిన ఆయన విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్య విద్యలో విదేశాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఏపీకి చెందిన విద్యార్థులకు ఏపీ వైద్య మండలి శాశ్వత రిజిస్ట్రేషన్ నిరాకరిస్తోందని, ఈ నిబంధనను సవరించేలా చూడాలని ఆయన సీఎంకి విన్నవించారు. వైద్య నిపుణుల కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో ఏపీఎంసీ నిబంధనలను మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిసా, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే నిబంధనల్ని సవరించారని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో హోంగార్డుల వేతనాల పెంపు, పోలీసు సెలక్షన్లలో రాయితీలు కల్పించే అంశంపైనా నిర్ణయం తీసుకోవాలని రామకృష్ణ కోరారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కాలం పిల్లల్లో.. లెక్కలు, ఎక్కాలు

తెల్వనోళ్లే ఎక్కువ!



ఆరోతరగతిలో ఉన్నా 53% మందికే 10 వరకు ఎక్కాలు తెలుసు

- మూడో తరగతిలో 45% మందికి ఆరోహణ, అవరోహణ క్రమాలు తెలియవు
- కేంద్ర విద్యాశాఖ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 7: దేశంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల్లో ఎక్కువ మంది 'లెక్కలు.. ఎక్కాలు తెల్వనోళ్లే'నని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన తాజా సర్వే వెల్లడించింది. పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. మూడో తరగతి విద్యార్థుల్లో 45% మందికి 99 వరకు ఉన్న అంకెల్లో ఆరోహణ, అవరోహణ క్రమాలను గుర్తించే శక్తి లేదు. ఆరోతరగతి విద్యార్థుల్లో 10 వరకు ఎక్కాలు వచ్చిన వారు 53% మందే కావడం గమనార్హం..! తొమ్మిదో తరగతిలో కూడా.. గణిత ప్రక్రియల పరస్పర సంబంధాలు, వాటిని అన్వయించడంపై కేవలం 53% మందికే అవగాహన ఉందనే కఠోర సత్యం ఈ సర్వేలో వెల్లడైంది. గత ఏడాది డిసెంబరు 4న కేంద్ర విద్యాశాఖ పరిధిలోని.. విద్యావ్యవస్థ పనితీరు, సమీక్ష, విశ్లేషణ - సమగ్రాభివృద్ధి(పరాఖ్) రాష్ట్రీయ సర్వేక్షణ్ ఈ సర్వేను నిర్వహించింది. దేశంలోని 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న 781 జిల్లాలకు చెందిన 74,229 ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో ఈ సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో మొత్తం 21,15,022 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేలో వెల్లడైన అంశాలు..

- మూడో తరగతిలో 55% మంది విద్యార్థులు మాత్రమే 0 నుంచి 99 వరకు ఉన్న అంకెలు/సంఖ్యలను ఆరోహణ, అవరోహణ క్రమాల్లో అమర్చగలుగుతున్నారు.
- ఇదే తరగతికి చెందిన 58% మంది విద్యార్థులు మాత్రమే రెండంకెల సంఖ్యలను కూడడం, తీసివేయడం చేయగలుగుతున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు వెనకబడి ఉన్నారు.
- ఆరోతరగతి విద్యార్థుల్లో 53% మంది మాత్రమే 10 వరకు ఎక్కాలను చెప్పగలుగుతున్నారు. ఈ తరగతిలో ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యార్థుల పరిస్థితి ఘోరంగా ఉంది.
- తొమ్మిదో తరగతిలో 53% మంది విద్యార్థులకే గణిత ప్రక్రియల పరస్పర సంబంధం, వాటిని ఇచ్చిన లెక్కల్లో అన్వయించడంపై అవగాహన ఉంది.
- తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో.. కేంద్ర ప్రభుత్వ బడులకు చెందిన వారు అత్యుత్తమ ప్రదర్శన కనిపిస్తుండగా.. రెండో స్థానాన్ని ప్రైవేటు బడుల విద్యార్థులు ఆక్రమించారు. రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే బడుల విద్యార్థులు మూడోస్థానంలో నిలిచారు.
- ఆయా తరగతుల విద్యార్థులకు భాషలు, గణితంలో పరీక్షలు నిర్వహించగా.. గణితంలో సగటున 46%, భాషల్లో 57% స్కోర్ రావడం గమనార్హం..! పర్యావరణంపై నిర్వహించిన పరీక్షలోనూ 49% స్కోరుతో విద్యార్థులు వెనకబడే ఉన్నారు.
- మూడో తరగతిలో.. గ్రామీణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఆరు, తొమ్మిది తరగతుల్లో మాత్రం.. పట్టణ ప్రాంతాల విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు.

ప్రత్యేక కార్యాచరణ: కేంద్రం

పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 ఫలితాల నేపథ్యంలో విద్యార్థుల్లో ప్రతిభను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. "ఈ సర్వే ఫలితాలు కేంద్ర, ప్రాంతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విద్యార్థుల పనితీరుకు నిదర్శనంగా ఉన్నాయి. పరిస్థితిని గాడిలో పెట్టేందుకు పరాఖ్ ద్వారా జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. జాతీయ ప్రతిభ సర్వేక్షణ్(ఎన్ఏఎస్) పేరుతో గతంలో 3, 5, 8తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాం. ఈ పరీక్షలు మూడేళ్లకోసారి జరుగుతాయి. చివరిసారి పరీక్షలు 2021లో జరిగాయి. తాజా సర్వే నేపథ్యంలో ఈ పరీక్షలపై దృష్టి పెడతాం" అన్నారు.

ఉద్యోగం పోవటం బాధే.. ఏఐతో సాంత్వన పొందండి!

- మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి కంపెనీ ఉన్నతాధికారి సలహా
- మైక్రోసాఫ్ట్‌లో 9 వేల మంది తొలగింపు

వాషింగ్టన్, జూలై 8: అసలే ఉద్యోగాల్లోంచి తొలగించి, ఆపై.. కొత్త ఉద్యోగం ఎలా వెతుక్కోవాలో సలహా ఇస్తే ఎవరికైనా.. పుండు మీద కారం చల్లినట్టు అవుతుంది. మైక్రోసాఫ్ట్ మాజీ ఉద్యోగులది సరిగ్గా ఇదే పరిస్థితి. ఇటీవల ఆ కంపెనీ.. దాదాపు 9 వేల మంది ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించింది. కృత్రిమ మేధ (ఏఐ) మీద పెట్టుబడులను భారీ ఎత్తున పెంచుతున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్.. ఉద్యోగుల తొలగింపును చేపడుతోంది. ఈ సందర్భంగా కంపెనీ 'ఎక్స్ బాక్స్ గేమింగ్ స్టూడియో' వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న మ్యాట్ టర్న్‌బుల్.. 'ఉద్యోగం కోల్పోయిన ఇటువంటి పరిస్థితుల్లో మానసిక ఒత్తిడి ఉంటుంది. దాన్నుంచి బయటపడటానికి చాట్‌బాట్, కోపైలట్ వంటి ఏఐ టూల్స్ సాయం తీసుకోండి. కొత్త ఉద్యోగం కొరకు ప్రయత్నించండి' అంటూ లింక్డిన్‌లో సలహాలు ఇచ్చారు. ఏయే రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి? కొత్తగా రెజ్యూమ్ తయారు చేసుకోవటానికి ఏఐలో ఏ విధంగా సెర్చ్ చేయాలి? వంటి అంశాలపై టర్న్‌బుల్ పలు సూచనలు చేశారు. దీనిపై ఉద్యోగులు మండిపడ్డారు. దీంతో టర్న్‌బుల్ తన పోస్టును తొలగించారు.

భారతీయ యూజర్లందరికీ అందుబాటులో జెమినీ 2.5 ఏఐ

న్యూఢిల్లీ, జూలై 8: గూగుల్ ఏఐ టూల్ జెమినీ తాజా వెర్షన్ ఇకపై భారతీయ యూజర్లందరికీ అందుబాటులోకి రానుంది. జెమినీ 2.5 వెర్షన్‌ను సెర్చ్‌ంజన్‌తోపాటు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. టెక్ట్స్ రూపంలో సమాచారాన్ని కోరినా, వాయిస్ ద్వారా ప్రశ్నించినా.. ఏదైనా ఫొటోను అప్‌లోడ్ చేసినా.. జెమినీ 2.5 సమాచారం అందజేస్తుందని వివరించింది. ప్రత్యేక ట్యాబ్‌లో సెర్చ్ ఫలితాలు కనిపిస్తాయని, వినియోగదారులకు అనుబంధ ప్రశ్నలు వేసే అవకాశాలుంటాయని పేర్కొంది.

ఎస్సీ పిల్లలను ఫీజులడిగితే ఊరుకోం

- జరిమానా విధించడంతోపాటు బ్లాక్‌లిస్టులో పెడతాం
- 'శ్రేష్ఠ' రెసిడెన్షియల్ స్కూళ్లకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 8: ప్రైవేటు రెసిడెన్సియల్ స్కూళ్లలో శ్రేష్ఠ పథకం కింద ప్రవేశాలు పొందిన ఎస్సీ విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తుండటంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇలాంటివి సహించేది లేదని, శ్రేష్ఠ నిబంధనలను ఉల్లంఘించే స్కూళ్లకు జరిమానా విధించడంతోపాటు వాటిని బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించింది. ప్రవేశ రుసుముతోపాటు యూనిఫాంలు, బుక్స్, ఇతర ఉపకరణాల కోసం కొన్ని స్కూళ్ల విద్యార్థుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం, సాధికారికత శాఖ సహాయ కార్యదర్శి రాకేశ్ కుమార్ సోమవారం ఆయా స్కూళ్ల మేనేజ్‌మెంట్లకు ఘాటుగా లేఖ రాశారు. ఫీజులుగానీ, అదనపు చార్జీలుగానీ తొమ్మిది, పదకొండో తరగతుల్లో ప్రవేశాలు పొందిన ఎస్సీ విద్యార్థుల నుంచి వసూలు చేయడానికి వీల్లేదని ఆ లేఖలో స్పష్టం చేశారు. వారికి చెందిన బోధన, వసతులకు సంబంధించిన ఖర్చులను స్కూళ్లకు కేంద్రమే రీయింబర్స్ చేస్తుందని తెలిపారు. నిజానికి, శ్రేష్ఠ పథకాన్ని కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోంది. మంచి ఫలితాలు సాధిస్తున్న ప్రవేటు రెసిడెన్సియల్ స్కూళ్లను ఎంపిక చేసి ఎస్సీ విద్యార్థులకు అందులో ప్రవేశాలు కల్పిస్తున్నారు. జాతీయ ప్రవేశ పరీక్ష(ఎన్ఈటీఎస్) నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ఇంటర్ వరకు ఉచితంగా అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తారు.



ట్రంప్‌నకు నోబెల్ ఇవ్వండి

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిపాదన

వాషింగ్టన్, జూలై 8: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిపాదించారు. ఈ మేరకు నోబెల్ ప్రైజ్ కమిటీకి తాను పంపిన లేఖ ప్రతిని నెతన్యాహూ స్వయంగా సోమవారం ట్రంప్‌కు అందజేశారు. ట్రంప్‌తో విందులో పాల్గొనేందుకు నెతన్యాహూ వైట్‌హౌస్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇరువురూ భేటీ అయ్యారు. అనంతరం ట్రంప్‌ను ఉద్దేశించి నెతన్యాహూ మాట్లాడుతూ 'మిస్టర్ ప్రెసిడెంట్.. నోబెల్ శాంతి బహుమతికి మీరు అర్హులు. అది మీకు తప్పక దక్కుతుంది' అన్నారు. 'ట్రంప్ ఒక దేశం తర్వాత మరొక దేశంలో, ఒక ప్రాంతం తర్వాత మరొక ప్రాంతంలో శాంతిని నెలకొల్పుతున్నారు' అన్నారు. నోబెల్ శాంతి బహుమతి కోసం సుదీర్ఘకాలంగా ఆకాంక్షను వ్యక్తం చేస్తున్న ట్రంప్ తాజా ప్రతిపాదనపై నెతన్యాహూకు కృతజ్ఞతలు తెలిపారు. 'మీరు చాలా అర్థవంతంగా మాట్లాడారు. మీకు చాలా కృతజ్ఞతలు' అన్నారు.

భారత్‌లో మీడియాపై సెన్సార్‌షిప్!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఎక్స్ ఖాతాదారులతో పోలిస్తే తమకు ప్రభుత్వ ఆదేశాలను కోర్టులలో సవాలు చేసే విషయంలో పరిమితులు ఉన్నాయని తెలిపింది. కాబట్టి బాధితులే కోర్టులను ఆశ్రయించాలని పిలుపునిచ్చింది. భారతదేశ సెన్సార్‌షిప్ విధానాలపై కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, ఎక్స్‌కు మధ్య వివాదం నడుస్తోంది. ప్రభుత్వ సెన్సార్‌షిప్ విధానాలను సవాలు చేస్తూ ఇప్పటికే ఎక్స్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. దానిపై తీర్పు వెలువడక ముందే తాజాగా ప్రముఖ వార్తాసంస్థ రాయిటర్స్ ఎక్స్ హ్యాండిల్స్ రెండింటిని ఆపేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో మరోసారి వివాదం రాజుకుంది. భారత ప్రభుత్వం విజ్ఞప్తి మేరకే వాటిని ఇక్కడి ప్రజలకు అందుబాటులో లేకుండా ఆపేశామని ఎక్స్ ఇండియా విభాగం ప్రకటించింది. రాయిటర్స్ ఎక్స్ ఖాతాలు జూలై మూడవ తేదీ సాయంత్రం నుంచి ఆరవతేదీ సోమవారం సాయంత్రం వరకు భారత్‌లో పని చేయలేదు. ఐటీ చట్టం 69(ఎ) నిబంధన కింద 2,355 ఎక్స్ ఖాతాలను గంట సేపట్లో బ్లాక్ చేయాలని భారత ప్రభుత్వం తమను ఆదేశించిందని, అందులో రాయిటర్స్, రాయిటర్స్ వరల్డ్ ఎక్స్ ఖాతాలు కూడా ఉన్నాయని ఎక్స్ తెలిపింది. ప్రభుత్వ ఆదేశంలో ఎలాంటి కారణాలను చూపలేదని చెప్పింది. అయితే, సాంకేతిక కారణాల వల్లే



రాయిటర్స్ ఖాతాలు బ్లాక్ అయ్యాయని, వాటిని బ్లాక్ చేసే ఉద్దేశం లేదని, సమస్య పరిష్కారం కోసం ఎక్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని గత ఆదివారం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎక్స్ ఇండియా విభాగం స్పందించింది. ఇది సాంకేతిక సమస్య కాదని, రాయిటర్స్ రెండు ఖాతాలే కాకుండా వాటితో పాటు మొత్తం 2,355 ఖాతాలను బ్లాక్ చేయమని ఆదేశాలు రావడం వల్లే తాము చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. అయితే, ఎక్స్ ఆరోపణలపై భారత ప్రభుత్వం ఖండించింది. జూలై 3న ఎక్స్ ఖాతాలను బ్లాక్ చేయాలని తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెప్పింది. మీడియా సంస్థల ఖాతాలను బ్లాక్ చేసినట్లు తెలియగానే వాటిని అన్‌బ్లాక్ చేయాలని సమాచారం ఇచ్చామని వెల్లడించింది. ఆ తర్వాత ఎక్స్ వాటిని అన్‌బ్లాక్ చేయడానికి 21 గంటల సమయం తీసుకుందని తెలిపింది. తామే వెంటబడి వాటిని అన్‌బ్లాక్ చేయించామని చెప్పింది. రాయిటర్స్ ఖాతాలను బ్లాక్ చేయించాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేసింది. ఎక్స్ చెబుతున్న జాబితా మే 9న ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఇచ్చిన ఆదేశాలని, వాటిని అప్పుడు అమలు చేయకుండా ఇప్పుడు చేశారని అధికారులు చెబుతున్నారు. అయితే, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లకుండా చూసేందుకు భారత ప్రభుత్వం 8,000 ఖాతాలను బ్లాక్ చేయమని ఆదేశించిందని మే 9వ తేదీనే ఎక్స్ ప్రకటించింది. వాటిని అమలు చేశామని అదే రోజు చెప్పింది. అందులో పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు ఉన్నాయి.కాగా, ఖాతాల బ్లాకింగ్ అంశంపై ఎక్స్ గత మార్చిలో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. ఇంటర్నెట్‌లో అభ్యంతరకరమైన పోస్టులను ఐటీ చట్టంలోని 69(ఎ) ద్వారా ఒక కమిటీ సూచించిన తర్వాత తొలగించాలని వాదించింది. కేంద్ర ప్రభుత్వం 79(3)(బి) సెక్షన్‌ను ఉపయోగించి సహయోగ్ పోర్టల్ ద్వారా తొలగించాల్సిన అంశాలను ఏకపక్షంగా నిర్దేశిస్తోందని తెలిపింది. ఈ కేసులో మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. సహయోగ్ పోర్టల్‌తో ప్రభుత్వ అధికారికి తన సొంత నిర్ణయంతో ఇష్టం వచ్చినట్లు ఏ ఖాతానైనా బ్లాక్ చేసే అధికారం లభించిందని ఎక్స్ వాదించింది.

డ్రీమ్‌లైనర్ అత్యంత సురక్షితం

- పీఏసీ సమావేశంలో ఎయిరిండియా సమర్థన
- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక

న్యూఢిల్లీ, జూలై 8: అహ్మదాబాద్‌లో అత్యంత ఘోర విషాదానికి కారణమైన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం పనితీరును ఎయిరిండియా సమర్థించింది. ప్రస్తుతం ఆపరేషన్‌లో ఉన్న అత్యంత సురక్షితమైన విమానాల్లో ఒకటిగా అభివర్ణించింది. ప్రపంచవ్యాప్తంగా వెయ్యికి పైగా డ్రీమ్‌లైనర్లు పనిచేస్తున్నాయని పేర్కొంది. ఈ మేరకు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)కి సమర్పించిన నివేదికలో ఎయిరిండియా పేర్కొందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 'ఎయిర్‌పోర్టుల్లో లెవీ చార్జీలు' అంశంపై చర్చించడానికి ఏర్పాటైన ఈ సమావేశంలో జూన్ 12నాటి ప్రమాద ఘటన ప్రస్తావనకు రావడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. విమానాల్లో భద్రతా ప్రమాణాలపై ఆయా విమానయాన సంస్థలు సమాధానం చెప్పాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఇటీవల విమానాల్లో తరచుగా చోటుచేసుకుంటున్న భద్రతా లోపాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్)తో తక్షణ ఆడిట్ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో పౌర విమానయాన శాఖ, డీజీసీఏ, ఏఏఐ, ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ, బీసీఏఎస్ ఉన్నతాధికారులు, ఎయిరిండియా సీఈవో విల్సన్ క్యాంప్‌బెల్‌తో పాటు ఇండిగో, ఆకాశ ఎయిర్, ఇతర విమానయాన సంస్థల సీనియర్ ప్రతినిధులు హాజరయ్యారు. కాగా,ఎయిరిండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు చేపట్టిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) తన ప్రాథమిక నివేదికను మంగళవారం పౌర విమానయాన శాఖకు సమర్పించింది.

నేను పార్ట్ టైమ్ యాక్టర్..

- ఫుల్ టైం పొలిటీషయన్‌ను: స్మృతి ఇరానీ



టీవీ షో ప్రచార చిత్రం

న్యూఢిల్లీ, జూలై 8: "నేను ఫుల్ టైమ్ పొలిటీషియన్‌ను.. పార్ట్ టైమ్ యాక్టర్‌ను" అని బీజేపీ సీనియర్ నాయకురాలు స్మృతి ఇరానీ అన్నారు. తాను నటించిన 'క్యూంకీ సాస్ భీ కభీ బహూ థీ' టీవీ షో ఈ నెల 29 నుంచి స్టార్ ప్లస్‌లో ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో స్మృతి ఎన్డీటీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు. "రాజకీయ నాయకుల్లో చాలా మంది పార్ట్ టైమ్ లాయర్లు ఉన్నారు. పార్ట్ టైమ్ జర్నలిస్టులున్నారు. అలాగే నేను పార్ట్ టైమ్ యాక్టర్‌ను" అని స్మృతి ఇరానీ అన్నారు. క్యూంకీ సాస్ బీ కభీ బహూ థీ టీవీ షో 2000 సంవత్సరంలో మొదటిసారి ప్రసారం అయింది. అప్పుడు స్మృతి ఒక్కో ఎపిసోడ్‌కు రూ.1,800 తీసుకున్నారు. ఇప్పుడు అదే పేరుతో మళ్లీ టీవీ షో రాబోతోంది. ఈ సారి ఆమె ఒక్కో ఎపిసోడ్‌కు రూ.14లక్షలు తీసుకోనున్నారు.

67 మందిని కాపాడిన భౌభౌ!

మండి, జూలై 8: భారీ వర్షాలతో అతలాకులతమైన హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ పెంపుడు కుక్క అరుపు 67మందిని కాపాడింది. జూన్ 30న అర్ధరాత్రి సియతి గ్రామంలో నరేంద్ర అనే వ్యక్తి ఇంట్లో కుక్క పెద్దగా అరవడం ప్రారంభించింది. నిద్రలేచిన నరేంద్ర వెళ్లి చూడగా.. గోడకు పెద్ద పగుళ్లు ఏర్పడి, ఇంట్లోకి నీరు వస్తున్నాయి. వెంటనే కుక్కతో పాటు కిందకు పరిగెత్తి, అందరినీ నిద్రలేపానని నరేంద్ర తెలిపారు. ఆ తర్వాత గ్రామంలోని ఇతరులను కూడా నిద్రలేపి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని చెప్పానన్నారు. అలా వారు వెళ్లారో లేదో.. కొద్దిసేపటికి గ్రామంపై కొండచరియలు విరిగిపడ్డాయి..

జర్మనీ విమానంపై చైనా యుద్ధనౌక లేజర్!

బెర్లిన్, జూలై 8: ఎర్ర సముద్రం మీదుగా ఎగురుతున్న తమ విమానాన్ని.. చైనా మిలటరీకి చెందిన యుద్ధనౌక ఇటీవలే లేజర్ కిరణాలతో టార్గెట్ చేసిందని జర్మనీ ఆరోపించింది. తమదేశంలోని చైనా రాయబారిని పిలిపించి.. ఈ ఘటనపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఎర్రసముద్రంలో తిరిగే వాణిజ్య నౌకలపై యెమెన్‌కు చెందిన హౌతీ రెబెల్స్ దాడులు చేస్తున్న నేపథ్యంలో.. వాటిని రక్షించేందుకు యూరోపియన్ యూనియన్ ఎర్ర సముద్రంపై 'ఆపరేషన్ యాస్పైడ్స్' పేరిట నిఘా చర్యలు చేపట్టింది. నిఘా విధుల్లో ఉన్న తమ విమానంపై ఎలాంటి హెచ్చరికలూ చేయకుండా, కారణం కూడా చెప్పకుండా చైనా లేజర్ కిరణాలను ప్రయోగించిందని జర్మనీ మండిపడింది.



ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం



విజయవాడ (ఇంద్రకీలాద్రి), జూలై 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని వివిధ కూరగాయల తోరణాలతో అలంకరించారు. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల నుంచి దాతలు ఇచ్చిన కూరగాయలతో అలంకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం సుమారు 50 మెట్రిక్ టన్నుల కూరగాయలను అలంకరణకు వినియోగించారు. ఈ నెల 10వ తేదీ ఉదయం మహాపూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయి. మంగళవారం తొలి ప్రత్యేక పూజలో ఈవో శీనానాయక్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- జూదరుల అరెస్ట్.. శిబిరం సీజ్
- వెలమవారిపాలెంలో పోలీస్ పికెట్
- పరారీలో శిబిరం నిర్వాహకుడు



పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసిన పోలీసులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుంటూరు, నగరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రేపల్లె అడ్డాగా విచ్చలవిడిగా నిర్వహిస్తున్న పేకాట శిబిరానికి 'ఆంధ్రజ్యోతి' కథనంతో బ్రేక్ పడింది. 'పబ్లిక్‌గా పేకాట... మందు... విందులతో జూదగాళ్ల జోరు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం కథనం వెలువడింది. దీంతో పోలీసు శాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బాపట్ల జిల్లా నగరం మండలంలోని వెలమవారిపాలెంలో కొద్ది రోజులుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. అక్కడ క్షణాల్లో లక్షాధికారులను భిక్షగాళ్లుగా మార్చే 'కోత' (కోసు) పందెం ఆటను ప్రధానంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్లు తరలివస్తున్నారు. చుట్టుపక్కలవారు దీనిని చూసినా.. వారికి అడిగే ధైర్యం లేదు....ఫిర్యాదు చేసే సాహసం లేదు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు మంగళవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించి 9 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్దనున్న నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. శిబిరాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇకపై గ్రామంలో పేకాట జరక్కుండా చూసేందుకు ప్రత్యేకంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామని డీఎస్పీ చెప్పారు.

ఆడేదేమో రాత్రిపూట.. దాడులేమో పగలు!

ఈ గ్రామంలో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు జూదం జోరుగా సాగుతుంది. సోమవారం రాత్రి కూడా సుమారు 90 మంది జూదరులు శిబిరానికి వచ్చి తెల్లారే వరకు మందు, విందు, పేకాటతో గడిపారు. అయితే పోలీసులు మంగళవారం పగటిపూట దాడులు చేసి, 9 మందిని అరెస్టు చేశామని ప్రకటించటాన్ని స్థానికులు నివ్వెరపోతున్నారు. దాడుల సమయంలో మీడియాను కూడా అనుమతించలేదు.

అరెస్టులా.. డ్రామానా?

ఈ శిబిరం ప్రధాన నిర్వాహకుడైన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని ఏలూరుపాడు ప్రాంతానికి చెందిన వ్యక్తి మాత్రం పోలీసులకు దొరకలేదు. ఇతను పేకాట శిబిరం ద్వారా వచ్చే సంపాదనతో రూ.5 కోట్ల విలువ చేసే భవనం నిర్మించుకున్నట్టు తెలిసింది. పోలీసులు మాత్రం అతడిని పట్టుకోవాలనే ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వార్త రావడంతో నిర్వాహకుడితోపాటు జూదరులు కూడా అప్రమత్తమయ్యారు. దీంతో 'ఈ ఒక్కరోజుకు ఆట ఆపుదాం' అని నిర్వాహకుడు, జూదరులు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయినా.. అక్కడ మంగళవారం కూడా జూదం జరిగినట్టు, 9 మంది పట్టుబడినట్లు పోలీసులు ప్రకటించటం విశేషం. నిర్వాహకుడే ఎవరో అనామకులను చూపించి, అరెస్టు డ్రామా నడిపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రస్తుత గ్రామంలో జూద శిబిరాన్ని తాత్కాలికంగా మూసేసి, మరో గ్రామంలో నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. రెండు రోజుల్లో మరో గ్రామాన్ని ఎంపిక చేసి లోకేషన్ షేర్ చేస్తానని నిర్వాహకుడు చెప్పినట్లు తెలిసింది.

జూదరుల అరెస్టు.. 25,670 స్వాధీనం

వెలమవారిపాలెంలో పేకాట శిబిరంపై దాడిచేసి తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేశామని, వారి నుంచి రూ.25,670 స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ పేకాట నిర్వహణ ప్రాంతంలోని గోడకు నోటీసులు అంటించామని చెప్పారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, ఎవరైనా పేకాట ఆడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

నేవీ చేతికి డైవింగ్ సపోర్ట్ నౌక 'నిస్తార్'



'నిస్తార్'పై నేవీ ఉన్నతాధికారులు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించిన డైవింగ్ సపోర్ట్ నౌక 'నిస్తార్'ను మంగళవారం నేవీకి అందజేసింది. స్వీకార పత్రాలపై రియర్ అడ్మిరల్ రవనిష్ సేథ్ సమక్షంలో షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి, నిస్తార్ సీఓ కమాండర్ అమిత్ సుబ్రో బెనర్జీ సంతకాలు చేశారు. నిస్తార్‌ను పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు. దీనికి ముందు ఐఎన్ఎస్ ధ్రువ్‌ని 2020లో హెచ్ఎస్ఎల్ నేవీకి అందించింది.

సెప్టెంబరు 1న పెన్షన్ మార్చ్

- ఇరవై ఏళ్లుగా పెన్షన్‌లేని సర్వీసులు
- రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మంది ఉద్యోగుల ఆవేదన
- ఏపీసీపీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు

విజయవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులపై వెన్నుపోటు పొడిచిన సెప్టెంబరు 1వ తేదీన విజయవాడ-గుంటూరు మధ్య 'పెన్షన్ మార్చ్' చేపట్టనున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు 20 ఏళ్లుగా పెన్షన్ లేకుండానే సర్వీసు కొనసాగిస్తున్నారని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. వృద్ధులకు ఇచ్చే సామాజిక పింఛనులో సగం మొత్తాన్ని కూడా 30 ఏళ్ల సర్వీస్ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని తాము పోరాటాలు చేస్తుంటే అంతకంటే నష్టం చేకూర్చే జీపీఎస్, యూపీఎస్ పేరుతో పెన్షన్‌దారులను మభ్యపెట్టాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం 2003లో అర్హులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని, కానీ వాళ్లను ఇంతవరకు మోసం చేస్తూనే ఉన్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఏ విధంగా అణిచివేత ధోరణి చూపిందో అదే పరిస్థితి కూటమి ప్రభుత్వంలో కూడా కనిపిస్తోందన్నారు. సీపీఎస్ ఉద్యోగులపై ఉన్న అక్రమకేసులు ఎత్తివేయాలని, ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



స్వర్ణాల చెరువులో కోరికల రొట్టెను మార్చుకుంటున్న మహిళాభక్తులు

దారులన్నీ దర్గా వైపే!

- రొట్టెల పండగకు భారీగా తరలివచ్చిన భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా వాహనాలు.. దారులన్నీ దర్గా వైపే అన్నట్టుగా నెల్లూరు నగరం కిక్కిరిసిపోయింది. మంగళవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం జరిగింది. కోటమిట్టలోని అమీనియా మసీదులో గంధం కలిపిన బిందెలతో ఊరేగింపుగా బారాషహీద్ దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దర్గాలోని అమరుల సమాధాలకు కడప పీఠాధిపతి అరీఫుల్లా హుసేనీ, ఇతర మతపెద్దలు గంధం ఎక్కించారు. ఈ సందర్భంగా గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ ఘట్టం ముగియడంతో అధికారికంగా రొట్టెల పండుగ ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే భక్తులు వరాల రొట్టెలను ఇచ్చిపుచ్చుకున్నారు.

సొంత ఊరి కోసం ప్రవాసీయుడి వితరణ

- అన్నదాతల కోసం బోరు బావి ఏర్పాటు



పామిరెడ్డి రామిరెడ్డి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పొట్ట చేతబట్టుకుని ప్రవాసం పోయినా ఉన్న ఊరి గురించి... అక్కడి అన్నదాతల అగచాట్ల గురించి ఆలోచించడం మానలేదాయన! ఉపాధి కోసం గల్ఫ్ వచ్చినా సొంత ఊరిలో ఉన్న తన సాగు భూమి... దాని చుట్టుపక్కల ఉన్న రైతుల వ్యవసాయ అవసరాల కోసం తనవంతు ఏదైనా చేయాలని తలపోశాడు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సొంత ఊరి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని సొంత ఖర్చుతో బోరు బావిని తవ్వించాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రుకు చెందిన పామిరెడ్డి రామిరెడ్డి ఆటోమొబైల్ ఇంజినీరింగ్ చేసి గల్ఫ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. తన సొంత ఊరి లో భూగర్భ జలాలు అడుగంటిపోతుండడం రామిరెడ్డిని కలవరపరిచింది. అక్కడి రైతుల ఇబ్బందులు కొంతైనా తీర్చాలని సొంత ఖర్చుతో ఒక బోరుబావిని తవ్వించాడు. దీంతో తన భూమితోపాటు చుట్టుపక్కల ఉన్న ఎనిమిది మంది సన్నకారు రైతుల సాగునీటి అగచాట్లు తీరాయి. తమకు వారసత్వంగా వచ్చిన భూమితో పాటు చుట్టుపక్కల పొలాలకు సాగునీరు అందుబాటులో లేకపోవడంతో వర్షాధారిత పంటలు మాత్రమే సాగు చేయాల్సి వస్తుందని అందుకే తన వంతుగా బోరు బావి తవ్వించానని రామిరెడ్డి తెలిపారు.

బలవంతపు భూసేకరణ ఆపండి

- కరేడు రైతులను కాపాడండి: సీపీఎం శ్రీనివాసరావు

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో తలపెట్టిన బలవంతపు భూసేకరణను తక్షణం నిలిపివేయాలని, రైతులను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేవలం ఓ కంపెనీ కోసం 20వేల మంది జీవితాలను పణంగా పెట్టడం ప్రభుత్వానికి ఏమాత్రం మంచిదికాదని ఆయన అన్నారు. కందుకూరులో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్రోకర్లుగా వ్యవహరిస్తూ.. రైతుల భూములను లాగేసుకోటానికి ప్రయత్నిస్తుండటం దారుణమని విమర్శించారు. కరేడులో కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఏకతాటిపై నిరసిస్తుంటే, ఇంతవరకు ప్రభుత్వం స్పందించకపోవటం దేనికి సంకేతమని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి అభ్యంతరాలు లేని, పంటలకు యోగ్యంకాని భూములు, ప్రభుత్వ భూములను ఇలాంటి సంస్థలకు కేటాయించాలేకానీ మూడు పంటలు పండే పచ్చని భూములను ఎందుకు ఇవ్వాలనుకుంటోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు(పీఏసీఎస్) ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతమున్న అధికార పర్సన్ ఇన్‌చార్జి స్థానంలో అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తోంది. ఈ మేరకు మంగళవారం పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. త్రిసభ్య కమిటీలో ఒకరు ఛైర్‌పర్సన్‌గా, ఇద్దరు సభ్యులుగా నియమితులయ్యారు. జూలై 30 వరకు గడువున్న 468 పీఏసీఎస్‌లకు, అక్టోబరు 30 వరకు గడువున్న 23 పీఏసీఎస్‌లకు అధికార పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించి, త్రిసభ్య కమిటీలను నియమించింది. కాగా వ్యవసాయ మార్కెటింగ్ చట్టంలోని కమిషన్ ఏజెంట్ల లైసెన్సులకు సంబంధించి సవరణ ఉత్తర్వులను జారీ చేసింది. దీని ప్రకారం తాజాగా లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే కమిషన్ ఏజెంట్లు వారి అంచనా వేసిన వార్షిక టర్నోవర్‌ను ప్రకటించి, బ్యాంక్ గ్యారెంటీని సమర్పించాలని ఆదేశించింది. ఏడాది పొడవునా వాస్తవ టర్నోవర్... ప్రకటించిన మొత్తానికి మించి ఉంటే వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి నోటీస్ అందిన వెంటనే అదనపు బ్యాంక్ గ్యారెంటీని సమర్పించాలి. లేకపోతే లైసెన్సులు రద్దు చేసే అవకాశం ఉందని ఈ సవరణ ఉత్తర్వుల్లో పేర్కొంది.

జీవ వైవిధ్య బోర్డులో ఎక్స్‌అఫీషియో సభ్యుల నియామకం

ఎక్స్‌అఫీషియో సభ్యులతో రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డును ప్రభుత్వం పునర్నియమించింది. వివిధ శాఖలకు చెందిన 8 మంది ఉన్నతాధికారులను బోర్డులో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నియమించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలిలో నీరు, గాలి, పర్యావరణ నమూనాల విశ్లేషణ చార్జీలను వివరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సర్దుపోటు లేదు.. ట్రూఅప్ బాదుడూ ఉండదు

- ఈ ఏడాది కరెంటు చార్జీలు పెరగవు: డిస్కంలు
- అధిక ధరలతో విద్యుత్ కొనుగోళ్లు తగ్గించాం
- దీంతో ఆదాయం పెరిగింది
- జగన్ హయాంలో ఏటా జనంపై భారం
- మూడేళ్లలో రూ.18,568 కోట్ల బాదుడు
- మూడు విద్యుత్ సంస్థల ఎండీల వెల్లడి

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెరగవని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ సంయుక్తంగా స్పష్టం చేశాయి అలాగే సర్దుబాటు చార్జీల భారంగానీ, ట్రూఅప్ చార్జీల భారంగానీ మోపబోమని తేల్చిచెప్పాయి. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వెల్లడించిన 2024-25 విద్యుత్ విక్రయాల ఆడిట్ గణాంకాల్లో తమ లెక్కలను విడివిడిగా చూపడంతో.. ఒక్కో సంస్థలోని ఆదాయ వ్యయాల్లో వ్యత్యాసాలు కనిపించాయని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ఏటా ఆదాయ వ్యయాల నివేదికలను మూడు డిస్కంలూ కమిషన్‌కు వేర్వేరుగా ఒకేసారి సమర్పిస్తాయని గుర్తుచేశాయి. రాష్ట్రంలోని మూడు డిస్కంల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే విద్యుత్ విక్రయాల్లో రూ.456 కోట్ల మిగులు ఉందని ధ్రువీకరించాయి దీనివల్ల విద్యుత్ వినియోగదారులపై ఇంధన సర్దుబాటు చార్జీలు గానీ, ట్రూఅప్ చార్జీలు గానీ పడబోవని, వాటిని విధించే అవసరం లేదని డిస్కంల సీఎండీలు సంతోషరావు, పృథ్వీతేజ, పుల్లారెడ్డి సదరు ప్రకటనలో తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. విద్యుత్ రంగంలో సమర్థ యాజమాన్య నిర్వహణ ద్వారా బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటు కొనడం తగ్గించామన్నారు. ఫలితంగా ఆదాయం పెరిగిందని చెప్పారు. ఈ మేరకు ఏపీఈఆర్సీకి వివరణ ఇస్తామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ఏటా ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతూ వచ్చిందని గణాంకాలతో వారు వెల్లడించారు. 2021-22లో రూ.3,082.99 కోట్లు, 2022-23లో రూ.6,072.77 కోట్లు, 2023-24లో రూ.9,412.50 కోట్లు.. మొత్తంగా రూ.18,568.26 కోట్లు భారం వేసిందని చెప్పారు. అలాగే అప్పట్లో పెంచిన విద్యుత్ చార్జీలను చార్జీలను పరిశీలిస్తే.. తాజా ప్రభుత్వం వచ్చాక విద్యుత్ కొనుగోలు వ్యయం గణనీయంగా తగ్గినట్లు అర్థమవుతోందన్నారు.

నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలి: సీఎస్

వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ డిస్కంలను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఆయన డిస్కంల ఎండీలతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్ష జరిపారు. అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని.. వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు అందించాలని స్పష్టంచేశారు. వార్డు సచివాలయాల్లో పనిచేసే విద్యుత్ సిబ్బంది పెన్షన్ల పంపిణీ రోజు మాత్రమే ఆ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని.. మిగిలిన సమయాల్లో విద్యుత్ శాఖ సేవలే నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపునకు కట్టుబడి ఉన్నాం

- త్వరలోనే జీవో విడుదల: ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా ఏడేళ్ల కాలపరిమితి దాటిన రవాణా వాహనాలపై గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు నిర్ణయానికి కట్టుబడి వెంటనే జీవో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఆంధ్రప్రదేశ్ లారీఓనర్ల సంఘం అధ్యక్షుడు పి.గోపాల్‌నాయుడు, ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడు వై.వి.ఈశ్వరరావు సచివాలయంలో సీఎం చంద్రబాబుకు రవాణా సమస్యలపై మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిత పన్ను తగ్గింపుపై ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలంటూ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రవాణా సమస్యల సత్వర పరిష్కారానికి ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని లారీ ఓనర్లకు హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంటుతో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పరచి, రాష్ట్రప్రభుత్వమే నడిపితే ఫిట్‌నెస్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి కోట్లలో ఆదాయం అందుతుందని వారు ముఖ్యమంత్రికి వెల్లడించారు. ఈ సెంటర్లను ప్రైవేటీకరించకుండా ప్రభుత్వమే నిర్వహించాలని వారు కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రవాణారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని లారీ ఓనర్ల సంఘం ప్రతినిధులు సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య 11 సంవత్సరాలుగా నిలిచిపోయిన కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల జారీ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సెప్టెంబరులోపు ఫైరింజన్లు కొంటాం

- నిధుల వినియోగంలో జాప్యానికి మూడు కారణాలు
- అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వివరణ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులతో ఫైరింజన్ల కొనుగోలు ప్రక్రియ సెప్టెంబరులోపు పూర్తి చేస్తామని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ శాఖ డైరెక్టర్ మురళి తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు, రాష్ట్ర ప్రభుత్వ నిధుల విడుదలలో ఆలస్యం, ఈ బాధ్యతలు చూసే డైరెక్టర్ స్వచ్ఛందంగా తప్పుకోవడం జాప్యానికి కారణాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఫైరింజన్ల కొనుగోలు, ఫైర్ స్టేషన్ల నిర్మాణంలో జాప్యంపై 'ఫైర్‌కు పైత్యం' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. గతేడాది జూలైలో రాష్ట్రానికి రూ.252.93కోట్లను కేంద్రం కేటాయించిందని, అందులో మొదటి విడతగా రూ.63.23కోట్ల బడ్జెట్ విడుదలైనా రాష్ట్ర ప్రభుత్వ వాటా 2025 జనవరిలో వచ్చిందన్నారు. కొనుగోలు ప్రక్రియకు సిద్ధం చేసేలోపు రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చిందని, అప్పటి వరకూ ఈ బాధ్యతలు చూసిన డైరెక్టర్ తాను తప్పుకుంటానని డీజీకి చెప్పడంతో మరో డైరెక్టర్ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తి చేయించి 111ఫైరింజన్ల ఛాసిస్‌లు కొనుగోలు చేశారని చెప్పారు. అవి ఏప్రిల్‌లో వచ్చాయని, రాష్ట్ర ఆర్థిక శాఖ నిధులు విడుదల చేస్తే బాడీ నిర్మించి సెప్టెంబరులోపే అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. మరో రూ.12.93కోట్లతో ఫైర్ స్టేషన్ల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్నవి పూర్తి చేసేందుకు ఏపీ పోలీస్ హౌసింగ్‌కు నిధులు మళ్లించినట్లు తెలిపారు. కాగా, రాష్ట్ర ఆర్థిక శాఖ నిధుల విడుదలలో జాప్యం చేయడానికి డీపీఆర్‌లో మార్పులు చేయడమే కారణమని తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దలైలామా ఆకాంక్ష

హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంతో మంది ప్రముఖులు దేశవిదేశాలనుంచి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమెరికా సహా పలు దేశాల ప్రతినిధులు, నాయకులు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులు, వేలాదిమంది టిబెటన్లు తరలివచ్చారు. ప్రేమ, కరుణ, సహనం ఇత్యాది సద్గుణాలకు ప్రతిరూపంగా దలైలామాను అభివర్ణిస్తూ 140కోట్లమంది భారతీయుల తరఫున ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియచేశారు. కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు, అరుణాచల్ ముఖ్యమంత్రి పెమాఖండూ ఇత్యాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యంలో, ఎప్పటిలాగానే చైనా మరోమారు తన అభ్యంతరాలను, ఆక్షేపణలను తెలియచేసింది. టిబెట్‌తో ముడివడిన వ్యవహారాలమీద చైనా వైఖరి సుస్పష్టం, బీజింగ్ అభిప్రాయాలను భారత్ కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిందే అని చైనా వ్యాఖ్యానించింది. ఈ వేడుకలకు కొద్దిరోజుల ముందు, తన వారసుడి ఎంపికకు సంబంధించి దలైలామా వెలువరించిన సందేశం, దానిపై భారతప్రభుత్వ వైఖరి చైనాకు ఆగ్రహం కలిగించిన విషయం తెలిసిందే. చైనాతో ఇప్పుడున్న వివాదాలకు 15వ దలైలామా ఎంపిక అంశం కూడా తోడైరాబోయేరోజుల్లో ఇరుదేశాల మధ్యా మరింత దూరం, వేడీ పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కోరికలు కూడదని చెప్పిన బౌద్ధంలో ఈ వ్యాఖ్యలేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు గానీ, తాను మరో నలభై యేళ్ళు జీవించాలని దలైలామా అనుకుంటున్నారు. అవలోకితేశ్వరుడి ఆశీస్సులతో బౌద్ధానికీ, భక్తులకూ మరిన్ని దశాబ్దాలు సేవ చేసుకోవాలని కోరుకుంటున్నారు. గత ఏడాది కూడా ఆయన తన జీవితకాలం గురించి వ్యాఖ్యలు చేస్తూ, నూటపదేళ్ళకంటే ఎక్కువే జీవిస్తానన్నారు. కచ్చితంగా 113సంవత్సరాలు ఉంటానని ఐదేళ్ళక్రితమే మరో లెక్కగట్టారు. మొత్తానికి తాను అధికకాలం నిండుగా జీవించి బౌద్ధానికి సేవలందించాలన్నది అభిలాష. ఎక్కువకాలం జీవించాలని దేవుడినుంచి సంకేతాలందాయని కూడా అంటున్నందున, ఆయన అభీష్టం నెరవేరాలనే అంతా కోరుకుంటున్నారు. ఇక, తన ఆధ్యాత్మిక వారసత్వ ఎంపిక అంశాన్ని 90వ పుట్టినరోజు సందర్భంలో నిర్ణయిస్తానని పద్నాలుగు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీకి అనుగుణంగానే ఇటీవలి ఆయన ప్రకటన వెలువడిందనుకోవాలి. భారతదేశం కేంద్రంగా పదేళ్ళక్రితం ఆరంభించి, స్విట్జర్లాండ్‌లో రిజిస్టర్ చేసిన తన ట్రస్టుకే భావి దలైలామాను నిర్ణయించే అధికారం ఉంటుందని ఆయన విస్పష్టంగా ప్రకటించారు. ఇందులో వేరెవరిపాత్రకూ తావులేదని చైనాను జీరోచేశారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రకటనకోసమే ఎదురుచూస్తున్న చైనా సహజంగానే ఘాటుగా స్పందించింది. భావి దలైలామా చైనా ప్రధాన భూభాగంలో జన్మించినవాడై ఉండాలని, చైనా చట్టాలకు, నిబంధనలకు లోబడి లామా వారసత్వం కొనసాగాలని ఆ దేశం వెంటనే ప్రకటించింది. బంగారు కలశం నుంచి లాటరీతీసి లామాను ఎంపికచేసే రెండువందలయాభై ఏళ్ళనాటి విధానాన్ని చైనా ప్రతిపాదిస్తోంది.

తన మాతృభూమికోసం, ప్రజలకోసం చైనాతో సాగించిన ఏడుదశాబ్దాల పోరాట అనుభవాలతో దలైలామా ఈ ఏడాదిమార్చిలో విడుదల చేసిన గ్రంథంలో, తన పునర్జన్మ చైనా ప్రధాన భూభాగానికి ఆవల జరుగుతుందని తేల్చేశారు. తద్వారా, చైనా భావి ఎంపికని వీసమెత్తు విలువ లేనిదిగా మార్చేశారు. 1995లో ఆయన తన తరువాతి స్థానమైన పంచన్ లామాగా నియమించిన ఆరేళ్ళబాలుడిని చైనా ముప్పయేళ్ళుగా టిబెటన్లకు కనిపించకుండా చేసింది. పోటీగా చైనా నియమించిన వ్యక్తికి టిబెట్‌లో ఏమాత్రం గౌరవాభిమానాలు లేవు. ఈయన టిబెట్‌లో కాక, బీజింగ్‌లో ఉంటూ,. అప్పుడప్పుడు వెళ్ళివస్తూ చైనాపెద్దల ఆదేశాలకు అనుగుణంగా టిబెట్‌ను ఆధ్యాత్మికంగా విలీనం చేసే పనిలో ఉన్నారు. ఈయనను పీఠాధిపతిగా చైనా ప్రతిష్ఠించబోతున్నదని వార్తలు వస్తున్న తరుణంలో వ్యవహారం ముదిరిపాకన పడుతున్నదని అర్థం. పరిణామాలు ఎలా మారినా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న టిబెటన్ల ఆధ్యాత్మిక కేంద్రంగా హిమాచల్‌లోని ధర్మశాల కొనసాగబోతున్నది. ప్రస్తుతానికి భారత ప్రభుత్వం ఈ వివాదంమీద ఎక్కువగా మాట్లాడకపోయినప్పటికీ, అవసరమైన తరుణంలో అది ఏ మాత్రం వెనక్కుతగ్గదని ఆశించాలి.

విభిన్న భాషలు, వివిధ సంస్కృతులు మన విశిష్టత. భారతీయులు స్వదేశంలో ఉన్నా, విదేశాలలో ఉన్నా తమ మాతృభాషతో పాటు అనుసంధాన భాషగా హిందీని స్వచ్ఛందంగా నేర్చుకోవాలి. సంకుచిత రాజకీయ కారణాలకు అతీతంగా జాతి నిర్మాణంలో ఈ భాషా బంధం బలపడాలి.

జాతి నిర్మాణంలో హిందీ బంధం

జీవనోపాధికి కన్న ఊరు, మాతృదేశం విడిచి సుదూర సీమలకు వెళ్లిన తర్వాత తల్లి భాష, స్వీయ జాతీయ సంస్కృతి ప్రాధాన్యం తెలిసివస్తుంది. ప్రపంచంలో 193 దేశాలున్నాయి. ఇంచుమించు ఈ సమస్త దేశాల వారు గల్ఫ్ రాజ్యాలలో, ముఖ్యంగా దుబాయిలో ఉంటున్నారు. ఒక్క భారతీయులు మినహా ఇతర జాతీయులు అందరూ తమ తమ భాషలలో పరస్పరం సంభాషించుకుంటారు. ఇటువంటి అవకాశం భారతీయులకు లేదు.

హిందీ లేదా ఆంగ్లం రాని ఒక భారతీయుడు తన భాష తెలియని తోటి స్వదేశస్థుడితో అరబ్బీ భాషలో మాత్రమే మాట్లాడగలుగుతాడు. చివరకు తమ ఫిర్యాదులతో భారతీయ దౌత్య కార్యాలయాలకు వచ్చే దక్షిణ భారత ప్రవాస కార్మికులు

గల్ఫ్ లేఖ

అనేక మంది అరబ్బీ భాషలోనే తమ గోడు చెప్పుకోవడం కద్దు. క్రింది స్థాయి దౌత్య సిబ్బంది అరబ్బి నుంచి హిందీ భాషలోకి అనువదించి అధికారులకు వివరిస్తారు. తెలుగు ప్రవాసులు లేదా ఉత్తరాది వారు ఉదయం వేళ అల్పాహారానికై మలయాళీలు నిర్వహించే హోటల్‌కు వెళ్ళి అరబ్బిలో ఆర్డరు ఇస్తారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన మహిళ ఒకరు తెలుగు మినహా మరే భాష రాకపోవడంతో సుమారు ఒక సంవత్సరం జైలులో మగ్గిపోవలసివచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అలోక్ తివారీ సౌదీ అరేబియాలోని ఒక విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు. ఆయనకు తెలుగు మిత్రులు ఎక్కువ. ఒకసారి ఆయన కుటుంబసమేతంగా తెలంగాణ పర్యటనకు వెళ్లారు. అయితే భాషాపరమైన ఇబ్బందితో అర్థాంతరంగా ఆయన తన పర్యటనను ముగించుకోవలసివచ్చింది. బహుళ జాతి సంస్థలలో పనిచేసే నానా దేశాల వారు మధ్యాహ్న భోజన విరామంలో ఆయా జాతీయులు అందరూ కలిసి ఒక్కచోట తమ తమ భాషలలో మాట్లాడుకొంటుండగా, భారతీయులు మాత్రం ప్రాంతాలవారీగా విడిపోతుంటారు. మలయాళీలు ఒక బృందంగా, ఉర్దూ మాట్లాడే హైదరాబాదీలు



మరో సమూహంగా విడిపోతుంటారు. హిందీ భాష రాని కారణంగా ఐ.టి నిష్ణాతులైన తెలుగు ఇంజినీర్లు తాము పని చేస్తున్న సంస్థలలో తోటి భారతీయులతో కలివిడిగా ఉండలేకపోతున్నారు. ఇది వారిని సామాజికంగా ఏకాకులను చేస్తోంది.

ఈ నేపథ్యంలో హిందీ ప్రాధాన్యాన్ని తెలుసుకోవల్సిన ఆవశ్యకత ఉంది. విశాల భారతావని విభిన్న భాషలు, వైవిధ్య భరిత జీవనరీతులకు నెలవు. జాతీయ భాషా వివాదంలో మొదటి నుంచి హిందీని ఆ భాషేతరులపై బలవంతంగా రుద్దుతున్న ఒక అన్య భాషగా చిత్రీకరిస్తున్నారు. తమ భావజాల వ్యాప్తి కొరకు ఒక దేశం–ఒకే విధానంను అనుసరిస్తున్న భారతీయ జనతా పార్టీకి హిందీ మాట్లాడే రాష్ట్రాలలో రాజకీయ అధిపత్యం ఉన్నది. హిందీయేతర రాష్ట్రాలలో ఆ పార్టీ ప్రాబల్యం అంతగా లేదు. నూతన జాతీయ విద్యావిధానం క్రింద హిందీని వ్యూహాత్మకంగా అమలుపరుస్తున్నారనే బలమైన అభిప్రాయం నెలకొంటున్న నేపథ్యంలో మరాఠీ భాషా రాష్ట్రమైన మహారాష్ట్రలో హిందీ అమలు విషయమై ఉత్తర్వు జారీ చేయడం, ఉపసంహరించుకోవడం రెండూ జరిగాయి. ఇప్పటికే తమిళనాడులో డీఎంకె ప్రభుత్వం హిందీ అమలును పూర్తిగా రాజకీయ కోణం నుండి ఎదుర్కొంటూ బీజేపీని ఇరకాటంలో పెడుతోంది. తాము అధికారంలో ఉన్న మహారాష్ట్రలో సైతం హిందీకి వ్యతిరేకత రావడం బీజేపీ ప్రాబల్యానికి విఘాతమని చెప్పవచ్చు. అంత మాత్రాన హిందీ భాష వ్యాప్తికి బీజేపీ తన కృషిని విరమిస్తుందనుకోవడం పొరపాటు. అలాగని హిందీని వ్యతిరేకించడం కూడా పొరపాటే. ఒక సువిశాల దేశంలోని అనేక ప్రాంతాలలో నలుగురికి తెలిసే భాషను నేర్చుకోవడంలో తప్పేమీ లేదు. నేర్చుకోవాలి కూడా. పూర్తిగా అరబ్బీ దేశమైన సౌదీ అరేబియా తమ విద్యార్థులకు చైనీస్ భాషను బోధిస్తోంది. మహమ్మద్ రఫీ మధుర గీతాలను వినే మనం హిందీని తూర్పారపట్టడం ఏమిటి? దీన్ని మానుకోవాలి.

ఒక దేశం– ఒకే భాష అనేది ఒక విఫల ప్రయోగం. ప్రఖ్యాత ఆంగ్ల రచయిత జార్జి బెర్నాడ్ షా వ్యాఖ్యానించినట్లుగా అమెరికా, బ్రిటన్ రెండూ ఆంగ్లం మాట్లాడే రాజ్యాలయినా ఒకే జాతికి చెందినవి కావు. అలాగని అరబ్బులు అందరిదీ ఒకే భాష, ఒకే సంస్కృతి అయినా 22 దేశాలుగా విడిపోయి ఉన్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం మొదలు మహారాష్ట్ర–కర్ణాటక సరిహద్దు వివాదం దాకా ఎన్నో ఘర్షణలు భాషతో ముడిపడి ఉన్నాయి. తెలుగు భాష ఒక్కటయినా, యాస అనేది ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిందనేది మరిచిపోకూడదు. విభిన్న భాషలు, వివిధ సంస్కృతులు మన విశిష్టత. భిన్నత్వంలో ఏకత్వానికి భారత దేశమే యావత్ ప్రపంచానికి మార్గదర్శి. భారతీయులు స్వదేశంలో ఉన్నా, విదేశాలలో ఉన్నా తమ మాతృభాషతో పాటు భారతీయ అనుసంధాన భాషగా హిందీని స్వచ్ఛందంగా నేర్చుకోవడానికి ముందుకు రావాలి. సంకుచిత రాజకీయ కారణాలకు అతీతంగా జాతి నిర్మాణంలో ఈ భాషాబంధం బలపడాలి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మూలాలు విస్మరిస్తే మనుగడ కష్టం!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

జాతీయ పార్టీలు– భారత జాతీయ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ– రెండూ తమ రూపురేఖల్ని దిద్దుకునే క్రమాన్ని వేగవంతం చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీలో వివిధ రాష్ట్రాల అధ్యక్షుల నియామకంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ముద్ర స్పష్టంగా కనబడుతోంది. సంస్థాగత నియామకాల్లో మొదటి నుంచీ సిద్ధాంతాలకు కట్టుబడినవారు, అధికారంలో లేకపోయినా పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్న విషయమై సంఘ్, బీజేపీల మధ్య ఒక అవగాహన ఏర్పడినట్లు జరుగుతోన్న పరిణామాలు విశదం చేస్తున్నాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, ఏబీవీపీ, యువ మోర్చాలతో బలమైన సంబంధం ఉన్న ఎన్.రామచందర్ రావు, మాధవ్‌లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడమే ఇందుకు నిదర్శనం. మాధవ్ తండ్రి పి.వి. చలపతిరావు నిబద్ధ సంఘీయుడు. పదేళ్ల వయస్సు నుంచే ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన చరిత్ర ఆయనకు ఉన్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా, ఎమ్ఎల్‌సీగా కూడా ఆయన పనిచేశారు రామచందర్ రావుకు అలాంటి నేపథ్యం ఏమీ లేదు. ఇంటా, బయటా ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ విద్యార్థి దశనుంచే ఒక భావజాలానికి కట్టుబడి రకరకాల దాడులను ఎదుర్కొని నిలబడిన చరిత్ర ఆయనది. ఏపీ, తెలంగాణలోనే కాదు, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, హిమాచల్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో సంఘ్ నేపథ్యం ఉన్నవారికే పార్టీ పగ్గాలు అందించారు. దేశంలో హిందుత్వ భావజాలం విస్తరిస్తున్నందువల్ల వ్యక్తులు, కులాలకు అతీతంగా భారతీయ జనతా పార్టీని ఒక సైద్ధాంతిక పార్టీగా బలోపేతం చేయగలమనే విశ్వాసం ఆ పార్టీ నేతల్లోను, సంఘ్ పెద్దల్లోనూ కనబడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశంలో నలుమూలలా హిందూ సమ్మేళనాలు ఏర్పాటు చేసి హిందువులను సంఘటితం చేయాలని గత వారం ఢిల్లీలో జరిగిన మూడు రోజుల ప్రాంత ప్రచారక్ సమావేశం పిలుపునిచ్చింది.

సామాజిక, రాజకీయ సమీకరణాలకు భిన్నంగా మత ప్రాతిపదికగా ఒక పార్టీని పటిష్ఠం చేయడం సాధ్యమవుతుందా? ప్రజల్లో విస్తృత ఆమోదయోగ్యత ఉంటుందా? ఇతర రాజకీయ పార్టీల నుంచి బీజేపీలో చేరినవారు అందులో ఇమడగలుగుతారా అన్న చర్చ భారతీయ జనతా పార్టీలో ఎప్పటి నుంచో జరుగుతోంది. బీజేపీలో చేరేందుకు ఒకప్పుడు తెలుగుదేశం మాజీ నేత పి.ఉపేంద్ర ఆసక్తి చూపినప్పుడు 'మా పార్టీలో నీవు ఇమడగలవా ఆలోచించుకో' అని మాజీ ప్రధాని వాజపేయి హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉపేంద్ర తన ఆత్మకథలో రాసుకున్నారు. వాజపేయి మాటలను రుజువు చేస్తూ ఆయన ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అయితే అప్పటి బీజేపీ వేరు, ఇప్పటి బీజేపీ వేరు అని వాదించేవారున్నారు.

బీజేపీ హిందుత్వ భావజాలానికి భిన్నంగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం అజెండాగా ముందుకు సాగుతోంది. తెలంగాణలో ఇటీవల మంత్రివర్గ విస్తరణలో మాల, మాదిగ, బీసీ నేపథ్యం ఉన్నవారికి అవకాశం కల్పించారు. తెలంగాణ, బిహార్, జార్ఖండ్, ఒడిషా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, హరియాణాలలో దళిత లేదా బీసీ వర్గాలకు చెందిన వారినే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియమిస్తే ఛత్తీస్‌గఢ్ పార్టీ సారథ్యాన్ని ఆదివాసీకి అప్పగించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన భూపేష్ బఘేల్, సచిన్ పైలట్‌లను పార్టీ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు 13 మందిలో ఆరుగురు దళిత, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందినవారు. దీన్ని బట్టి చూస్తే సాధ్యమైనంత మేరకు పార్టీలో అగ్రవర్ణాల సంఖ్యను తగ్గిస్తూ పార్టీని సైద్ధాంతికంగా, సంస్థాగతంగా సామాజిక న్యాయానికి ప్రతీకగా మార్చాలని రాహుల్ ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్‌ను బహుజనుల పార్టీగా, బీజేపీని అగ్రవర్ణాల పార్టీగా చిత్రించేందుకు ఆయన అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. కులగణనను ఆయన ఒక ప్రచారాంశంగా మార్చారు. రాజ్యాంగానికీ, మనుస్మృతికీ మధ్య వైరుధ్యంపై చర్చను రేకెత్తిస్తున్నారు. కాని ఈ ప్రయోగం విజయవంతం అవుతుందా? బీజేపీకి, కాంగ్రెస్‌కూ మధ్య సైద్ధాంతిక వైరుధ్యం ఉన్నదని ప్రజలు, ముఖ్యంగా సామాన్యులు ఎంతవరకు భావిస్తున్నారు? దళితులను, బలహీన వర్గాలను పార్టీ పోస్టుల్లో నియమించినంత మాత్రాన అగ్రవర్ణాలు, పలుకుబడిగలిగిన వారి ప్రభావం లేకుండా పోతుందా? అన్న ప్రశ్నలు పార్టీ నేతల్లో తచ్చాడుతున్నాయి.

ఏది ఏమైనా భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు రెండు సైద్ధాంతిక ఆలోచనా విధానాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నించడం ఆహ్వానించదగిన పరిణామం. కష్టపడకుండా వచ్చిన సంపద, వ్యక్తిత్వం లేని జ్ఞానం, నైతికత లేని వ్యాపారం, విలువల్లేని రాజకీయాలు మంచివి కావని ఒక మేధావి అన్నారు. ఈ రెండు పార్టీలు తమ ఆర్థిక, సామాజిక విధానాలను ప్రజలు మరింత స్పష్టంగా అర్థం చేసుకునే విధంగా అజెండాలను రూపొందించగలగడం అవసరం. చాలా కాలంగా రెండు పార్టీల ఆర్థిక విధానాలకు పెద్దగా తేడా లేదనే అభిప్రాయం ప్రజల్లో నెలకొన్నది. కాంగ్రెస్ అనుసరించిన ఆర్థిక విధానాలనే తాము మరింత వేగవంతంగా అమలు చేశామని భారతీయ జనతా పార్టీ నేతలు చెప్పుకున్నారు. ఆర్థిక విధానాల విషయంలోనే కాదు, అనేక ఇతర అంశాలలో కూడా కాంగ్రెస్ అనుసరించిన పంథాకు, బీజేపీ అనుసరిస్తున్న పంథాకు తేడా లేదని చెప్పేందుకు ఆస్కారం కలిగింది. తమ అజెండాల భిన్నత్వాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా జాతీయ పార్టీలు రెండూ మరింత బలంగా ప్రయత్నిస్తే వచ్చే ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారుతాయనడంలో సందేహం లేదు.

జాతీయ పార్టీల తీరుతెన్నులు ఇలా ఉంటే అనేక ఇతర పార్టీలు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలకు అసలు సైద్ధాంతిక స్పష్టత ఉన్నదా అని అనుమానం కలుగుతోంది. మొదటి ఐదు సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతానికి పైగా ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ బలహీనపడ్డ తర్వాతే దేశంలో ప్రాంతీయ పార్టీల ఎదుగుదలకు ఆస్కారమేర్పడింది. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీల కూటమి చేతుల్లో పరాజయం పాలైంది. 1984 తర్వాత కాంగ్రెస్ మెజారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేని దుస్థితి ఎదుర్కొంటూ వచ్చింది. 1998 నాటికి 177 పార్టీలు రంగంలో ఉన్నాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 19 పార్టీల కలయికతో ఏర్పడితే 1998లో వాజపేయి నేతృత్వంలో 23 పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పాటయింది. ప్రాంతీయ వాదంతో పాటు ప్రాంతీయ పార్టీలు బలోపేతమయ్యాయి. వెనుకబాటుతనం, అస్తిత్వ రాజకీయాలు వంటి వాటికి ప్రజలు ప్రాధాన్యతనిచ్చారు.



కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును ప్రాంతీయ పార్టీలకే కాక, బీజేపీకి సైతం కోల్పోతూ బలహీనపడింది. వివిధ సామాజిక వర్గాల ప్రయోజనాలను పరిష్కరించగల నాయకత్వాన్ని అందించలేకపోవడం వల్లే కాంగ్రెస్ ప్రాభవం అడుగంటింది. సోషలిజం, లౌకికవాదం వంటి మూలభావనలను విడనాడడం వల్లే తన సంప్రదాయ ఓటు బ్యాంకును కాంగ్రెస్ కోల్పోతూ వచ్చింది. ప్రాంతీయ పార్టీలు తమ సంస్థాపక ఆశయాలకు తిలోదకాలు ఇవ్వడం వల్లే అవి ఇప్పుడు అస్తిత్వ పరీక్ష నెదుర్కొంటున్నాయి.

కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును ప్రాంతీయ పార్టీలకే కాక, బీజేపీకి కూడా హస్తగతం చేస్తూ బలహీనపడింది. దేశ ప్రజానీకంలోని వివిధ వర్గాల ప్రయోజనాలను పరిష్కరించగల నాయకత్వాన్ని అందించలేకపోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడింది. సోషలిజం, లౌకికవాదం వంటి తన మూలభావనలకు దూరంగా పోవడం వల్లే కాంగ్రెస్ తన సంప్రదాయ ఓటు బ్యాంకును కోల్పోతూ వచ్చింది. తన ప్రాభవాన్ని మళ్లీ పునరుద్ధరించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. విచిత్రమేమంటే ప్రాంతీయ పార్టీలు కూడా తమ మూల భావనలకు దూరం పోవడం వల్లే అస్తిత్వ పరీక్షలో పడ్డాయనడంలో సందేహం లేదు. ఇవాళ డీఎంకే, అన్నాడీఎంకే, బీజేడీ, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, బీఆర్ఎస్‌తో పాటు అనేక ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షలో ఉన్నాయి. డీఎంకే వచ్చే ఎన్నికల్లో తన అస్తిత్వాన్ని, ప్రాంతీయ ప్రత్యేకతను నిలబెట్టుకునేందుకు రకరకాల ప్రయోగాలు చేసే పరిస్థితిలో చిక్కుకుంది. జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే స్వంతంగా తన కాళ్లపై నిలబడలేక బీజేపీతో చేతులు కలపాల్సి వస్తోంది. ఒకప్పటి ద్రవిడ అస్తిత్వం ఇవాళ తమిళనాడులో ప్రశ్నార్థకమైన దశలో ఉన్నది. 1997లో ఉనికిలోకి వచ్చిన బిజూ జనతాదళ్‌ను ఒడిషా అస్తిత్వానికి ప్రతీకగా ప్రజలు గుర్తించకపోవడంతో 18వ లోక్‌సభలో ఆ పార్టీ ఒక్క సీటు కూడా పొందలేకపోయింది. దళితుల స్వరంగా నిలిచిన బహుజన్ సమాజ్ పార్టీని ఇప్పుడు దళితులే తమ పార్టీగా భావించకపోవడంతో యూపీ రాజకీయాల్లో పూర్తిగా పట్టుకోల్పోయింది. అదే పరిస్థితి బిహార్‌లో లోక్ జన్‌శక్తి ఎదుర్కొంటోంది. హరియాణా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన లోక్‌దళ్, తన వ్యవస్థాపకుడు చరణ్‌సింగ్ ఆదర్శాలను కొనసాగించలేక ముక్కలు చెక్కలైంది. మహారాష్ట్ర ప్రజలు ఒకప్పుడు శివసేన పార్టీని ప్రాంతీయాభిమానానికి, దుందుడుకు హిందుత్వకు ప్రతీకగా భావించేవారు. కాని ఇప్పుడు ఈ పార్టీ కూడా తన సైద్ధాంతిక పునాది కోల్పోవడంతో పాటు అవకాశవాద రాజకీయాల కారణంగా చీలిపోయింది.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి దాదాపు పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా అనేక ప్రాంతీయ పార్టీల మాదిరి తన మూల భావనలకు దూరంగా వైదొలగడమే ప్రస్తుతం అస్తిత్వ పరీక్ష నెదుర్కోవడానికి కారణం. తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వానికి చిహ్నంగా భావించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఇప్పుడెక్కడ ఉన్నది? దేశంలో కీలక పాత్ర పోషించగలమన్న అత్యాశతో పార్టీ పేరు మార్చుకుని, ఢిల్లీలో భవనాలను ప్రారంభించినంత మాత్రాన జాతీయ స్థాయి గౌరవం లభిస్తుందా? కోట్లాది ప్రజల మనోభావాలకు ప్రతీకగా మారాల్సిన ఒక పార్టీ మాత్రమే కాదు మొత్తం రాష్ట్రం ఒకరిద్దరు వ్యక్తుల ఇష్టారాజ్యంగా మారిన క్రమాన్ని, ప్రజాస్వామిక విలువలకు తావులేని పరిస్థితులను, మనం చూశాం. కుటుంబ సభ్యులందరూ 'ప్రజా సేవ' కోసం తాపత్రయపడిన తీరునూ గమనించాం. అధికారంలో కొద్ది రోజులు లేనంత మాత్రాన అసహనం. అరాచకత్వం, అభద్రత, అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతున్న బీఆర్ఎస్ ఒకప్పటి టీఆర్ఎస్‌లా ప్రజల మద్దతును సాధించుకుని, అధికారానికి అర్హత సంపాదించగలుగుతుందా లేక అంతరిస్తున్న ప్రాంతీయ పార్టీల జాబితాలో చేరుతుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రజావ్యతిరేక విధానాలకు ప్రతిఘటన

నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయి. కార్మికుల వేతనాలు 2017–18 స్థాయి కంటే పడిపోయాయి. మరోక వైపు, కార్పొరేట్ కుటుంబాల ఆస్తులు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి నాలుగు కార్మిక కోడ్‌లను అమలుచేయాలని ప్రయత్నించారు. కార్మికులు పోరాడి, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులన్నిటినీ రద్దు చేయాలని భావించారు. రాజ్యాంగ స్ఫూర్తినీ, సుప్రీంకోర్టు తీర్పులనూ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలన్నిటినీ భూస్థాపితం చేయ సంకల్పించారు. కార్మిక కోడ్‌లు అమలులోకి వస్తే ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనాలు, సామాజిక భద్రత, సంఘం పెట్టుకునే హక్కు, సంఘాల రిజిస్ట్రేషన్లు–గుర్తింపు, సమిష్టి బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆందోళనలు చేసే హక్కులు అన్నీ తీవ్రమైన ప్రమాదంలో పడిపోతాయి.



దేశంలో మొత్తం పౌరహక్కుల పైనే తీవ్రమైన దాడి జరుగుతోంది. కార్మిక వర్గ హక్కులపై జరుగుతున్న దాడిని దీనిలో భాగంగానే చూడాలి. యూఏపీఏ, పీఎంఎల్ఏ, బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) చట్టాలను పౌర హక్కులపై దాడికి ప్రయోగిస్తున్నారు. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111 ప్రకారం, కార్మికులు సంఘటితంగా తమ హక్కులను డిమాండ్ చేస్తే, దాన్ని సంఘటిత నేరంగా పరిగణించి, తీవ్రమైన జైలుశిక్షలు, పెనాల్టీలు విధించవచ్చు. రైతాంగ హక్కులపై ప్రయోగించటానికి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారు. రైతు సంఘాల సుదీర్ఘ, సమరశీల పోరాటాల ఫలితంగా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, మరో రూపంలో ఆ రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పంటల గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని రైతాంగం చేస్తున్న డిమాండ్ పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ ఈ చర్యలన్నీ, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే! చట్టాల సంస్కరణలతో పాటు, అనేక భారాలు వేసి, ప్రజల నుంచి కొల్లగొట్టి వసూలు చేస్తున్న పన్నుల నుంచి ఇటీవల కార్పొరేట్లకు మరికొన్ని ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. కానీ కార్మికులకు మాత్రం ఎటువంటి ప్రోత్సాహకాలు ఉండవు. పాతపెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) తిరిగి ప్రవేశపెట్టాలని లక్షలాదిమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. కానీ పాలకులు పట్టించుకోవటంలేదు. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం(1995) కింద కనీస పెన్షన్ పెంచాలనీ, ఈ పథకాన్ని మెరుగు పరచాలన్న డిమాండునూ పట్టించుకోవడం లేదు.

బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించివేస్తూ, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థల విచ్చలవిడి ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారు. ఎల్ఐసీలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించారు. తపాలారంగంలో ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసే విధంగా పోస్టల్ చట్టానికి సవరణలు తీసుకొచ్చారు. కీలకమైన, దేశ భద్రతా అంశాలకు వాటిల్లబోయే ముప్పును కూడా పట్టించుకోవడం లేదు. రక్షణ, అంతరిక్షం, బ్యాంకులు, రైల్వే, పోస్టల్, విద్యుత్, పెట్రోలియం, జనరల్ ఇన్సూరెన్స్, బొగ్గు, ఉక్కు, విద్యుత్, స్పెక్ట్రం, భూగర్భంలోని ఖనిజాలు, సర్వం ప్రైవేట్ మయం చేస్తున్నారు.

ప్రభుత్వం, యాజమాన్యాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించే అధికారిక త్రైపాక్షిక వేదిక ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్. 1942 నుంచి ఇప్పటికి 46 సమావేశాలు జరిగాయి. చివరి సమావేశం 2015లో జరిగింది. గత 10సంవత్సరాలుగా, కేంద్ర కార్మిక సంఘాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, కేంద్ర ప్రభుత్వం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం జరపటం లేదు.


ఈ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. దేశ సరిహద్దులలో నెలకొన్న పరిస్థితుల వల్ల మే నెల 20న జరగాల్సిన సమ్మెను జూలై 9కి వాయిదా వేశారు. నాలుగు కార్మిక కోడ్‌ల రద్దుతో పాటు, రూ.26,000 కనీస వేతనం, 8 గంటల పనిదినం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆశా, అంగన్వాడి తదితర స్కీం వర్కర్స్ రెగ్యులరైజేషన్, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశ నిర్వహణ, మరికొన్ని డిమాండ్ల సాధన కోసం ఈ సమ్మె జరుగుతున్నది. సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఈ కార్యాచరణలో పాల్గొనాలని నిర్ణయించటమే గాక, అదే రోజున గ్రామీణ బంద్‌కు పిలుపునివ్వటం ముదావహం.

● వెలుగూరి రాధాకృష్ణమూర్తి
ఏఐటీయూసీ నాయకులు

ఏబీవీపీ నుంచి ఎదిగినవారెందరో...

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేడు మన దేశంలో క్రియాశీలమైన విద్యార్థి సంఘం. దేశంలోని యువతను సంఘటితపరిచి వారిలో దేశభక్తి, దేశాభివృద్ధి పట్ల నిష్ఠను పాదుకొల్పడం, వారిలో 'జ్ఞానం, శీలం, ఏకత'లే ధ్యేయంగా ఏబీవీపీ పనిచేస్తోంది. బాల్‌రాజ్ మధూక్, యశ్వంతరావు కేల్కర్, దత్తాజీ డిండోల్కర్, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ నుంచి జనమంచి గౌరీశంకర్ లాంటి ఎందరో మహామహులు ఏబీవీపీకి పునాదులు వేశారు. ఏబీవీపీ 1948లోనే ఢిల్లీ యూనివర్సిటీలో అతికొద్ది మందితో తన ప్రస్థానాన్ని కొనసాగించినా, 1949 జూలై 9 నుంచి అధికారికంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నేటితో 76 వసంతాలు పూర్తి చేసుకుని 77వ అమృతోత్సవ సంబరాల్లోకి ఏబీవీపీ అడుగు పెడుతోంది.

ఏబీవీపీ నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి, తర్వాత జాతీయ స్థాయిలో గొప్ప నేతలుగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వరకూ అలా ఎదిగినవారే. ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇలా ఏబీవీపీ నుంచి నాయకులుగా ఎదిగినవారు చాలా మందే ఉన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఇద్దరూ తమ రాజకీయ ప్రస్థానాన్ని ఏబీవీపీ నుంచే ప్రారంభించారు.



ఎమర్జెన్సీ కాలంలో ఏబీవీపీ కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో వామపక్షవాదులు, నక్సల్స్ దాడులకు పాల్పడ్డారు. జేఎన్‌టీయూ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ వంటి చోట్ల ఎంతో మంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఏబీవీపీ దేశభక్తి, నిబద్ధతతో ముందుకు సాగుతోంది. సభ్యత్వం, దేశవ్యాప్తంగా వివిధ నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా ప్రపంచంలోనే నెంబర్ 1 స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా ఏబీవీపీ గుర్తింపు పొందింది.

ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (SFD) ఫోరం ద్వారా విద్యార్థులకు ప్రకృతిపై ప్రేమను పెంచి, జల్, జంగల్, జన్వర్, జన్, జమీన్‌ల పరిరక్షణకు నేడు దేశ వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని 'వృక్ష మిత్ర' అభియాన్ ద్వారా నిర్వహిస్తున్నది. రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికులు, గల్ఫ్ కార్మికులు, సంచార జాతులపై సర్వే, ఫ్లోరోసిస్ బాధితుల కోసం సర్వే నిర్వహించి వారి సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రధానపాత్ర పోషిస్తోంది.

థింక్ ఇండియా, వరల్డ్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టూడెంట్స్ & యూత్, మెడికల్ & డెంటల్ విద్యార్థుల ఫోరం వంటి మొత్తం 15 ఫోరమ్స్ ద్వారా పలు కోర్సుల్లోని విద్యార్థుల అభ్యున్నతికి ఏబీవీపీ కృషి సలుపుతోంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, భాషా, జీవన వైవిధ్యాన్ని పరిచయం చేయడం కోసం ఏబీవీపీ SEILను చేపట్టింది.

1975లో ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ఏబీవీపీ క్రియాశీలక పాత్ర పోషించింది. చలో అస్సాం కార్యక్రమం ద్వారా 'సేవ్ అస్సాం సేవ్ ఇండియా' పేరుతో లాయర్స్ గ్రౌండ్స్‌లో సత్యాగ్రహం చేసింది. 1983 నుంచి బంగ్లాదేశ్ చొరబాటుదార్లకు వ్యతిరేకంగా ఏబీవీపీ నిరంతరం జనజాగరణ, ఆందోళన నిర్వహిస్తూనే ఉంది. ఏబీవీపీ పోరాట ఫలితమే 'నూతన జాతీయ విద్యా విధానం'. ఓటు హక్కు వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషించింది.

కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచింది. బ్లడ్ డొనేషన్ క్యాంపులు, చెట్లు నాటడం, స్టడీ సర్కిల్, ఉచిత కోచింగ్ సెంటర్స్ లాంటివి ఏర్పాటు చేయడం, BC, SC, ST విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తోంది. దేశ నాయకులను స్మరిస్తూ వివేకానంద, డా.బీ.ఆర్. అంబేడ్కర్ వంటి వారి సంస్మరణ దినాలను ఘనంగా నిర్వహిస్తోంది. నేటి విద్యార్థి రేపటి పౌరుడు అన్నది గత నినాదం. నేటి విద్యార్థి నేటి పౌరుడే అనే స్పృహతో ప్రస్తుతం సమాజంలోని అనేక సమస్యలపై అవగాహనతో స్పందిస్తూ, పరిష్కారాలను చూపే విధంగా విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే విద్యార్థి పరిషత్ ధ్యేయం. విద్యార్థిని టెక్నాలజీ, వైద్య, సామాజిక, కళా మొదలైన రంగాల్లో సమాజంతో మమేకం చేస్తూ ప్రత్యక్షంగా అనుభూతి చెందేలా వారిలో ఎటువంటి తారతమ్య భేదాలు లేకుండా, ఏకాత్మ భావనను పెంపొందించే విధంగా ఏబీవీపీ కృషి చేస్తోంది.

■ జీవన్
ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు

ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 9 జూలై 2025





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, శ్రావణ్‌కుమార్, నరేంద్రకుమార్ ఎమ్మెల్సీలు చంద్రగిరి, మురుగుడు,

పేదరిక రహితమే లక్ష్యం

- సంక్షేమం అమల్లో బాలారిష్టాలు అధిగమిస్తాం
- డీఆర్‌సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని జిల్లాగా గుంటూరుని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాబోయే రోజుల్లో పీ-4ని పెద్దఎత్తున అమలు చేసి లక్షల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకు రాబోతున్నామన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్‌లో మంగళవారం జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశంలో సభ్యులు వేసిన ప్రశ్నలకు అధికారులు ఇచ్చిన సమాధానాలపై చర్చ జరిగింది. అనంతరం వ్యవసాయం, ఉద్యాన, జలవనరులు, పౌరసరఫరాలు, తల్లికి వందనం, స్వర్ణ ఆంధ్ర 2047 అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నంగా ఉన్నా సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్క హామీని అమలు చేస్తూ వస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. పేదరిక నిర్మూలన కోసం జిల్లా, నియోజక వర్గాల విజన్ యాక్షన్ ప్లాన్లు రూపొందించినట్లు తెలిపారు. అనుమతి తీసుకోకుండా సమావేశానికి గైర్హాజరైన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కి నోటీసు జారీ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యే పలు సమస్యలను ప్రస్తావించారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్, వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

- ఆటోనగర్‌లో తాగునీటి వసతి లేదని, రూ.18 వేలను రూ.5 వేలకు తగ్గిస్తే అందరూ కుళాయి కనెక్షన్లు తీసుకొంటారని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ తెలిపారు. కాకుమా నువారితోటలోని కార్మిక శాఖ స్థలం వద్ద వాకింగ్ ట్రాక్‌ని నిర్మించాలన్నారు. బీఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్, ఆటోనగర్ వద్ద అన్నక్యాంటిన్లు ఏర్పాటు చేయాలన్నారు.
- ఏడు వేలమందికి పైగా కౌలు రైతులకు కార్డులు ఇస్తే బ్యాంకర్లు కేవలం 78 మందికి రుణాలు ఇవ్వడం ఏమిటని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమ శాఖ పథకాల విషయంలోనూ బ్యాంకర్లు అశ్రద్ధ వహిస్తున్నాయన్నారు. ఫిరంగిపురం చర్చిని టూరిజం సర్క్యూట్‌లోకి తీసుకొస్తే పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు.
- పీఎం కిసాన్ పథకానికి గత ఐదేళ్లతో పోల్చితే ఈ ఏడాది దాదాపుగా 40 వేల మంది లబ్ధిదారులు ఎందుకు అనర్హులయ్యారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రశ్నించారు. ప్రతీ దానికి ఆవు కథలా సమాధానం చెప్పొద్దని (మిగతా 6వ పేజీలో)



మరో ఐదు అన్న క్యాంటీన్లు!

- ఒక్కోటి రూ.61 లక్షలతో నిర్మాణం
- రూ.3.05 కోట్లు నిధుల విడుదల
- అక్టోబరు 2న ప్రారంభించడమే లక్ష్యం

(తాడికొండ, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు పేదల కడుపు నింపుతున్నాయి. పట్టణాలకే పరిమితమైన క్యాంటీన్‌లను మండల కేంద్రాలకు ప్రభుత్వం విస్తరిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో ఐదు క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతోంది. ఒక్కొక్క క్యాంటీన్ రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. క్యాంటీన్ భవనాలు, ఫర్నీచర్ తదతర వసతులకు రూ.3.05 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. అక్టోబరు 2న కొత్త క్యాంటీన్‌లు ప్రారంభించాలని ప్రభుత్వం సంకల్పించింది. పబ్లిక్ హెల్త్‌శాఖ పనులు నిర్వహిస్తోంది.

స్థల కేటాయింపు పూర్తి

పల్నాడు జిల్లాలోని అమరావతిలో, గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, ఫిరంగిపురం, దుగ్గిరాల, బాపట్ల జిల్లాలోని బట్టిప్రోలులో కొత్తగా అన్న క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ఒక్క ఫిరంగిపురం మినహా మిగతా నాలుగు చోట్ల స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. స్థలాలను పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించారు. పట్టణాల్లో ఈ శాఖ ఆధ్వర్యంలోనే క్యాంటీన్‌లను నిర్మించారు. మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పట్టణాల తరహాలోనే ఈ ఐదు చోట్ల క్యాంటీన్‌లు ప్రారంభించి రుచికరమైన భోజనం, అల్పాహారం రూ.5 కే పేదలకు అందిస్తారు. రోజుకు రూ.15 చెల్లిస్తే.. మరో 2,500 మంది పేదలకు ఆహారం అందించేందుకు ప్రభుత్వ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

- ఒక్కో సొసైటీకి చైర్‌పర్సన్.. ఇద్దరు సభ్యులు
- ఎమ్మెల్యేలు పంపిన పేర్లను ఆమోదించిన ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో 93 సొసైటీల్లో 279 మందికి పదవులు


అన్నవరం సొసైటీ కార్యాలయం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలక వర్గాలుగా త్రిసభ్య కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొన్ని నెలల తరబడి చేస్తున్న కసరత్తు ఎట్టకేలకు ఒక కొలిక్కివచ్చింది. గత నెలలో సొసైటీల నిర్వహణ బాధ్యతలను అధికారులకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు లేవని రైతులు నిరాశ చెందారు. పైగా వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన త్రిసభ్య కమిటీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రైతు నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ క్రమంలో సొసైటీల్లో అధికారుల పాలన ఈ నెల 30తో ముగియనున్నది. దీంతో త్రిసభ్య కమిటీల నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పైగా ఆయా కమిటీల్లో పలువురికి పదవులు దక్కడంతో నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తొలివిడతలో 93 సొసైటీలకు కమిటీలను నియమించింది.

ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పంపిన పేర్లకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో ఈ నెల 30నే త్రిసభ్య కమిటీలు సొసైటీల బాధ్యతలు స్వీకరించనున్నాయి. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలక వర్గాలనే 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహి స్తారని రైతులు ఆశించారు. అయితే సభ్యుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. దీంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు త్రిసభ్య పాలనకు ప్రభుత్వం మొగ్గు చూపింది.

279 మందికి పదవులు..

ఒక్కో సొసైటీలో చైర్‌పర్సన్‌తో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ ప్రకారం మూడు జిల్లాల పరిధిలో తొలివిడతలో 279 మంది కూటమి నేతలను పదవులు వరించాయి. పల్నాడు జిల్లాలో 36 సొసైటీలకు నామినేటేడ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. గుంటూరు జిల్లా పరిధిలో 7, బాపట్ల జిల్లా పరిధిలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించింది.

నాడు నిర్వీర్యం..

సహకార రంగాన్ని వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. సహకార సంఘాల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యకర్తలను సభ్యులుగా చేర్చారు. దీంతో సొసైటీలు రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార రంగాన్ని ఆ పార్టీ నేతలు ఐదేళ్లు దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రూ.లక్షల్లో స్కాంలు జరిగినట్లు (మిగతా 6వ పేజీలో)

రూ.34.15 కోట్ల పనులకు ఆమోదం

- స్థాయి సంఘ సమావేశంలో మేయర్ కోవెలమూడి

గుంటూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులను రూ.34.15 కోట్లతో నిర్వహించేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపినట్లు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదించిన 101 అంశాలకు సంబంధించిన పనులపై మేయర్ చాంబర్‌లో జరిగిన స్థాయి సంఘాల సమావేశంలో చర్చించి ఆమోదించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరంలో పార్కులను, జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లను ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తామన్నారు. పచ్చదనాన్ని అభివృద్ధి చేసి గ్రీన్ గుంటూరుగా మార్చేందుకు మిషన్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేసి, వాటిని నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రాధాన్య క్రమంలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, షేక్ మీరావలి, కమిషనర్ పులి శ్రీనివాసులతో పాటు విభాగాధిపతులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర

అన్నదాత సుఖీభవకు అర్హులేనా?



- 10 లోగా పరిశీలించుకోవాలని రైతులకు సూచన

గుంటూరు సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధికి అర్హుల్లో కాదో అన్న విషయాన్ని రైతులు పరిశీలన చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10లోపు రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి తమ పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలన చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు తీసుకుని వెళ్తే గ్రామ వ్యవసాయ సహాయకులు వివరాలు అందజేస్తారని తెలిపారు. ఒక వేళ అనర్హుల జాబితాలో పేరు ఉంటే ఏ కారణంతో అక్కడ నమోదయ్యారో పరిశీలించి పరిష్కారం చెప్తారన్నారు. గతంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారిని, ఈ-నామ్ భూములు గతంలో కొన్న వారిని ఇంకా ఇతర కారణాలతో అనర్హుల జాబితాలో చేర్చి ఉంటే వాటికి తగిన పరిష్కారం చూపించే అవకాశం అందుబాటులో ఉందన్నారు.

ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి

రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ-పంటలో నమోదు చేయించుకుంటేనే రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల అమ్మకం వంటి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

గ్రామాలు నందనవనాలు కావాలి

- తాళ్లూరులో మొక్కలు నాటిన డ్వామా పీడీ

ఫిరంగిపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ సీమలను నందనవనాలుగా రూపొందించాలని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. మండలంలోని 113 తాళ్ళూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద ఓ రైతు పొలంలో మంగళవారం మామిడి మొక్కలను పీడీ నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకమని, వంద శాతం పెట్టుబడి ఇస్తున్నామని తెలిపారు. రైతులు రాయితీల కోసం సచివాలయాల్లో, ఉపాధి హామి పథకం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. మొక్కలు నాటిన రోజు నుంచి రాయితీ లెక్కలోకి తీసుకుంటామన్నారు. తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు ఎరువులు, పురుగు మందులు, సాగు నీరు పర్యవేక్షణ ఖర్చులను ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, ఏపీవో కిరణ్మయి, టీఏ జయకృష్ణ, టీడీపీ నేత డేగల సీతారామయ్య, నీటి సంఘం అధ్యక్షుడు అంచుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


తాళ్లూరులో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ శంకర్

కత్తితో పొడిచి.. రాయితో కొట్టి హతం

- తురకపాలెం రోడ్డులో ఓ వ్యక్తి దారుణ హత్య
- మూడు రోజుల అనంతరం మృతదేహం లభ్యం
- వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల అనుమానం


కరిముల్లా (ఫైల్)

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్యామలానగర్ శివారు తురకపాలెం రోడ్డులో షేక్ కరిముల్లా(32) హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో వాటర్ ప్లాంట్‌లో పని చేసే స్తంభాలగరువులోని రాజ్యలక్ష్మీనగర్ రెండోలేన్‌కి చెందిన కరిముల్లా మూడు నెల లుగా పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నాడు. స్తంభాలగరువు మూడో లేన్ రైలు కట్ట రోడ్డుకు చెందిన ఆటోడ్రైవర్ లావునూరి మధుసూదన్‌రెడ్డి, ఫైనాన్స్ వ్యాపారం చేసే శ్యామలానగర్ మూడోలేనుకు చెందిన చాగంటి శివరామరాజు ఇద్దరూ స్నేహితులు. ఇలా ఉంటే ఆదివారం సాయంత్రం కరిముల్లాను మధుసూదన్‌రెడ్డి శివరామరాజు ఆటోలో ఎక్కించుకుని తురకపాలేనికి తీసుకెళ్లాడు. అక్కడ జనచైతన్య ప్లాట్లలో ముగ్గురు మద్యం తాగారు. కరిముల్లాను మధుసూదన్‌రెడ్డి, శివరామరాజు కత్తితో పొడిచి, రాయితో కొట్టి హతమార్చారు. మృతదేహాన్ని ముళ్లపొదల్లో పడేసి వెళ్లారు. ఆదివారం నుంచి కరిముల్లా కనిపించకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కరిముల్లాను చంపి తురకపాలెం రోడ్డులోని పొదల్లో మృతదేహాన్ని పడేసినట్లు మధుసూదన్‌రెడ్డి మద్యం మత్తులో అన్న విషయం కరిముల్లా కుటుంబసభ్యులకు తెలిసింది. వారు ఆ ప్రాంతంలో గాలించినా మృతదేహం కనిపించలేదు. దీంతో మంగళవారం వారు పోలీసులను ఆశ్రయించారు. గేదెల కాపరులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లి చూడగా కరీముల్లా మత్యదేహం పూర్తిగా కూళ్లిపోయి కనిపించింది. కరీముల్లా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో అనుమానితులైన మధుసూదన్‌రెడ్డి, శివరామరాజులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కరిముల్లా భార్య మూగ కావడంతో ఎనిమిదేళ్లుగా వదిలేశాడు. కరిముల్లా వదినతో శివరామరాజుకు సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో కరిముల్లాకు శివరామరాజుకు మధ్య గొడవలు జరుగుతున్నదని, దీంతోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కరీముల్లాను చంపితే డబ్బులు ఇస్తానని మధుసూదన్‌రెడ్డికి శివరామరాజు ఆశ చూపినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే పథకం ప్రకారం మధుసూదన్‌రెడ్డి ఆటోలో తీసుకెళ్లి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే కరీముల్లా హత్యతో తనకు ఎటు వంటి సంబంధం లేదని శివరామరాజు వాదిస్తున్నట్లు తెలిసింది.

ఏడు రోజుల్లోగా ఖాళీ చేయండి

- కొల్లి శారదా మార్కెట్ దుకాణదారులకు నోటీసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏడు రోజుల్లోగా ఖాళీ చేయాలని కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్‌లోని దుకాణదారులకు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు నోటీసులు జారీ చేశారు. మార్కెట్‌లోని 95 దుకాణాలకు 25 సంవత్సరాల అద్దె కాల పరిమితి గతంలో ముగిసింది. దీంతో తిరిగి తమకే దుకాణాలు కేటాయించాలని లీజుదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా లీజుదారులకు, నగర పాలక సంస్థకు మధ్య వివాదం నడిచింది. స్పీకింగ్ నోటీసులు జారీ చేసి దుకాణాలను స్వాధీనపరుచుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రంగంలో దిగిన నగర పాలక సంస్థ అధికారులు లీజుదారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా దుకాణాలను ఖాళీ చేయాలని ఆయా నోటీసుల్లో పేర్కొన్నారు.



శ్రీశైలం బ్యారేజీ నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలం నుంచి లక్షన్నర క్యూసెక్కుల నీరు విడుదల

- సాగర్ జలాశయానికి భారీగా వరద
- గణనీయంగా పెరగనున్న నీటి మట్టం
- ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది. ప్రాజెక్ట్ నాలుగు గేట్లు తెరచి నాగార్జున సాగర్ జలాశయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం నీటిని విడు దల చేశారు. విద్యుదుత్పత్తి గేట్లు తెరచి దాదాపు లక్షన్నర కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలశయానికి కూడా భారీగా వరద వస్తోంది. దీంతో గణనీయంగా సాగర్‌లో కూడా నీటి నిల్వలు పెరగనున్నాయి. వారం రోజుల్లో 125 టీఎంసీల వరకు నీరు వస్తుందని జలవన రుల శాఖ అంచనా వేస్తోంది.

ఆయకట్టు రైతుల్లో ఆనందం

సాగర్‌కు కృష్ణమ్మ సవ్వడితో అన్నదాల్లో ఆనందం నెలకొంది. వరదనీరు పోటెత్తుండటంతో కుడి కాలువ ఆయకట్టు సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం వరి సాగుకు రైతులు సిద్ధమవుతు న్నా రు. శ్రీశైలం జలాశయంలోకి 1,73,351 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీ లకుగాను నీటి నిల్వ 195.39 టీఎంసీలకు చేరింది.

శ్రీశైలం జలాశయా నికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగు తుందని జల వనరుల శాఖ అంచనా వేస్తోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశ యాల నుంచి భారీగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా ఉంది. సాగర్‌లో గతవారం రోజుల్లో 31 టీఎంసీల నీటి నిల్వ పెరిగిం ది. సాగర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 169 టీఎంసీలకు చేరింది.

ఆల్ ఇన్ వన్.. రైల్‌వన్!
- రైల్వే సేవలన్నీ రైల్‌వన్ యాప్‌లోకి..
- రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్ బుకింగ్ సదుపాయం
- పీఎన్‌ఆర్ స్థితి, కోచ్ పొజిషన్ వంటి సర్వీసులెన్నో..
- ఫుడ్ కూడా ఆర్డర్ చేసే అవకాశం

ఇక సూపర్ ఫాస్ట్‌గా శబరి
- రైల్వేబోర్డు ఆమోదం, మారనున్న కాలమానం
- కొద్ది రోజుల్లోనే అమలులోకి

తెలుగు భాషను సుసంపన్నం చేసే సంస్కృతి రావాలి
ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్

సమస్యకు.. స్కాన్
- రేషన్ ఫిర్యాదులకు క్యూ ఆర్ కోడ్
- దుకాణాల వద్ద పోస్టర్లు ఏర్పాటు

8

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రోశయ్య
- భూ ఆక్రమణల ఆరోపణపై కమిషనర్ విచారణ
- ధ్రువ పత్రాలతో వచ్చిన బాధితురాలు భారతి

6

సీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తుళ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు జరుగుతున్నాయన్నారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తుళ్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో.. ఈ నెల 11న ఉదయం యర్రబాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్(యుహెచ్‌సీ)లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాజధాని అమరావతి పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలిపింది. పూర్తి వివరాలకు సీఆర్డీఏ హెల్ప్ లైన్ లేదా 79819 25147 నంబరుకు సంప్రదించవచ్చని పేర్కొంది.

నేటి నుంచి డైట్ సెట్.. వెబ్ కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),జూలై 8(ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ అర్హత సాధించిన అభ్యర్థులు బుధవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్న వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ వరకు డైట్ కళాశాలల్లో సర్టిఫికెట్ల పరిశీలన, 25 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో.. ప్రవేశాలకు ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నందివెలుగు రోడ్డులో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీలో 20, సీఈసీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 531.90 అడుగులు ఉంది. ఇది 171.87 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 3090, ఎస్ఎల్‌బీసీ 1500, మొత్తం ఔట్ ఫ్లో 4590 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్ ఫ్లో 1,14,146 క్యూసెకులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 15.21 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పవర్ జనరేషన్ ద్వారా 6,600, లీకుల ద్వారా 400, మొత్తం 7 వేల క్యూసెక్కుల దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

▸▸ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట విశ్రాంత ఉద్యోగుల నిరసన

గుంటూరు (తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు వర్తింపు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధరరావు మంగళవారం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డు, పింఛన్ అమలు చేయాలని కోరారు. ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు కల్పించాలని గత, ప్రస్తుత ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. దండా లక్ష్మీనారాయణ, నిక్సన్, శేషగిరిరావు, నాగేశ్వరరావు, నాంచారయ్య, వెంకటేశ్వర్లురావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రెంటచింతల,జూలై 8 (ఆంధ్రజ్యోతి): అత్త మందలించిందని ఓ వివాహిత ఉరేసుకున్న ఘటన జెట్టిపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. శీలం సంధ్యారాణి(25), సత్యనారాయణ భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. అత్త కోపగించుకోవడంతో సంధ్యారాణి క్షణికావేశంలో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రోశయ్య

▸▸ భూ ఆక్రమణల ఆరోపణపై కమిషనర్ విచారణ ▸▸ ధ్రువపత్రాలతో వచ్చిన బాధితురాలు భారతి





విచారణకు హాజరైన రోశయ్య, కమిషనర్ చాంబర్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, జులై 8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తనపై వచ్చిన భూ ఆక్రమణల ఆరోపణలపై గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఎదుట మంగళవారం హాజరయ్యారు. ఆయనతో పాటు ఫిర్యాదుదారురాలు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దారు రాజారావు భార్య గుమ్మడి భారతి కూడా విచారణకు వచ్చారు. గుంటూరు నగరానికి చెందిన గుమ్మడి భారతి మాజీ ఎమ్మెల్యే రోశయ్యపై భూ అక్రమణ ఆరోపణలు చేశారు. నగరంలోని చుట్టుగుంట సెంటర్ నుంచి మిర్చి యార్డుకు వెళ్లే దారిలో సర్వే నంబర్ 178సీ/ ఏ బీ1లో ఎకరా 23 సెంట్లు భూమిని రాజారావు వద్ద అప్పటి డ్రైవర్‌గా పనిచేస్తున్న కావూరి రాఘవయ్య చౌదరి, సక్కుర్తి పద్మ అనే వారితో కలిసి చల్లా వెంకటరమణతో 1980లో స్వాధీనపు అగ్రిమెంటు చేసుకున్నారు. అప్పట్లోనే పూర్తి నగదు చెల్లించి, ఆ పొలాన్ని స్వాధీనపరచుకొని వాణిజ్య పంటలు పండించారు. భూమిని రిజిస్ట్రేషన్ చేయమని రాజారావు, రాఘవయ్య చౌదరి, పద్మ వెంకటరమణను పలుమార్లు అడిగినా.. దాట వేసుకుంటూ వచ్చారు. 1981లో దాచేపల్లి రామారావు అనే అతను కోర్టులో ఈ భూమిపై డిక్రీ పొందాడు. అయితే రామారావుకి వచ్చిన తీర్పుపై అప్పటికే అగ్రిమెంట్ రాయించుకొని ఉన్న ఫైముగ్గురు కోర్టును ఆశ్రయించగా 1999లో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ ఆస్తిని విక్రయించే హక్కు వెంకటరమణకు లేదని, అగ్రిమెంట్ రాయించుకొని ఉన్న ఫైముగ్గురికి చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే 1991లో వెంకటరమణ సురేంద్ర కుమార్ వగైరాలకు జీపీఏ చేశాడు. తద్వారా 2002లో మాజీ ఎమ్మెల్యే రోశయ్య తన బినామీలైన జక్కా శ్రీకాంత్, కిలారి రామబ్రహ్మం, శ్రీనివాసరావు వగైరాల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. కోర్టులో దావాలు పెండింగ్‌లో ఉండగా, ఆస్తి అమ్మే హక్కు వెంకటరమణకు లేదని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ.. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. 2015లో హైకోర్టు బాధితురాలు భారతికి అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. 2021లో కేకేఆర్ సినిమా హాలు నిర్మించాలని, దాని వెనుక ఉన్న స్థలాన్ని ఆక్రమించేందుకు మాజీ ఎమ్మెల్యే రోశయ్య ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. తన స్థలంలో దౌర్జన్యంగా ప్రహరీ నిర్మాణం చేపట్టారని, ఈ విషయం తెలిసి మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులకు తెలిజేశామని బాధితురాలు వెల్లడించారు. దీనిపై ఇరు వర్గాలకు నోటీసులు ఇచ్చి, వారి వాదనలను కమిషనర్ విన్నారు. రెండు గంటలపాటు విచారణ కొనసాగింది. ఈ విషయాన్ని కోర్టుల తేల్చుకోవాలని కమిషనర్ చెప్పారని బాధతురాలు గుమ్మడి భారతి పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడేందుకు రోశయ్య సుముఖత వ్యక్తం చేయలేదు. విచారణ అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కార్పొరేషన్‌లో ప్రజా సంఘాల ఆందోళన

బాధితురాలు భారతికి ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే రోశయ్య కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ఆయనను జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

దేవాలయంలో రూ.5 లక్షల సొత్తు చోరీ..

నాదెండ్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దేవాలయం గ్రిల్స్ తాళాలు పగల గొట్టి గర్భగుడిలో స్వామి వార్లకు అలంకరించిన మూడు వెండి కిరిటీలు, శంకు చక్రాలను, 24 గ్రాముల బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. హుండీ పగల గొట్టి నగదు చోరీ చేశారు. వీటిన్నంటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. సమాచారం మేరకు.. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ పుల్లారావు దేవాలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు.

మహిళా పోలీసుల బదిలీలు లోపభూయిష్టం

▸ ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణా కార్యద ర్శుల (పోలీసు) బది లీలు లోపభూయిష్టంగా జరి గాయంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. అర్బన్‌లో విధులు నిర్వహిస్తున్న వారి ని పల్నాడులోని మారు మూల ప్రాంతాలకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళ వారం అధిక సంఖ్యలో మహిళా పోలీసులు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అర్బన్‌లో పనిచేస్తున్న వారిని అర్బన్‌కే కేటాయించాలని కోరారు. ఇప్పటికే పిల్లలను స్కూలు, కాలేజీల్లో చేర్చుకున్నామని.. ఇప్పటికిప్పుడు అంత దూరం వెళ్లాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మరికొందరు చంటి పిల్లలతో ఉన్నారని తెలిపారు. బదిలీలకు ముందే తమ నుంచి ఆప్షన్స్ తీసుకున్నారని, కానీ వాటి ప్రకారం బదిలీలు చేయలేదని మహిళా పోలీసులు వాపోయారు. ఏ ప్రాతిపదికన బదిలీలు నిర్వహించారో కూడా అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా బదిలీలకు సంబంధించి విధి విధానాలు కూడా రూపొందించలేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి తాము కోరుకున్న ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. సుమారు రెండు గంటలపాటు వారు జిల్లా పోలీస్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. అయితే జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో.. అదనపు ఎస్పీని కలిసేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో బుధవారం మరోసారి పోలీస్ కార్యాలయం ఉన్నతాధికారులను కలవాలని నిర్ణయించుకున్నారు.

ఫారము నెం: 1

పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ, నరసరావుపేట

(పిడుగురాళ్ల మున్సిపాలిటీ కోసం GIS ఆధారిత డ్రాఫ్ట్ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ల్యాండ్ యూజ్ మ్యాప్ నోటిఫికేషన్ అభ్యంతరాలు మరియు సూచనల కోసం ఆహ్వానిస్తోంది)

(ఆంధ్ర ప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ యాక్ట్ 2016, సెక్షన్ 12 లోని సబ్ సెక్షన్ (1) మరియు ఆంధ్ర ప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూల్స్ 2018 (16) లోని రూల్ 16 లోని సబ్ రూల్ (3) కింద జారీ చేయబడిన నోటీస్)

Roc.No.26/PAUDA/MP/2023, తేది : 08-07-2025

1. డైరెక్టర్ అఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ వారిచే రూపొందించబడిన పిడుగురాళ్ల మున్సిపాలిటీ యొక్క డ్రాఫ్ట్ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ దిగువ షెడ్యూల్లో దీని నకలు ఇక్కడ జతచేయబడింది, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ మెటోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్ రూల్స్, 2018లోని రూల్ 16లోని సబ్ రూల్ (3) కింద ప్రచురించబడింది.
2. వివిధ భూ వినియోగాలను వివరించే మ్యాప్ ను పిడుగురాళ్ళ మున్సిపాలిటీ నందు, పిడుగురాళ్ళ లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల నందు మరియు పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం, డోర్ నెం. 9-10-5, 4వ అంతస్తు, కరూర్ వైశ్య బ్యాంకు బిల్డింగ్, అరండల్ పేట, నరసరావుపేట-522601 నందు కార్యాలయ వేళల్లో (ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 వరకు) ఛార్జీ లేకుండా తనిఖీ చేయవచ్చు.
3. డ్రాఫ్ట్ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ భూ వినియోగ మ్యాప్ పై ఆసక్తి ఉన్న ఎవరైనా అభ్యంతరాలు మరియు సూచనలను కమిషనర్, పిడుగురాళ్ల మున్సిపాలిటీ/ పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్ పర్సన్ వారికి లిఖిత పూర్వకంగా లేదా **vcpauda@gmail.com/pdrl_mplty@yahoo.com, mc.piduguralla@cdma.gov.in** కి ఇ-మెయిల్ ద్వారా 30 రోజులలోపు అంటే 08-08-2025 వరకు తెలియజేయవచ్చును.

షెడ్యూల్: పిడుగురాళ్ళ మున్సిపాలిటీ GIS ఆధారిత డ్రాఫ్ట్ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ల్యాండ్ యూజ్ మ్యాప్:

I. ఇప్పటికే ఉన్న ప్రస్తుత భూ వినియోగ పటం

II. GIS ఆధారిత డ్రాఫ్ట్ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ల్యాండ్ యూజ్ మ్యాప్ ప్లానింగ్ ఏరియా సరిహద్దు: **తూర్పు** : కొండమోడు, **పడమర:** కామేపల్లి, కరాలపాడు, పెద అగ్రహారం, **ఉత్తరం** : పిల్లుట్ల, మల్లవోలు, కోనంకి **దక్షిణం:** జానపాడు, నెమలిపురి

తేది : 09-07-2025 సం/- ఉపాధ్యక్షులు
స్థలం: నరసరావుపేట పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ, నరసరావుపేట

మన్నవను ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది..
నాగమల్లేశ్వరరావు కుటుంబమే

▸▸ మాల కార్పొరేషన్ డైరెక్టర్ బాబూరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు, ఎస్సీ నేతలు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మన్నవను ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది నాగమల్లేశ్వరరావు కుటుంబమేనని పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ నేత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు విమర్శించారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1994లో మొదటిసారి సర్పంచ్‌గా వ్యవహరించిన బొనిగల నాగమల్లేశ్వరరావు హత్యా రాజకీయాలకు పాల్పడుతూ మల్లెల నాగమల్లి హత్యకు కారకులయ్యారని ఆరోపించారు. అలాగే 2000 నుంచి 2006 సంవత్సరం వరకు బొనిగల నాగమల్లేశ్వరరావు తల్లి సూర్య బాపమ్మ సర్పంచ్‌గా ఉండగా రేషన్ డీలర్ దగ్గర 200 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా అమ్ముకొని.. ఆ నేరాన్ని డీలర్ పైకి నెట్టి జైలుపాలు చేశారని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాలు సొంత భవనంగా గ్రామ పంచాయతీ రికార్డు టాంపరింగ్ చేయగా వారిమీద 420 కేసు నమోదయిందని తెలిపారు. నాగమల్లేశ్వరరావు గ్రామ పంచాయతీ నిధులు దిగమింగడంతో అతనిపై 420 కేసు నమోదు చేసి, చెక్ పవర్ రద్దు చేసి సర్పంచ్‌గా కూడా తొలగించారని వివరించారు. నాగమల్లేశ్వరరావు ఈ మడేళ్లలో రూ. 55.6 లక్షల అవినీతికి పాల్పడి ప్రభుత్వ నిధులు దిగమింగారని.. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తే.. అతడు సచ్ఛీలుడని వైసీపీ అగ్ర నాయకులు ఏవిధంగా సమర్థిస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తనపై 30 మందితో దాడి చేసి, చనిపోయాననుకుని వదిలి వెళ్లిపోయారని బండ్లమూడి బాబూరావు గుర్తుచేశారు. మొదటి నుంచి బొనిగల నాగమల్లేశ్వరరావు అవినీతిని ప్రశ్నిస్తున్న తన కుటుంబంపై కక్షగట్టి అందరినీ అంతమొందించాలనే ఉద్దేశంతో గడిచిన ఐదేళ్లలో అనేకసార్లు తనపై దాడి చేశారని, 9 అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. నాగమల్లేశ్వరరావు ఒక అంతర రాష్ట్ర దొంగల ముఠా చరిత్ర కలిగినవాడని.. అంబటి మురళి, అంబటి రాంబాబు, పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు.

జవాన్‌కు ఘన నివాళులు

▸▸ నాగేశ్వరరావుకు కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్థులు
▸▸ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
▸▸ కుటుంబానికి న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పెదనందిపాడు, జూలై, 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జవాన్ నాగేశ్వరరావు మృతదేహానికి గ్రామస్థులు, బంధుమిత్రులు, పోలీసు అధికారులు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. మండల పరిధిలోని వరగానిలో నాగేశ్వరరావు మృతదేహానికి రాజస్థాన్‌లోని బీకనీర్ 177వ మీడియం రెజిమెంట్ సుబేదారులు బీవీ రమణ, రవీంద్రలు పార్థీవ దేహంపై జాతీయ జెండా ఉంచి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సమయంలో అక్కడి వైద్య సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించకపోవడం వల్లే తన భర్త, కుమారుడుని కోల్పోయానని నాగేశ్వరరావు భార్య బోరున విలపిస్తూ.. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. తహసీల్దార్ హెనప్రియ, ఎస్ఐ మధు పవన్‌కు.. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నాగేశ్వరరావుతో పాటు కుమారుడు వెంకట్ అభిషేక్ మృతదేహాలకు వరగానిలో శ్మశాన వాటికలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. ఏఆర్ ఎస్ఐ ఏసురాజు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు, ప్రత్తిపాడు సీఐ గన్నవరపు శ్రీనివాసరావు, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ

జిల్లా కార్యాలయం, లింగంగుంట్ల కాలనీ, నరసరావుపేట,

ఫోన్: 8309897907, 7702990280

రెండవ దశ రవాణా టెండర్ ప్రకటన (స్టేజి 11) - మూడవ పిలుపు

టెండరు నోటీసు నెం. MOVT/STAGE-II/CSCPALNADU/2025-27 తేది : 08-07-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, పల్నాడు, జిల్లాలో బియ్యం, పామోయిల్, కందిపప్పు, పంచదార, ఇతర నిత్య అవసర వస్తువులను ఈ క్రింది వివిధ మండల స్థాయి గోదాములు మరియు బఫర్ గోదాములు, మరియు ప్రభుత్వం వారు నిర్ణయించిన గోదాములు లేదా ప్యాకింగ్ యూనిట్ నుండి ఆయా మండల స్థాయి గోదాములుకు అనుసందానింపబడిన మండలము లోని చౌక ధరల దుకాణలకు లేదా గ్రామ సచివాలయంలకు లేదా ప్రభుత్వం వారు సూచించిన ప్రదేశమునకు 2025-27 (అగ్రిమెంట్ తేది నుండి 31.3.2027 వరకు) సంవత్సరములకు స్టేజి-II క్రింద రవాణా చేయుటకు ఆన్లైన్ ద్వారా మండల స్థాయి గోదాములకు విడి విడి గా టెండర్లు కోరబడుచున్నవి. పల్నాడు జిల్లా లో మండల స్థాయి 10 స్టాక్ పాయింట్లు అనగా 1) అచ్చంపేట 2) చిలకలూరిపేట 3) గురజాల 4) మాచర్ల 5) నరసరావుపేట 6) పెదకూరపాడు 7) పిడుగురాళ్ళ 8) రాజుపాలెం 9) సత్తెనపల్లి 10) వినుకొండ మండల స్థాయి స్టాక్ పాయింట్లకు స్టేజి-II టెండర్ వేయుటకు మండల స్థాయి గోదాములు, బఫర్, వార్డు సచివాలయం దూరంతో సంబంధం లేకుండా/ గోదాముల నుండి చౌక ధరల దుకాణంలకు లేదా గ్రామ మండల టెండర్ వేయవలెను. జిల్లాలోని మండల స్థాయి గోదాములకు విడివిడిగా క్వింటాలు ఫ్లాట్ రేటు వేయవలెను, మండల స్థాయి గోదాములుకు అనుసందానింపబడిన మండలములు మరియు కేటాయించబడిన సరుకు వివరాలు టెండర్ డాక్యుమెంట్ లో పొందవచ్చును.

వివరములు	తేదీ మరియు సమయము
1. బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ప్రారంభ తేదీ	09.07.2025 నుండి 8.00 am
2. బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేదీ.	18.07.2025 వరకు12.00 pm
3. ఆన్లైన్ బిడ్‌ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం	19.07.2025 వరకు 5.00 pm
4. టెక్నికల్ టెండర్స్ తెరుచు తేదీ మరియు సమయం	21.07.2025 ఉదయం03.30 pm నకు
5. ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ మరియు సమయం (ఫైనాన్షియల్ బిడ్)	22.07.2025 మధ్యాహ్నం11.30 am నకు

స్టేజ్-II రవాణా కాంట్రాక్టుకు సంబందించిన టెండర్ ప్రక్రియ పూర్తిగా **e-procurement** పోర్టల్ నందు మాత్రమే జరుగును (website address: https://tender.apeprocurement.gov.in). ఆసక్తి గల రవాణాదారుడు పైన తెలిపిన website సందర్శించి బిడ్ డాక్యుమెంట్ మరియు టెండర్ ప్రకటన వివరాలను పొందవచ్చును. అదేవిధంగా టెండరును దాఖలు చేయుటకు మాత్రం పైన తెలిపిన website నందు రిజిస్టర్ చేసుకుని ప్రవేశ రుసుము క్రింద రూ. 10,000/- **APTS** వారికి మరియు రూ. 5000/- + GST% @18% రూ. 900/- కలిపి (రూ 5900/-) లను ఏ జాతీయ బ్యాంకు / షెడ్యూల్ బ్యాంకులో నైనా DISTRICT CIVIL SUPPLIES MANAGER, APSCSCL, PALNADU పేరిట నరసరావుపేట లో చెల్లుబాటు అగునట్లుగా చెల్లించి ఆన్లైన్ బిడ్లు www.apeprocurement.gov.in నందు దాఖలు చేసి షెడ్యూల్ తో పాటు టెండర్ ఫోరమ్స్ పొందవచ్చును టెండర్ డాక్యుమెంట్ లో సూచించిన విధము గా ఆయా మండల స్థాయి గోదాములు నిర్దేశించిన విధంగా వ్యాపార ధరావతు సొమ్ము EMD ని టెక్నికల్ టెండర్ తో జత చేయవలెను.

ఏ కారణం లేకుండా టెండర్ లో మార్పులు చేయుటకు గానీ వాయిదా వేయుటకు గాని పూర్తిగా రద్దు పరుచుటకు గాని జిల్లా జాయింట్ కలెక్టర్ పల్నాడు, వారికి పూర్తి అధికారం కలవు.

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు
ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, పల్నాడు జిల్లా

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

(5వ పేజీ తరువాయి)

విచారణల్లో వెలుగుచూస్తున్నాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను నీరుగార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థికంగా కుదేలైంది. ఇదే పాలనను కూటమి ప్రభుత్వం కూడా అమల్లోకి తీసుకురావడంతో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

45,606 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,553 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,606 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,406 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12700
నెంబరు. 5	10000	13200
273	---	----
341	10000	13400
4884	----	---
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500
షార్క్-1	---	---
బ్యాడిగి	10000	12700
దేవనూరు డీలక్స్	10000	12400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9700	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12800
నెంబరు. 5	10000	13200
273	--	---
341	10000	13500
4884	10000	12600
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13300
బ్యాడిగి	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12300
తాలుకాయలు	4700	7000



వృద్ధురాలికి కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

నిరుపేదల తలరాతలు మార్చే ప్రభుత్వం ఇది

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- ఆరో డివిజన్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇది మనసున్న ప్రభుత్వమని, నిరుపేదల తలరాతలు మార్చే ప్రభుత్వమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నియోజకవర్గంలోని ఆరో డివిజన్ రైలుపేటలో పర్యటించారు. సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు అందజేసి ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాల గురించి వివరించారు. ప్రతి పథకం తమ జీవితాలను మార్చే వెలుగు రేఖ అని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైలుపేట ప్రాంతంలో అడుగుపెట్టాలంటే దుర్భరంగా ఉండేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితులను పూర్తిగా మార్చేశామని తెలిపారు. గుంతల రోడ్లకు మహర్దశ తీసుకొచ్చామని, వీధి లైట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. తాగునీటి సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. ఇవే కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తల్లికి వందనం, పింఛన్ల పెంపు, కార్పొరేషన్ లోన్లు అందిస్తున్నామని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా ద్వారా సుమారు వెయ్యి మంది నిరుద్యోగులకు బతుకు బాట చూపించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ సమత, రాజా మాస్టర్, శ్రీను నాయక్, పూర్ణ సింగ్, పోతురాజు చంద్రశేఖర్, బాజీ మాస్టర్, మస్తాన్ రెడ్డి, కొనకల్ల సత్యం, ఫిరోజ్, గంట కిరణ్, లోకేష్, కొత్తూరి వెంకట్, వలి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులు

బదిలీలలో తీవ్ర అన్యాయం

- కలెక్టరేట్ ఆవరణలో సచివాలయ మహిళా పోలీసుల నిరసన

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలును పక్కన బెట్టి బదిలీలు జరుపుతున్నారని గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలు పారదర్శకంగా జరగాలంటూ కలెక్టరేట్ లోపల రాత్రి సమయంలో ఉద్యోగులు బైఠాయించి నిరసన తెలిపారు. జీవోలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా బదిలీల ప్రక్రియ చేపట్టారని మండిపడ్డారు. వార్డు నుంచి ప్రతి వార్డుకు మాత్రమే బదిలీ జరగాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని, దానిని పక్కనబెట్టి బదిలీ ప్రక్రియ నిర్వహిస్తున్నారని వాపోయారు. దాదాపు వంద కిలోమీటర్ల వద్ద ఉన్న సచివాలయాలకు బదిలీ చేస్తున్నారని, తక్కువ జీతాలతో అంత దూరంలో విధులు ఎలా నిర్వహిస్తామని ప్రశ్నించారు. సచివాలయ పరిధిలో మిగిలిన శాఖలలో విధుల నిర్వహిస్తున్న సిబ్బందిని పక్క సచివాలయాలకు మాత్రమే బదిలీ చేస్తున్నారని, ఒక్క పోలీసులను మాత్రం దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ స్పందించి బదిలీలలో నిబంధనలను అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్‌కు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తికి వినతి పత్రాలను అందజేశారు.

నేడు జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మె సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి బీఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రైవేటీకరణకు బానిసలుగా మారిన పాలకులను హెచ్చరించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సమ్మె ఒక్కరోజు కార్యక్రమం కాదని, సమ్మె అనంతరం పోరాటాలు మరింత తీవ్రతరంగా కొనసాగుతాయని హెచ్చరించారు. సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, యువత, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, షేక్ వలి, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

సాయినాధునికి నాగవల్లీ దళార్చన

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యానగర్, 3వ లైన్‌లోని శ్రీ సాయినాధ సన్నిదానంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాబా వారికి విశేషాభి షేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం సాయినాధునికి భక్తి శ్రద్ధలతో నాగవల్లీ దళార్చన నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని బాబా వారి పాద పద్మములను తమలపాకులతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి ఆశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, స్వరూపరాణి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



సాయినాధునికి నాగవల్లీ దళార్చన సమర్పిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా బుధవారం ఎల్ఐసీ కాలనీ, భాగ్యనగర్, ఎస్‌వీఎన్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

దశల వారీగా వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు

- నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



ప్రసంగిస్తున్న నగర మేయర్ రవీంద్ర, వేదిక పైన ఎమ్మెల్యేలు నసీర్, మాధవి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో దశల వారీగా వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని నగర ప్రజలు, వీధి వ్యాపారులు సహకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గళ్లా మాధవి, డిప్యూటీ మేయర్ షేక్ సజీలాతో కలిసి మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కార్పొరేటర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో తొలుత మోడల్‌గా నగరపాలక సంస్థ కార్యాలయం పరిసరాల్లో ఉండే వీధి వ్యాపారులకు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నగరపాలక సంస్థ స్థలాల్లో జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు ఈ నెల 10న విద్యా సంస్థల్లో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందించాలన్నారు.

కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర పరిధిలో అస్తవ్యస్తంగా ఉన్న వీధి వ్యాపారులను వారి హక్కులకు భంగం కలగకుండా, చట్ట ప్రకారం జోన్ల ఏర్పాటు ద్వారా క్రమబద్ధీకరించనున్నామన్నారు. అవసరమైతే ప్రైవేట్ స్థలాలు లీజ్‌కి తీసుకొని వార్డుల వారీగా అవసరమైన ప్రాంతాల్లో జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నగర వెండింగ్ కమిటీ పలు ప్రాంతాలను గుర్తించిందని తెలిపారు. అలాగే నగరంలో ఈ సీజన్‌లో 5 లక్షల మొక్కలను దశల వారీగా నాటడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందులో ఇప్పటికే సుమారు 33 వేల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరంలో తొలుత వీధి వ్యాపారుల వలన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్న ప్రాంతాల్లో వారికి జోన్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఒక్కో వార్డులో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా సిబ్బందికి బాధ్యతలు కేటాయిస్తే మొక్కల రక్షణ జరుగుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ప్రస్తుతం వారు వ్యాపారాలు చేసుకుంటున్న ప్రాంతాల్లో జోన్లు ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది అభ్యంతరాలు లేకుండా ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. నగరంలో ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటడం, సంరక్షించడం జీఎంసీ తీసుకోవాలని, అంతర్గత రోడ్లు, పార్క్ లలో స్థానికంగా మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు ఉంటే వారికి అప్పగిస్తే బాగుంటుందన్నారు. అనంతరం మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కార్పొరేటర్లు పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, ఏడీహెచ్ జె.శాంతి, ఎంహెచ్‌ఓ (ఇన్‌చార్జి) రామారావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మిషన్ ఫర్ ద యూత్ సేవలు అభినందనీయం

గుంటూరు(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యాభివృద్ధికి, యువత సామాజిక, సాంఘిక ఆర్థిక అభివృద్ధికి మిషన్ ఫర్ ద యూత్ ఎంతగానో కృషి చేయటం అభినందనీయమని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమాలలో ఉద్యోగస్తులు అందరూ కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశ్రాంత పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ బుస్సా రత్న ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాలలో ఉన్న పేద యువతను ఉద్యోగ, వ్యాపార రంగాలలో ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తులందరూ భాగస్వాములు కావాలని రత్న ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్ అహ్మద్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు జి.బ్రహ్మయ్య, కే శివకుమార్, జి అశోక్, జెడ్ రమేష్, కొరివి వినయ్ కుమార్, ఆలా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తదితరులు

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా యడ్లపల్లి

గుంటూరు(లీగల్), జూలై 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది యడ్లపల్లి కోటేశ్వరరావును గుంటూరు నగరపాలక సంస్థకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మంగళవారం కోటేశ్వరరావుకు అందజేశారు. నగరంలోని పలు కోర్టులలో నగరపాలక సంస్థ తరపున కోటేశ్వరరావు మూడేళ్ల పాటు న్యాయవాదిగా హాజరై వాదనలు వినిపించనున్నారు. 1994 నుంచి కోటేశ్వరరావు గుంటూరు జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా పని చేస్తున్నారు. కోటేశ్వరరావు నియామకంపై పలువురు సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్న శ్యామల సుధాకర్‌రెడ్డి నుంచి కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

ఈవ్‌టీజర్‌కు తల్లిదండ్రుల మందలింపు

- ఎన్జీవో కాలనీ ఎస్‌కేబీపీఎం వద్ద విద్యార్థినులపై వేధింపులు



యువకుడిని మందలిస్తున్న తల్లిదండ్రులు

గుంటూరు (విద్య) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్జీవో కాలనీలోని ఎస్‌కేబీపీఎం స్కూల్లో విద్యార్థిని వేధిస్తున్న ఈవ్‌టీజర్‌ను తల్లి దండ్రులు మంగళవారం మందలించారు. స్థానిక నల్లకుంట పరిసర ప్రాంతాల్లో ఉంటున్న కొంతమంది ఆకతాయిలు పాఠశాలలో చదివే విద్యార్థినుల్ని నిత్యం వేధిస్తున్నారు. బైక్‌పై వెంబడిస్తూ అసభ్య పదజాలంతో టీజింగ్ చేస్తున్నారు. గత 15 రోజులుగా ఇబ్బందులు ఎక్కువ కావడంతో విద్యార్థినులు ఈ విషయం పాఠశాలలో ఉపాధ్యాయ దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం తల్లిదండ్రులను పిలిపించి ఉపాధ్యా యులు కాపు కాశారు. పాఠశాల నుంచి వెళ్తున్న విద్యార్థినుల్ని వేధిస్తున్న యువకుడిని పట్టుకొని మందలించారు. ఇందులో మొత్తం నలుగురు యువకులు ఉండగా ముగ్గురు తప్పించుకున్నారు.

విద్యుత్ పోల్ పడి ఇద్దరికి గాయాలు



గాయపడిన బాబు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పోల్ పడి ద్విచక్రవాహన చోదకులు గాయపడిన సంఘటన మెడికల్ కళాశాల రోడ్డులోని రైల్వే క్వార్టర్స్ వద్ద జరిగింది. శ్రీనివాసరావుపేటకు చెందిన అబ్దుల్ బియాబాని, బాబు ఇద్దరూ జీజీహెచ్‌లో తమ బంధువును పరామర్శించేందుకు వెళుతున్నారు. మార్గమధ్యంలో రైల్వే క్వార్టర్స్ వద్దకు రాగానే విద్యుత్ పోల్ ఒక్కసారిగా విరిగి పడింది. ఇందులో బియాబాని చిన్నపాటి గాయాలతో బయటపడగా బాబు కాలుకు తీవ్ర గాయమైనట్లు తెలిపారు. బాబును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోల్ విరిగి రోడ్డు పక్కన పడిపోవటం, అందులో విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ యంత్రాంగం బలహీనంగా ఉన్న పోల్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.



రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం



ట్యాబ్‌లు అందుకున్న ఆర్పీలతో బూర్ల రామాంజనేయులు

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లో క్యాంపు కార్యాలయంలో ఆర్పీలకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌లతో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు వేగవంతంగా ప్రజలకు అందుతాయని చెప్పారు. ప్రభుత్వ సర్వేలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఈ ట్యాబ్‌లు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం

గుంటూరు(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెల్లాకుల జాలయ్య, పోలిశెట్టి సోమసుందరం కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి నియమితులైన సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం, ఏటీ అగ్రహారం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అంబడిపూడి శ్యాంసుందర్, గౌరవాధ్యక్షుడు వంక మామిడి వెంకటరామయ్య, ఉపాధ్యక్షుడు జమ్మలమడుగు సీతారామాంజనేయ శర్మ, కార్యదర్శి పమిడిఘటం వెంకట సత్యనారాయణ, కోశాధికారి సుసర్ల వెంకటరమణ పాల్గొన్నారు.



కామేశ్వరశాస్త్రిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వైఎస్ఆర్ జయంతి జరిగింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. వైసీపీ సీనియర్ నాయకుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగడిగుంట లాంచస్టర్ రోడ్డు సెంటర్‌లో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమం జరిగింది. వైసీపీ తూర్పు ఇన్‌చార్జ్ షేక్ నూరిఫాతిమా హాజరై గజమాలతో నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమ విప్లవాన్ని సృష్టించిన ఘనత వైఎస్ఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, జీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరరావు, తుమ్మేటి శ్రీనివాసరావు తదితరులున్నారు.



వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూచిపూడి విజయ తదితరులు

● రాజీవ్‌గాంధీభవన్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ కూచిపూడి విజయ, పార్టీ నాయకులు డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, బిళ్ళా సునీల్‌లు పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ వైఎస్ఆర్ కలలు కన్నట్లు రాహుల్‌గాంధీని ప్రధాని చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం శ్రమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రత్తయ్య, మోషే, రామకృష్ణ, ఖలీల్, కరీమ్, కిరణ్ తదితరులున్నారు.

స్మార్ట్ టీవీ బహుకరించిన పూర్వ విద్యార్థులు

గుంటూరు (విద్య) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీజేపీఎస్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కళాశాలకు స్మార్ట్ టీవీ బహుకరించారు. కళాశాలలో 1975-1978 విద్యాసంవత్సరంలో డిగ్రీ చదివిన విద్యార్థులు కె.నాగలక్ష్మి, యలమంచిలి మురళి, కిలారి కృష్ణారావు, విద్యాసాగర్‌రెడ్డి, మధుబాబు, లీలాకృష్ణ, మనోహర్, ప్రసాద్, ఖలీల్, ఖాశీమ్ మంగళవారం ప్రిన్సిపల్ కామేశ్వరశాస్త్రికి టీవీ అందజేశారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, మేయర్ రవీంద్ర తదితరులు

ఇళ్ల పట్టాల పేరుతో లబ్ధిదారులను మోసం చేసిన వైసీపీ

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్యా మాధవి
- ఎమ్మెల్యే ఎదుట గోడు వెళ్ళబోసుకున్న పలువురు బాధితులు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు జగనన్న కాలనీ పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్యా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లచెరువు 19వ డివిజన్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆమె, మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికలకు ముందు వైసీపీ నేతలు తమకు జగనన్న కాలనీలో ప్లాట్లు ఇస్తున్నాం అని చెప్పి పత్రాలు అందజేశారు, కానీ స్థలం ఎక్కడ ఉన్నదో చూపించలేదని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే గళ్యా మాధవిని కోరారు. అదేవిధంగా టిడ్కో ఇళ్ల కేటాయింపులో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే మాధవికి ఫిర్యాదు చేశారు. నల్లచెరువు జీరో లైన్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్యా మాధవి విలేకరులతో మాట్లాడుతూ నల్లచెరువు, సంపత్‌నగర్, శ్రీనివాసరావుపేటకు చెందిన ప్రజలకు అనంతవరప్పాడు గ్రామంలో 1500 - 2000 ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని చెప్పి, అనేక మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఆన్‌లైన్‌లో ఎక్కించి, స్థలాలు ఎక్కడో చూపకుండా వైసీపీ నేతలు మోసం చేశారన్నారు. అదేవిధంగా టిడ్కో ఇళ్ల కేటాయింపులో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారన్నారు. వీటన్నిటిని రాబోయే రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఒక సమావేశం ఏర్పాటు చేసి విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, డివిజన్ అధ్యక్షుడు రాళ్లబండి రామరాజు, తేలుకుట్ల హనుమాయమ్మ, పరిమి రమేష్, మల్లేశ్వరరావు, అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, సభాపతి విజయలక్ష్మి, పులి కృష్ణ, లేళ్ల వెంకటేశ్వర్లు, రాంబిల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కీచకుల పార్టీగా మారిన వైసీపీ

- టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ కీచకుల పార్టీగా మారిపోయిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డికి ఏ మాత్రం మహిళలపై గౌరవం ఉన్నా వెంటనే ప్రసన్నకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమానించిన ప్రతి ఒక్కరిని జగన్‌రెడ్డి అందలాలు ఎక్కించటమే ఇలాంటి సంఘటనలకు కారణమని గుర్తు చేశారు. అంబటి రాంబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వంశీ, గోరంట్ల మాధవ్, అవంతి శ్రీనివాస్ లాంటి తదితర నీచులకు జగన్ రెడ్డి అండగా ఉండబట్టే మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. భువనమ్మ శాపంతో, అమరావతి మహిళల ఆక్రోశంతో జగన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా దక్కక పోయినా వారిలో మార్పు రాకపోవటం సిగ్గు చేటన్నారు. మహిళా ఎమ్మెల్యే అన్న కనీస గౌరవం లేకుండా ఉచ్చనీచాలు మరిచి మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. ఆ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి సొంత చెల్లెలుపై వ్యక్తిత్వ హననానికి పాల్పడితే, వరసకు చెల్లెలైన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న దుర్మార్గంగా మాట్లాడటం హేయమన్నారు. మహిళలను వేధిస్తున్న వైసీపీ రాజకీయ పార్టీగా ఇక ఏ మాత్రం మనుగడ సాగించలేదని కనపర్తి తేల్చి చెప్పారు.

ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళాలోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలి

- లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మహిళాలోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని, క్షమాపణ చెప్పని పక్షంలో పోలీసులు అతడిని అరెస్టు చేయాలని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు ప్రజల సమస్యల గురించి కానీ, పరిష్కార మార్గాల గురించి కానీ ఏనాడు మాట్లాడలేదన్నారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీల నాయకులను శత్రువులుగా భావించి బూతు పురాణాలను మాట్లాడుతుంటారని విమర్శించారు. ప్రశాంతి రెడ్డిపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన దారుణమైన వ్యాఖ్యలను మరలా ప్రెస్‌మీట్ పెట్టి సమర్థించుకోవడం వైసీపీ బరితెగింపునకు నిదర్శనమన్నారు. జగన్ మార్కు అరాచక రాజకీయాలను ప్రజలు గమనించి వైసీపీని రాజకీయంగా సమాధి చేశారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

ప్రసన్నకుమార్‌రెడ్డిపై జగన్ చర్యలు తీసుకోవాలి

- టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై జగన్ చర్యలు తీసుకోకపోవడం మహిళలను అవమానించడమేనని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అశ్లీల పదజాలాన్ని ఖండించడానికి కూడా జగన్‌రెడ్డి ముందుకు రాకపోవడం మహిళలను అవమానించడమేనన్నారు. కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన జగన్‌రెడ్డికి మహిళల త్యాగాలు, గొప్పతనం గురించి ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి బేషరతుగా మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రత్తిగడుపు హనుమంతరాజు, దూదేకుల షాహిద్, దుడికి సాంబయ్య, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గురువైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం గురువైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిష్ఠల నరసింహమూర్తి గురుపౌర్ణమి ప్రాధాన్యతను వివరిస్తూ శంకరులను జగద్గురువులు అని ఎందుకు అంటారో వివరించారు. గురువు త్రిమూర్త్యాత్మకుడు అని అనడానికి కారణం, అష్టావక్రుడు, జనకునికి బ్రహ్మోపదేశం చేసిన తీరు వివరించారు.



రేషన్ డిపో వద్ద క్యూఆర్ కోడ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సమస్యకు.. స్కాన్

- రేషన్ ఫిర్యాదులకు క్యూఆర్ కోడ్
- దుకాణాల వద్ద పోస్టర్లు ఏర్పాటు

సత్తెనపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు.. డీలర్ల మోసాలపై ఫిర్యాదులకు.. కార్డుదారుల సమస్యలు పరిష్కరించేందుకు.. ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. రేషన్ దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకుంది. ఈ పోస్టర్ల లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సమస్యలను, ఫిర్యా దులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కార్డు దారులకు అవకాశం కల్పించింది. రేషన్ సరుకుల సరఫరాను మరింత పారదర్శకంగా చేపట్టేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తుంది. ఎండీయూ వాహనా లను రద్దు చేసి రేషన్ డిపోల ద్వారా సరుకులను అం దజేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సరుకుల పంపిణీలోని సమస్యలు, అభ్యంతరాలపై ఫిర్యాదు చేసేందుకు కార్డుదారులు ఇబ్బంది పడకుం డా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గతంలోలా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిపో వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి క్షణాల్లోనే ఫిర్యాదు చేసే అవకాశం కార్డుదారులకు కల్పించింది.

క్యూఆర్ కోడ్ ఇలా..

డిపోల వద్ద ప్రదర్శిస్తున్న క్యూఆర్ కోడ్‌తో కార్డుదారులకు అనేక ఉపయోగాలు ఉన్నాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఈ నెల సరుకులు తీసుకున్నారా?, సరుకుల నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా? డీలర్ సరైన తూకంలో సరుకులు ఇచ్చారా?, అధిక ధరలు వసూలు చేశారా? డీలర్ మీతో మర్యాదపూర్వ కంగా వ్యవహరించారా?, సమయ పాలన పాటిస్తు న్నారా? అనే ప్రశ్నలతో వెబ్ పేజీ వస్తుంది. ఆయా ప్రశ్నలకు సమాధానం ఇస్తే కార్డుదారుల ఫిర్యాదులు, అభిప్రాయాలు నేరుగా సంబంధిత ఉన్నతాధికారులకు చేరుతాయి. వాటిని పరిశీలించిన అధికారులు సత్వరం పరిష్కరిస్తారు.

అక్రమాల నివారణకే..

రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాల నివారణకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఉపకరిస్తుంది. సరుకుల పంపి ణీలో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తే క్యూఆర్ కోడ్ స్కా నర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. క్యూఆర్‌కోడ్ స్కానర్ల ఫ్లెక్సీలను ప్రతీ రేషన్ డిపో వద్ద ప్రదర్శిస్తున్నాం.

-రవికుమార్, సీఎస్‌డీటీ సత్తెనపల్లి


రేషన్ షాపు వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ

ఆల్ ఇన్ వన్.. రైల్‌వన్!

- రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్ బుకింగ్ సదుపాయం
- పీఎన్‌ఆర్ స్థితి, కోచ్ పొజిషన్ వంటి సర్వీసులెన్నో..
- ఫుడ్ కూడా ఆర్డర్ చేసే అవకాశం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ అందిస్తున్న వివిధ రకాల సేవలన్నీ ఒకే యాప్‌లోకి తీసుకొచ్చింది. అన్ని సర్వీసులను రైల్‌వన్ మొబైల్ అప్లికేషన్‌లో అందుబాటులో ఉంచింది. దీంతో వేల సంఖ్యలో వినియోగ దారులు ఈ యాప్ ద్వారా రైల్వే సేవలు పొందడం ప్రా రంభించారు. రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్లతో సహా అనేక సర్వీసులు ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ వినియోగ దారుల అరచేతిలోకి వచ్చేశాయి. దీంతో రైల్వేస్టేషన్లు, పీఆర్ఎస్ కౌంటర్ల వద్దకు వెళ్లకుండానే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొని ప్రయాణిస్తున్నారు. అంతేకాకుండా ట్రాక్ యువ ర్ ట్రైన్ వంటి సేవలు కూడా పొందగలుగుతున్నారు.

రైల్‌వన్ యాప్‌ని రైల్వే శాఖ గత వారమే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో మొబైల్ నంబరు ద్వారా రిజిష్టర్ చేసుకోవచ్చు. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్టు, యూటీఎస్ యాప్‌ల యూజర్లు కూడా.. వాటి ద్వారా రిజిస్టర్ కావొచ్చు. కొంత సమయానికే ఈ యాప్ అవసరం అనుకొనే వాళ్లు గెస్టుగా కూడా లాగిన్ కావడానికి అవకాశం ఉంది. లాగిన్ అయ్యాక హోం పేజీలోనే అన్ని సేవలు కనిపిస్తాయి. వినియోగదారుడు వాటిల్లో ఏ సర్వీసు కావాలంటే దా నిని బుక్ చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్ ద్వారా రైల్‌వ న్‌లో రిజిస్టర్ అయితే ఆర్ వ్యాలెట్ యాక్సెస్ కావొచ్చు.

అన్ రిజర్వుడ్ టిక్కెట్లపై 3 శాతం రాయితీ

రైల్‌వన్ యాప్‌ని వినియోగించి అన్ రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్లను బుకింగ్ చేసుకొంటే రైల్వే శాఖ ప్రత్యేక రాయితీ కల్పిస్తోంది. మూడు శాతం క్యాష్‌బ్యాక్‌గా ఆర్ వ్యాలెట్‌లో జమ చేస్తుంది. దీని వల్ల రూ. 100 విలువ చేసే టిక్కెట్ బుకింగ్ చేసుకొంటే రూ.3 ఆర్ వ్యాలెట్‌లోకి వస్తాయి. అన్ రిజర్వుడ్ ఈ-టిక్కెట్ ద్వారా రైళ్లు, సీజన్ టిక్కెట్ తీసుకోవచ్చు. స్టేషన్‌కు దూరంలో నుంచి కూడా బుకింగ్ చేసుకోవచ్చు. అలానే స్టేషన్‌లో ఉన్నా ఈ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి టిక్కెట్ బుకింగ్ చేసుకో వచ్చు. సీజన్ టిక్కెట్ రెన్యువల్ చేసుకొనే సదుపాయం కూడా ఉంది. రైలు ఎక్కే స్టేషన్, దిగిపోయే స్టేషన్ పేర్లు నమోదు చేయగానే ఏ ఏ మార్గాల్లో ప్రయాణించదలిచారో కనిపిస్తాయి. వాటిల్లో ఒకదానిని ఎంపిక చేసి బుకింగ్ చేసుకోవచ్చు. గరిష్టంగా నలుగురు ప్రయాణికులకు ఒక అన్‌రిజర్వుడ్ ఈ-టిక్కెట్ బుకింగ్ చేయొచ్చు. ఆర్‌వ్యాలెట్, యూపీఐ, క్రెడిట్/డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా నగదుని చెల్లించే అవకాశం ఉంది.



రైల్‌వన్ యాప్

సులభతరంగా రిజర్వ్‌డు టికెట్లు

స్లీపర్, సెకండ్ సిట్టింగ్, త్రీటైర్, త్రీటైర్ ఎకానమి, సెకండ్ ఏసీ, ఫస్టు ఏసీ, ఛైర్‌కార్ బోగీల్లో టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చు. అలానే కనెక్టింగ్ జర్నీ, రైల్వేపాస్ రాయితీ, దివ్యాంగుల రాయితీ టిక్కెట్‌లను కూడా బుకింగ్ చేసుకొనే సదుపాయం ఉంది. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్టు యాప్‌లో వలే ఆటో అప్‌గ్రేడేషన్, కోచ్ నంబరు ప్రాధాన్యం, రిజర్వే షన్ ఛాయిస్ వంటివి ఎంపిక చేసుకోవచ్చు. మాస్టరు లిస్టుని కూడా తయారు చేసుకొని అందులో నుంచి ఎవరి పేర్లతో టిక్కెట్ బుకింగ్ చేసుకోవాలనేది నిర్ణయించుకొని సింగిల్ క్లిక్‌తోనే ప్యాసింజర్లను జత చేయవచ్చు. ప్లాట్‌ఫాం టిక్కెట్‌లను స్టేషన్ వెలుపల, స్టేషన్ లోపల నుంచి కూడా బుకింగ్ చేయొచ్చు.

మరికొన్ని సేవలు ఇలా...

ట్రైన్ నంబరు, పేరు నమోదు చేసి దాని షెడ్యూల్‌ని సెర్చ్ ట్రైన్ ఆప్షన్‌ని క్లిక్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చు. అలానే రైలు ఎక్కే స్టేషన్, దిగాల్సిన స్టేషన్ పేర్లను నమోదు చేసి ఏఏ రైళ్లు ఆ మార్గంలో ఉన్నాయో శోధించొచ్చు. రన్నింగ్‌లో ఉన్న రైళ్ల వివరాలు పొందవచ్చు. రాబోయే 2 గంటల నుంచి 8 గంటల మధ్యన ఆ మార్గంలో ఏ రైళ్లు ఉన్నాయనేది కూడా తెలుసుకొనే అవకాశం ఉంది.

- రిజర్వేషన్ టిక్కెట్ పీఎన్‌ఆర్ స్థితిని తెలుసుకోవడానికి సులభతరమైన ఆప్షన్ ఇచ్చారు. పీఎన్‌ఆర్ నంబరుని నమోదు చేసి షో స్టేటస్‌ని క్లిక్ చేయగానే టిక్కెట్ కన్‌ఫర్మ్ అయిందా, ఇంకా వెయిట్ లిస్టులోనే ఉందా, అప్‌గ్రేడ్ అయితే ఏ తరగతి బోగీలోకి అప్‌గ్రేడ్ అయిందనే వివరాలు తెలుసుకోవచ్చు.
- ఇటీవల కాలంలో కోచ్ ఇండికేషన్ బోర్డులు సక్రమంగా పని చేయకపోతుండటంతో ఏ బోగి ఎక్కడికి వచ్చి ఆగుతుందనేది తెలియక ప్రయాణికులు ఆదుర్దా పడుతున్నారు. దీనికి పరిష్కారంగా కోచ్ పొజిషన్ తెలుసుకొనే అవకాశం కూడా రైల్‌వన్ యాప్ కల్పిస్తుంది. ట్రైన్ నంబరు, పేరు, స్టేషన్, ప్రయాణ తేదీని ఎంపిక చేసి షో కోచ్ పొజిషన్ క్లిక్ చేస్తే ఇట్టే ఆ వివరాలు తెలిసిపోతాయి.
- ట్రాక్ యువర్ ట్రైన్ ఆప్షన్ ద్వారా రైలుని రియల్ టైంలో ట్రాకింగ్ చేయొచ్చు. రైలు నంబరు, స్టేషన్ నమోదు చేస్తే ఎన్ని గంటలకు వస్తుంది, ప్రస్తుతం ఏ స్టేషన్ దాటింది, తర్వాతి స్టేషన్ పేరు, కరెంట్ మూవ్‌మెంట్, కోచ్ పొజిషన్ తెలిసిపోతుంది.
- ప్రయాణంలోనే ఫుడ్ ఆర్డర్ చేసుకోవడానికి కూడా రైల్‌వన్ యాప్‌లో అవకాశం కల్పించారు. పీఎన్‌ఆర్ నంబరు ఎంటర్ చేసి సెర్చ్ చేయగానే వివిధ రకాల ఫుడ్ ఐటెంలు కనిపిస్తాయి. వాటిని ఎంపిక చేసి ఆర్డర్ చేయగానే ఫుడ్ షెడ్యూల్ సమయానికి బెర్తు వద్దకు తీసుకొచ్చి అందజేస్తారు.
- రద్దు చేసుకొన్న టిక్కెట్‌లు, ప్రయాణం చేయని వాటికి నిబంధనల ప్రకారం రీఫండ్ ఫైల్ చేయొచ్చు.
- రైల్ మదద్ ఆప్షన్ ద్వారా ప్రయాణ సమయంలో సమస్యకు సంబంధించిన ఫొటో, వీడియో, ఆడియోని జత చేసి నివేదిస్తే.. ఆన్‌బోర్డు సిబ్బంది హాజరై సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటారు.
- ప్రయాణ సమయంలో ఎదుర్కొన్న అనుభూతిని ట్రావెల్ ఫీడ్‌బ్యాక్ ఆప్షన్ ద్వారా తెలియజేసే అవకాశం ఉంది.

ఇక సూపర్ ఫాస్ట్‌గా 'శబరి'

- ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్
- రైల్వేబోర్డు ఆమోదం, మారనున్న కాలమానం
- కొద్ది రోజుల్లోనే అమలులోకి

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా సికింద్రాబాద్ - తిరువనంతపురం మధ్యన రాకపోకలు సాగించే శబరి ఎక్స్‌ప్రెస్ కొద్ది రోజుల్లోనే సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనని రైల్వేబోర్డు మంగళవారం ఆమోదించింది. దీని వల్ల ఈ రైలు కాలమాన పట్టికలోనూ మార్పులు జరగబోతున్నాయి. ప్రస్తుతం 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ నిత్యం ఉదయం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 4.39 గంటలకు చీరాల, 4.54కి బాపట్ల, 5.13కి నిడుబ్రోలు, 5.53కి తెనాలి, ఉదయం 6.29కి గుంటూరు, 7.10కి సత్తెనపల్లి, 7.40కి పిడుగురాళ్ల, 8.07కి నడికుడి, మధ్యాహ్నం 12.45కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత.. బోర్డు అనుమతించిన తేదీ నుంచి ఈ రైలు 20630 నంబరుగా ఉదయం 6.45 గంటలకు తిరువనంతపురంలో బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్లకు సుమారుగా గంట ముందే ప్లాట్‌ఫాం వద్దకు వస్తుంది. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. తద్వారా ఈ రైలు గంటా 45 నిమిషాల ప్రయాణ వేగం పెరుగుతుంది.

ఇదే విధంగా.. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ నిత్యం మధ్యాహ్నం 12.20 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.54కి నడికుడి, 3.14కి పిడుగురాళ్ల, 3.40కి సత్తెనపల్లి, సాయంత్రం 4.59కి గుంటూరు, 5.44కి తెనాలి, 6.04కి నిడుబ్రోలు, 6.24కి బాపట్ల, 6.39కి చీరాల, మరుసటి రోజు సాయంత్రం 6.05కి తిరువనంతపురం చేరుతుంది. బోర్డు అనుమతించిన తేదీ నుంచి ఈ రైలు 20629 నంబరుగా మధ్యాహ్నం 2.35కి సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. అంటే దాదాపుగా ప్రస్తుతం ప్రయాణిస్తున్న కాలమానపట్టిక కంటే రెండు గంటల ఆలస్యంగా పైన పేర్కొన్న స్టేషన్లకు చేరుకొని మరుసటి రోజు సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది. ఈ రైలుకు ప్రైమరీ మెయింటేనెన్స్ ఇప్పటి వరకు తిరుపతి ఉండగా దీనిని తిరువనంతపురం సెంట్రల్‌కు మార్చబోతున్నారు. అలానే సెకండరీ మెయింటేనెన్స్‌ని సికింద్రాబాద్‌కు మారుస్తున్నారు. ఈ కారణంగా కాలమాన పట్టికలో మార్పులు చేశారు.

తెలుగు భాషను సుసంపన్నం చేసే సంస్కృతి రావాలి

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్



బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మీడియాలో తెలుగు భాషను సుసంపన్నం చేసే సంస్కృతి రావాలని.. దీని కోసం ప్రెస్ అకాడమి పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ తెలిపారు. బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని సన్నీ రిసార్ప్ ఆవరణంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల శిక్షణతరగతులలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మీడియా రంగంలో వాస్తవాల్ని వక్రీకరించే విధానాలు ఉండరాదన్నారు. దీని కోసం ఒక నిర్మాణాత్మకమైన అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. చాలా సందర్భాలలో మీడియాలో వస్తున్న కొన్ని కథనాలు ప్రజల్ని పక్కదోవ పట్టించే విధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అన్నీ గ్రామీణ ప్రాంతాలలో విలేకరులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రెస్ అకాడమికి కొత్త ఒరవడిని తీసుకొచ్చేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. తెలుగుభాష కనుమరుగై పోతున్న పరిస్థితులలో దానిని పరిరక్షించే బాధ్యత ప్రెస్ అకాడమి తీసుకుంటుందన్నారు. తెలుగుభాషకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేయటంతోపాటు మీడియా రంగంలో తెలుగు భాషకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పత్రికా రంగం కత్తిమీద సాములాంటిదని తెలిపారు. సమాజంలో జరుగుతున్న ప్రజా సమస్యలపై పనిచేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. ప్రధానంగా క్రైమ్, రాజకీయ, మానవీయ కోణంలో రాసే కథనాలకు ప్రజాదరణ లభిస్తుందన్నారు. స్వయంగా సంఘటన స్థలాలకు వెళితే పూర్తి సమాచారంతో వార్తలు రాయటానికి అవకాశం ఉంటుందన్నారు. విషయపరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు అని ఆయన తెలిపారు.

మనం రోడ్డు వెంట నడుచుకుంటూ అలా వెళ్తుంటే పక్కనే దుకాణాల్లో.. పొంగిన పూరీలు, బోండాలు, ఫ్రైడ్ రైస్, మంచూరియా,సమోసాలు కనబడతాయి. వాటిని చూడగానే ఆకలి పుట్టుకొస్తుంది. కానీ, ఆ ఆహార పదార్థాలను ఎలాంటి నూనెతో తయారు చేశారో మనం తెలుసుకోలేం. మన శరీరాన్ని హరించే ఆహారాన్ని తీసుకుంటున్నామనే.. విషయాన్ని గుర్తించలేకపోతున్నాం.

- గుంటూరులో ఓ యువతి ఆహారం జీర్ణం కాలేదని జీజీహెచ్‌కు వెళ్లింది. వైద్య పరీక్షల అనంతరం స్ట్రీట్ ఫుడ్ తినడంతో ఆరోగ్య సమస్యలు వచ్చాయని వైద్యులు నిర్ధారించారు. కల్తీ నూనె, మసాలాలు, బేకరీ పదార్థాలు తీసుకోవడం తగ్గించాలని వైద్యులు సూచించారు.
- పెళ్లి రోజు అని.. ఓ ఉద్యోగి సహచరులతో కలిసి నగరంలో ఓ హోటల్‌కు వెళ్లారు. పలు రకాల ఆహార పదార్థాలు తిన్నారు. రెండవ రోజు వారు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి వెళ్లగా ఫుడ్ పాయిజన్ అయ్యిందని చెప్పారు.

నూనెలు సలసల ఆరోగ్యం విలవిల

- పదే పదే కాగుతున్న నూనెతో ఆరోగ్యానికి చేటు
- నిబంధనలు పట్టించుకోని హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు
- తనిఖీలు చేయని ఆహార నియంత్రణ అధికారులు



గుంటూరు(తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): రోజురోజుకి వంట నూనెల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ధరలతో హోటల్స్ నడపడం కష్టతరంగా మారుతోంది. దీంతో వ్యాపారులు లూజు, కల్తీ నూనెలను వాడటం మొదలు పెట్టారు. పైగా పదే పదే నూనెను వినియోగిస్తున్నారు. ఒక వైపు కల్తీ, మరో వైపు పదే పదే మరిగించడంతో ఆ నూనె విషపూరితంగా మారుతోంది. వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలు తిని ప్రజలు.. రోగాల బారిన పడుతున్నారు.

> పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో గతంలో ఆయిల్ మిల్లులపై అధికారులు దాడులు చేశారు. వంట నూనెల్లో 50 శాతానికి పైగా పత్తి నూనె కలుపుతున్నారనే విషయాన్ని గుర్తించారు. అధికారులు శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షలకు పంపారు.

● అన్ని సమయాల్లో....అదే నూనె

స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు ఆహార పదార్థాలను అన్ని వేళల్లో అందుబాటుల్లో ఉంచుతున్నారు. ఒక సారి పొయ్యిపై పాత్రలో పెట్టిన నూనె సాయంత్రం వరకు కాగుతూనే ఉం టోంది. ముఖ్యంగా మందు బాబులు అధికంగా మంసాహా రాన్ని తీసుకుంటారు. దీంతో మద్యం కంటే కల్తీ నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు వారి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయనే విషయాన్ని మత్తులో గమనించలేకపోతున్నారు.

రోగాలు ఇలా వస్తాయి

ఒకసారి ఉపయోగించిన వంట నూనెను.. మళ్లీ వినియోగించడం ఆరోగ్యానికి చేటు కలిగిస్తుంది. మోతాదుకు మించి మరిగిన నూనెలో టీపీసీ(టోటల్ పోలార్ కౌంట్) 25 శాతానికి మించి ఉంటే శరీరానికి హానికరంగా మారుతుంది. అలాంటి నూనెతో ఆహార పదార్థాలు వండితే శరీరంలో అధికంగా ఫ్రీ రాడికల్స్ పెరిగిపోతాయి. నూనె రంగు, రుచి మారిపోతుంది. అడుగున నల్లటి పదార్థం తయారై ఆమ్లం ఆధికమవుతుంది. కొన్ని నూనెల నిల్వ ద్వారా విష పదార్థాలు ఏర్పడుతాయి. ఊబకాయం, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, రక్త హీనత, బాలికల్లో సరైన సమయంలో పీరియడ్స్ రాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

తనిఖీలు ఎక్కడ?

ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్స్, స్ట్రీట్ ఫుడ్ దుకాణాల్లో ఆహార నాణ్యతపై తనీఖీలు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్నెల్లకు ఒకసారి కూడా తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవని రికార్డులు చెబుతున్నాయి. పండుగ, మీడియాలో కథనాలు వచ్చినప్పుడు.. తూతు మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో తనిఖీలు, అటుపై జేసీ ఆధ్వర్యంలో కేసులు విచారించి.. జరిమానాలు విధించేవారు. అవి ప్రస్తుతం కానరాకపోవడంతో.. కల్తీ యథేచ్ఛగా జరిగిపోతోంది. కబేళాలకు తరలించే పశువుల ఎముకల పిండిని కూడా నూనెలో కలుపేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



కల్తీ నూనె, ఇతర ఆహార పదార్థాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించి కల్తీపై సమాచారం ఇవ్వాలి. కల్తీ అని రుజువైతే జరిమానా, జైలుశిక్ష, ప్రవర్తన మార్చుకోకపోతే నగర బహిష్కరణ చేస్తాం.

-ఎన్.పూర్ణచంద్రరావు, జిల్లా జాయింట్ ఫుడ్ కంట్రోలర్, గుంటూరు

ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్

- విద్యా సంస్థల పరిసర దుకాణాల్లో విస్తృత తనిఖీలు


విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల పరిసరాల్లో గంజాయి కట్టడికి ఈగల్ విభాగం నడుం బిగించింది. 'ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్' నినాదంతో విద్యా సంస్థల పరిసరాలను డ్రగ్స్ రహితంగా చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో.. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మార్గ నిర్దేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో మంగళవారం నుంచి ఈ నెల 12 వరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు ప్రారంభించారు. మొ దటి రోజు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు స్కూల్స్, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలు, బడ్డీ కొట్లు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పొగాకు ఉత్పత్తులు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. పాఠశాలలు, కాలేజీల సమీపంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం ప్రత్యేక దాడులు కొనసాగుతాయని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు నిల్వ చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యా సంస్థల పరిసర షాపుల యజమానులు తమ సామాజిక బాధ్యతను గుర్తించి.. "ఈ షాపులో సిగరెట్లు, మత్తు పదార్థాలు అమ్మబడవు" అనే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కాలేజీల యాజమాన్యం విద్యార్థుల నడవడికపై పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారినట్లు తెలిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి అవసరమైన మార్గదర్శనం అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ లక్ష్య సాధనలో పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 9 జూలై 2025

ఫ్యాషన్





ఎఫ్1 సినిమాలో హాలీవుడ్ కథానాయకుడు బ్రాడ్ పిట్ వేసుకున్న నీలం రంగు చొక్కా భారతీయ సంప్రదాయ తంగలియా చేనేత పనితనమే! పిట్ పోషించిన సానీ హేయ్స్ పాత్రకు ప్రామాణికతను తెచ్చిపెట్టడం కోసం, ప్రఖ్యాత కాస్ట్యూమ్స్ డిజైనర్, జులియన్ డే తంగలియా వస్త్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఈ వస్త్రంతో రూపొందే మరికొన్ని దుస్తుల గురించి తెలుసుకుందాం!



తంగలియా తమాషా

అన్ని వస్త్రాలూ అన్ని వాతావరణలకూ అనువుగా ఉండవు. కానీ సహజసిద్ధ రంగులతో, పోగులతో రూపొందే చేనేత వస్త్రాలు ఇందుకు మినహాయింపు. అలాంటి వాటిలో చెప్పుకోదగినది తంగలియా చేనేత. ఇది గుజరాత్, సురేంద్రనగర్, కచ్ జిల్లాలకు చెందిన పూర్వీకుల చేతి వృత్తి. పూసలు లేదా దానాలను పోలిన ఆకృతితో వస్త్రానికి రెండు వైపులా కనిపించే మోటిఫ్‌లను సృష్టించడం ఈ నేత ప్రత్యేకత. బ్రాడ్ పిట్ ధరించిన చొక్కా పర్యావరణానుకూల ఫ్యాషన్‌ను ప్రతిబింబించేలా 100% ఫ్రక్టోజ్‌లో పులియబెట్టి, సహజసిద్ధ ఇండిగో రంగును అద్దడం జరిగింది. ఈ చొక్కా తయారీ కోసం 8 మంది నిపుణులతో కూడిన చేనేత కళాకారుల బృందం, ఏకంగా తొమ్మిదిన్నర గంటల పాటు కష్టపడడం కూడా చెప్పుకోదగిన విశేషమే!

- **దానా:** దానేదార్ అంటే, గింజల్లా ఉబ్బెత్తుగా కనిపించేవి అని అర్థం. ఈ ఆకృతిని పోలిన సూక్ష్మమైన, పూసలను పోలిన తంగలియా పనితనమే 'దానా'! ఈ నేత ప్రక్రియ తంగలియా వస్త్రాల్లో మనకు కనిపిస్తూ ఉంటుంది.
- **జామెట్రీ మోటిఫ్స్:** తంగలియా వస్త్రాల్లో వలయాలు, నిలువు గీతలు, ఇతరత్రా జామెట్రీ ఆకారాలు కూడా కనిపిస్తూ ఉంటాయి.
- **సంప్రదాయ ముద్ర:** ఒకానొకప్పుడు భార్వాడ్ గొర్రెల కాపరుల సమాజం, తంగలియా చేనేతతో శాలువాలు, స్కార్ఫ్‌లను తయారుచేసుకుంటూ ఉండేది. కానీ నేడు ఈ చేనేత వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందీ, ప్రపంచవ్యాప్త డిజైనర్ల మనసులను దోచుకుంటున్నాయి.



- సంప్రదాయ వస్త్రధారణను ఇష్టపడేవారు, సౌకర్యానికి పెద్ద పీట వేసేవారు తంగలియా వస్త్రాలను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.
- తేలిక రంగుల్లో తయారయ్యే ఈ వస్త్రాలను తేలికపాటి ఆభరణాలతో జత చేయడమే ఉత్తమం. హుందాగా కనిపించాలనుకునే మహిళలు తంగలియా చీరలు, శాలువాలు, లెహంగాలను ఎంచుకోవచ్చు.



న్యూస్‌మేకర్

ఇటీవల ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన యుద్ధం సందర్భంగా ఇరాన్‌లోని రెండు అణు స్థావరాలపై అమెరికా కురిపించిన 'బంకర్ బస్టర్' బాంబులు గొప్ప కచ్చితత్వంతో లక్ష్యాల్ని దెబ్బతీశాయి. ఈ బాంబుల రూపకల్పనలో కీలకపాత్ర వహించిన అన్ డుయోంగ్... కాందిశీకురాలిగా అమెరికాలో అడుగుపెట్టారు. తనకు ఆశ్రయం ఇచ్చిన దేశ సైనికుల కోసం ఏదైనా చేస్తానని సంకల్పం తీసుకున్న ఆమె కృషి... అగ్రరాజ్య యుద్ధ వ్యూహాలకు గట్టి దన్నుగా నిలుస్తోంది.

బంకర్ బాంబ్ లేడీ

అది 2013. యుఎస్‌లోని అరిజోనా రాష్ట్రంలో ఉన్న ఒక పట్టణంలో జరిగిన హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సదస్సుకు ప్రధాన వక్తగా హాజరయ్యారు అన్ డుయోంగ్. సదస్సు ముగిసిన తరువాత ఒక వ్యక్తి ఆమె దగ్గరకు వచ్చాడు. తను అఫ్ఘానిస్థాన్‌లో పని చేసిన సైనికుడినని చెబుతూ "మీరు నా ప్రాణాలను, నా తోటి సైనికుల ప్రాణాలను కాపాడారు. ధన్యవాదాలు" అని అన్నాడు. దీనికి ఆమె బదులిస్తూ "నేనే మీకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. మా కోసం మీ ప్రాణాలను పణంగా పెడుతున్నారు" అని చెప్పారామె. "అతని మాటలు నాకు ఎంతో ఉత్తేజం కలిగించాయి. పదోన్నతులు, పురస్కారాలకన్నా అవి గొప్పవి. ఎందుకంటే... అవి యుద్ధంలో పాల్గొన్న ఒక సైనికుడి నోటి నుంచి వచ్చాయి. అంతకన్నా ఇంకేం కావాలి? నా లక్ష్యం నెరవేరిందనిపించింది" అని అని చెప్పారు అన్. ఆమె లక్ష్యం వెనుక పెద్ద కథే ఉంది.



సర్వం కోల్పోయి...

అన్... వియత్నాంలోని సైగాన్‌లో పుట్టారు. ఆమె తండ్రి దక్షిణ వియత్నాం ప్రభుత్వంలో వ్యవసాయాధికారి. అన్న హెలికాప్టర్ పైలెట్. 1970ల్లో... ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం మధ్య జరిగిన యుద్ధ వాతావరణంలోనే ఆమె బాల్యమంతా సాగింది. అన్న తరచూ యుద్ధంలో పాల్గొనడానికి వెళ్ళేవారు. 'అతను సజీవంగా వస్తారా?' అనే భయంతో ఆ కుటుంబం బిక్కుబిక్కుమంటూ ఉండేది. "నా దగ్గర మంత్రదండం ఉంటే... దాంతో మరింత అధునాతనమైన ఆయుధం తయారు చేసి మా అన్నయ్యకి ఇస్తాను. అప్పుడు అతను యుద్ధంలో గెలిచి, చెక్కుచెదరకుండా ఇంటికి వస్తాడనే ధీమా మాకు ఉంటుంది... అని ఎప్పుడూ అనుకొనేదాన్ని" అని చెబుతారు అన్. తమ ప్రాంతం ఏ క్షణానైనా ఉత్తర వియత్నాం దళాల ఆధీనంలోకి వచ్చే పరిస్థితి ఉండడంతో... ఆమె సోదరుడు తమ కుటుంబాన్ని, దగ్గర బంధువులను... దక్షిణ వియత్నాం తరఫున పోరాడుతున్న అమెరికన్ సైనికుల సాయంతో హెలికాప్టర్‌లో తరలించారు. ఫిలిప్పీన్స్‌కు వెళ్ళే నేవీ నౌకలోకి చేర్చారు. అక్కడి నుంచి వారు యుఎస్ రాజధాని వాషింగ్టన్‌కు రాజకీయ శరణార్థులుగా చేరుకున్నారు. "అమెరికాలో అడుగుపెట్టే సరికి మేము సర్వం కోల్పోయి కట్టుబట్టలతో ఉన్నాం. గొప్పగా బతికిన మా కుటుంబ పరిస్థితిని తలుచుకుంటే ఎంతో బాధ కలిగింది. కానీ వియత్నాం నుంచి పడవల్లో పారిపోవాలని ప్రయత్నించిన వాళ్ళు కొన్ని లక్షల మంది ఉన్నారు. వారిలో సుమారు రెండున్నర లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఆ విధంగా మేము ఎంతో అదృష్టవంతులం. అందుకే... 'నన్ను, నా కుటుంబాన్నీ కాపాడిన అమెరికన్ సైనికుల కోసం... వాళ్ళు వారి తల్లితండ్రుల దగ్గరకు, అక్కాచెల్లెళ్ళ దగ్గరకు క్షేమంగా చేరుకోవడం కోసం నేను చేయగలిగినది ఏదైనా చేస్తాను' అని సైగాన్‌లో మా ఇంటి గేటు దాటుతున్నప్పుడు నాకు నేనే ప్రమాణం చేసుకున్నాను" అంటారు అన్.

67 రోజుల్లోనే...

ఒక చర్చి అండదండలతో ఆమె కుటుంబం కొత్త జీవితాన్ని ప్రారంభించింది. అమెరికా చేరుకున్నాక అన్ ఎదుర్కొన్న మొదటి సమస్య... భాష. కానీ తన ప్రతిభతో, పట్టుదలతో ఆమె ఆ సమస్యను అధిగమించారు. చదువుల్లో కూడా ఎంతో చురుగ్గా ఉండేవారు. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఆనర్స్ డిగ్రీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాక... మేరీల్యాండ్ రాష్ట్రంలోని ఇండియన్ హెడ్ పట్టణం కేంద్రంగా పని చేస్తున్న 'నేవల్ సర్ఫేస్ వార్‌ఫేర్ సెంటర్' (ఎన్ఎస్‌డబ్ల్యూసి) ఉద్యోగిగా చేరారు. శక్తిమంతమైన పేలుడు పదార్థాల సమర్థవంతమైన వినియోగంపై పలు ప్రయోగాలు చేశారు. క్రమంగా పేలుడు పదార్థాలు, జలగర్భ ఆయుధాలకు సంబంధించి ఆ కేంద్రం చేపట్టే సాంకేతిక కార్యక్రమాలకు అధిపతి అయ్యారు. అన్, ఆమె బృందం అభివృద్ధి చేసిన పేలుడు పదార్థాలు, 'థర్మోబారిక్' లాంటి బాంబులు వివిధ యుద్ధాల్లో, దాడుల్లో అమెరికా పైచెయ్యి సాధించడానికి దోహదం చేశాయి. 9-11 సంఘటన తరువాత... అల్‌ఖైదా ఉగ్రవాదులు దాక్కొన్న భూగర్భ సొరంగాల్లాంటి లోతైన ప్రదేశాల్లోకి ప్రయాణించగలిగే లేజర్-గైడెడ్ బాంబు 'బిఎల్‌యు 118/బి'ని కేవలం 67 రోజుల్లో అన్ బృందం తయారు చేసింది. ఇరుకైన ప్రదేశాల్లోకి, గుహల్లోకి సైనికులు కాలినడకన వెళ్ళే అవసరం లేకుండా... కచ్చితమైన ఫలితాలను అందించగలిగే ఈ బాంబుల వల్ల అమెరికాకు ప్రాణనష్టం తగ్గింది. అమెరికన్ మీడియా ఆమెను 'బాంబ్ లేడీ' అంటూ ప్రశంసించింది. ఆ తరువాత కొత్తతరం బాంబులు ఎన్నిటినో ఆ బృందం అభివృద్ధి చేసింది. వాటిలో ఒకటైన 'బంకర్ బస్టర్' బాంబులను ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఇటీవలి యుద్ధం సందర్భంగా... ఇరాన్‌లోని రెండు అణు స్థావరాలపై అమెరికా విజయవంతంగా ప్రయోగించింది. దీంతో అన్ పేరు మరోసారి మారుమోగుతోంది.

> **"నా దగ్గర మంత్రదండం ఉంటే... దాంతో మరింత అధునాతనమైన ఆయుధం తయారు చేసి మా అన్నయ్యకి ఇస్తాను. అప్పుడు అతను యుద్ధంలో గెలిచి, చెక్కుచెదరకుండా ఇంటికి వస్తాడనే ధీమా మాకు ఉంటుంది'... అని ఎప్పుడూ అనుకొనేదాన్ని."**



యుద్ధాలంటే ద్వేషం

"నాకు యుద్ధాలంటే ద్వేషం. వాటిని నిరోధించడానికే నేను ఆయుధాలు తయారు చేశాను. అయితే వాటిని ఎలా ఉపయోగిస్తారనేది నా చేతుల్లో ఉండదు. ఆ విషయంలో మా నాయకులమీద నాకు విశ్వాసం ఉంది" అంటారు 65 ఏళ్ళ అన్. వ్యక్తిగత విషయాలకు వస్తే... అధికారిక విధుల నుంచి 2020లో పదవీవిరమణ చేసినా... బాంబుల తయారీకి తన సలహాలను, మార్గదర్శకత్వాన్ని అందిస్తూనే ఉన్నారు. "నా భర్త కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కూడా వియత్నాం కాందిశీకుడే. మాకు నలుగురు పిల్లలు. మేము ఏదైనా సాధించామంటే కారణం మాకు అమెరికాలో లభించిన అవకాశాలే. మా జీవితాలను బలంగా నిర్మించుకోవడానికి అవే దోహదం చేశాయి" అంటారు అన్. ఆమెకు లభించిన అవకాశాలు తన ఎదుగుదలకే కాకుండా... అమెరికా ఆయుధ శక్తిని బలోపేతం చేయడానికి సైతం ఎంతో దోహదం చేశాయనడంలో సందేహం లేదు.

పేరెంటింగ్

ఒత్తిడికి లోనవుతున్నారా?

ప్రస్తుత పరిస్థితుల్లో పెద్దలే కాదు పిల్లలు కూడా ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- బడికి వెళ్లే పిల్లలు రోజూ.... హోంవర్క్, పరీక్షలు, ట్యూషన్లు అంటూ చదువులోనే పూర్తిగా నిమగ్నమై ఉంటున్నారు. సెలవు రోజుల్లో కూడా స్మార్ట్ ఫోన్ చూస్తూ అందులోనే ఆటలు ఆడుతూ సమయం గడిపేస్తూ ఉంటారు. దీనివల్ల తెలియకుండానే పిల్లల్లో ఒత్తిడి ప్రారంభమవుతుంది. అలా కాకుండా రోజూ సాయంత్రం పిల్లల చేత ఆటలు ఆడించాలి. ఆటల్లో భాగంగా పరుగెత్తడం, నవ్వడం, అరవడం వల్ల పిల్లల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి ఒత్తిడిని దూరంచేసి సంతోషాన్ని కలిగిస్తాయి. సైకిల్ తొక్కడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం లాంటి వాటిని పిల్లలకు అలవాటు చేయాలి.
- సొంత పనుల్లో మునిగిపోయి పట్టించుకోకపోతే పిల్లల్లో ఒంటరితనం అనే భావన మొదలవుతుంది. ఇది క్రమంగా ఒత్తిడికి దారితీస్తుంది. కాబట్టి పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వాళ్లతో స్నేహపూర్వకంగా మెలగాలి. బడి సంగతుల గురించి అడిగి తెలుసుకోవాలి. వీలైనంత ఎక్కువ సమయాన్ని పిల్లలతో గడపాలి.
- పిల్లలకు రోజూ పోషకాహారం పెట్టాలి. అందులో పాలు, నెయ్యి, తాజా పండ్లు, గింజలు, ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూడాలి. వీటివల్ల శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి ఒత్తిడి దరిచేరదు. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తెచ్చి ఇస్తుంటే పిల్లల సంతోషానికి అవధులు ఉండవు.
- పిల్లలపై కోపాన్ని ప్రదర్శించకూడదు. అలాగని అతిగా గారాబం చేయకూడదు. ప్రతి విషయాన్ని వాళ్లకు అర్థమయ్యే రీతిలో ఓపికగా వివరించి చెప్పాలి. సందర్భానుసారం చక్కగా ప్రవర్తించినప్పుడు పిల్లలను మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. దీనివల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్నపాటి పొగడ్తల వల్ల మెదడులో డోపమైన్ స్థాయి పెరుగుతుంది. దీంతో పిల్లల మనసు ప్రశాంతంగా మారుతుంది.
- ఆటలు, సంగీతం, పాటలు పాడడం, నృత్యం చేయడం, చిన్న కథలు రాయడం లేదా చెప్పడం, బొమ్మలు వేయడం ఇలా ఆసక్తి ఉన్న అంశాన్ని నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లలకు మానసిక ఆనందం కలుగుతుంది. ఒత్తిడీ దరిచేరదు.



ఇలా శుభ్రం చేయాలి..!

మనం రోజూ ఉపయోగించే తువాళ్లు, దిండు గలీబులు, దుప్పట్ల మీద మురికితోపాటు హానికారక బ్యాక్టీరియాలు చేరుతూ ఉంటాయి. వాషింగ్ మిషన్‌లో వేసి ఉతికినప్పటికీ ఒక్కోసారి సరైన ఫలితం కనిపించదు. వీటిని సులువుగా శుభ్రం చేసే చిట్కాల గురించి తెలుసుకుందాం...

- కొంతమంది స్నానం చేసిన తరవాత తువాలును ఇతరత్రా కూడా వాడుతూ ఉంటారు. మధ్యలో ముఖం కడక్కున్నా చేతులు కడిగినా దానికే తుడిచేస్తుంటారు. రోజుల తరబడి ఇలా చేయడం వల్ల తువాలు పసుపు రంగులోకి మారి వాసన పడుతుంది. దీన్ని అలాగే వాడితే అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒక టబ్‌లో ఒక చెంచా ఉప్పు, ఒక చెంచా లిక్విడ్ డిటర్జెంట్ వేసి రెండు మగ్గుల వేడి నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ నీళ్లలో రోజూ వాడే తువాలును అరగంట సేపు నానబెట్టాలి. తరవాత బ్రష్‌తో రుద్ది మంచినీళ్లతో ఉతికి ఎండలో ఆరేయాలి. పది రోజులకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే తువాలు శుభ్రంగా ఉంటుంది.



- దిండు గలీబులు కూడా క్రమంగా జిడ్డు పట్టి నల్లగా మారుతుంటాయి. వీటివల్ల శిరోజాల సమస్యలు, ముఖం మీద మొటిమలు వస్తాయి. అలాకాకుండా వెడల్పాటి టబ్‌లో దిండు గలీబులను పరచి వాటిపై ఉప్పు చల్లాలి. తరవాత రెండు చెంచాల వెనిగర్‌ను, రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్‌ను చుక్కలు చుక్కలుగా వేసి రెండు మగ్గుల వేడి నీళ్లు పోయాలి. అరగంట సేపు అలాగే ఉంచాలి. తరవాత చేతులతో బాగా నలుపుతూ ఉతకాలి. చివరగా మంచినీళ్లలో ముంచి ఆరేయాలి. నెలకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే దిండు గలీబుల మీద మురికి, జిడ్డు పూర్తిగా వదిలిపోతాయి.

సంకల్పం

సంస్కృతి పరిరక్షణ కోసం..

సొంతవాళ్లే 'చదువు అవసరమా' అన్నారు. అయినా సరే చదువుకుని అధ్యాపకురాలిగా మారారు జార్ఖండ్‌కు చెందిన పార్వతీ తిర్కీ. అంతేకాకుండా కవితలతో ఆదివాసీ సంస్కృతిని కాపాడాలని కృషి చేస్తున్నారు. ఆదివాసీల జీవిత నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూ రాసిన 'ఫిర్ ఉగ్నా' అనే కవితా సంకలనానికి గాను ప్రతిష్ఠాత్మక సాహిత్య అకాడమీ యువ పురస్కారం- 2025కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్వగతమిది...



"మాది జార్ఖండ్ గుమ్లా జిల్లాలో ఓ మారుమూల ప్రాంతం. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీవిరమణ పొందారు. అమ్మ గృహిణి. నాకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ఓ సోదరుడు ఉన్నారు. పాఠశాల విద్య మా ప్రాంతంలో పూర్తి చేశాను. ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో హిందీలో గ్రాడ్యుయేషన్, పీజీ , పీహెచ్‌డీ పూర్తి చేశా. మాది ఆదివాసీ కుటుంబం. జాతరకు తప్పనిసరిగా హాజరు కావాలి. కాబట్టి చిన్నప్పుడు బడికి వెళ్తా అన్న ప్రతిసారీ, 'నువ్వు బడికి వెళ్తే, జాతరుకు ఎవరెళ్తారు?' అని అమ్మమ్మ అంటుండేది. అయినా వీలున్న ప్రతిసారీ జాతరకు హాజరవుతూ, అమ్మమ్మను నొప్పించకుండా చదువును కొనసాగించా! ప్రస్తుతం రాంచీలోని రామ్ లఖన్ కళాశాలలో హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. వర్సిటీలో చదువుకునేటప్పుడే ఆదివాసీ సంస్కృతిని అందరికీ తెలిసేలా చేయాలని నిర్ణయించుకున్నా. చిన్నప్పుడు ప్రతి ఏడాది సర్కుల్ అనే ఆదివాసీ పండుగ సమయంలో మా తాతతో కలిసి పాటలు పాడేదాన్ని. ఆ పాటల ద్వారానే నాకు మా కురుఖ్ సంస్కృతి గురించి తెలిసింది. మా పెద్దల మాటలు, పాటల ద్వారా నేర్చుకున్న ఆదివాసీ సంస్కృతిని అందరికీ తెలిసేలా చేయాలని చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా. అందులో భాగంగానే కవితా సంకలనం 'ఫిర్ ఉగ్నా' రాశా. ఇందులో కురుఖ్ తెగ జీవన శైలి, వారి సంస్కృతి, సంప్రదాయలను తెలియజేసే ప్రయత్నం చేశా. ఇటీవల 'ఫిర్ ఉగ్నా'కుగాను సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికయ్యాను. అకాడమీ నుంచి ఫోన్ వచ్చినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. అసలు ఇలాంటి ఒక పురస్కారం వస్తుందని నేను ఊహించలేదు. రావాలని ఆశించనూ లేదు. కానీ ఈ గుర్తింపు వలన ఆదివాసీ సంస్కృతి గురించి మరింత మందికి తెలుస్తుందని అనుకుంటున్నా.

సాహిత్యం మీద మక్కువ

నాకు చిన్నప్పటి నుంచి కూడా సాహిత్యం అంటే చాలా ఇష్టం. అందుకే కవితలు రాస్తుంటా. మా తెగల్లో మేమే పాటలు కంపోజ్ చేసి పాడుతుంటాం. అలానే 'ఫిర్ ఉగ్నా' రాశా. ఇందులోని కవితల్లో ఆదివాసీ తెగలకు నీరు, అడవి, అందులోని జంతువులతో ఉన్న అనుబంధాన్ని వివరించా. అడవులు నీటిని పరిరక్షించాల్సిన అవసరాన్ని కూడా తెలియజేశా. అడవి అనేది ఆదివాసీలకు ఓ వనరు మాత్రమే కాదనీ, వారికి దానితో విడదీయలేని అనుబంధం ఉంటుందని అందులో వివరించే ప్రయత్నం చేశా. మా ఆదివాసీ ప్రాంతంలోనే కాదు.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ నివసించాను. అలా ఇప్పటి వరకు 40-50 గ్రామాలు తిరిగాను. ఆ క్రమంలో ఎంతో మందిని కలిశాను. వారి మాటలు, అక్కడి వాతావరణం మొదలైనవన్నీ ఈ కవితలు రాయడానికి నాకొక ప్రేరణగా మారాయి. వారిని కలవకపోతే నేనీ కవితలు రాయలేకపోయేదాన్నేమో అనిపిస్తోంది.



భాషలు అంతరించకూడదు..

అనేక ఆదివాసీ భాషలు, సంస్కృతులు అంతరించిపోతున్నాయి. 'ధూంకుడియా' అనేది మా సంప్రదాయ అభ్యాస వ్యవస్థ. ఇది ప్రస్తుతం అంతరించిపోయింది. దాంతో ఆ శైలిలో మేం సాహిత్యాన్ని సృష్టించలేకపోతున్నాం. ఇలాగే ఇంకా కొన్ని తెగలకు ఇలాంటి అభ్యాస విధానాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆదివాసీలు వారి జ్ఞానాన్ని, జీవన విధానాలను తెలుసుకుంటారు. ఈ ఆదివాసీ భాషలు, సంస్కృతుల గురించి విద్యాసంస్థల్లో నేర్పరు. కాబట్టి వాటిని కాపాడాలి. అందుకోసమే నేను కృషి చేస్తున్నా. ప్రస్తుతం మన చుట్టూ సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా జరుగుతున్న మార్పుల గురించి కూడా కవితలు రాస్తున్నాను."

పడుకునే ముందు ఇవి తింటే..

మంచి నిద్ర కావాలని అందరూ కోరుకుంటారు. కొన్ని ఆహార పదార్థాలను నిద్రపోయే ముందు తీసుకుంటే కంటి నిండా నిద్ర పోవచ్చు. ఆ ఆహార పదార్థాలేంటో తెలుసుకుందాం...


అరటి పండు: ఇందులో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అవి నిద్రను ప్రోత్సహిస్తాయి.

చెర్రీ: చెర్రీల్లో మెలటోనిన్ ఉంటుంది. ఇది నిద్రను ప్రోత్సహిస్తుంది.

వాల్‌నట్స్: బాదం, వాల్‌నట్స్ నిద్రకు బాగా ఉపయోగపడాతాయి. వీటిలోని మెగ్నీషియం కండరాలను సడలింపుకు ఉపయోగపడుతుంది. దాంతో నాణ్యమైన నిద్ర సొంతమవుతుంది.

పాలు: పాలు ఆరోగ్యాన్ని పెంచడమే కాదు నిద్రకు ఉపకరిస్తాయి. పాలల్లో మెలటోనిన్ ఉత్పత్తికి ఉపయోగపడే ట్రిప్టోఫాన్ ఉటుంది. కాబట్టి పడుకునే ముందు గ్లాసు గోరువెచ్చని పాలు తాగితే వెంటనే నిద్ర పడుతుంది.

కివీ: ఇది నిద్రను పోత్రహించే మెదడులోని సెరటోనిన్ అనే రసాయన ఉత్పత్తిని పెంచుతుఉంది. కాబట్టి పడుకునే ముందు కివీ పండ్లు తింటే మంచి నిద్ర పడుతుంది.



చమోమిలే టీ: నిద్రలేమికి కారణమయ్యే మెదడులోని గ్రాహకాలను అడ్డుకునే ఆపిజెనిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఈ టీలో ఉంటుంది. అందుకే ఈ టీ తాగితే నాణ్యమైన నిద్ర సొంతమవుతుంది.

దీప్తి @ 2

మహిళల టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిండియా స్పిన్నర్ దీప్తి శర్మ టీ20ల్లో నెంబర్‌వన్ బౌలర్‌గా నిలిచేందుకు అడుగుదూరంలో నిలిచింది. తాజా ర్యాంకింగ్స్ బౌలర్ల విభాగంలో దీప్తి ఓ స్థానం మెరుగై రెండో ర్యాంక్‌కు చేరుకుంది. పాక్ బౌలర్ సాదియా ఇక్బాల్ టాప్‌లో ఉంది. సాదియా (746)కు దీప్తి (738)కి మధ్య 8 రేటింగ్ పాయింట్లే దూరం. రేణుకా సింగ్ 6వ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. బ్యాటర్లలో స్మృతి మంధాన 3వ ర్యాంక్‌లో ఉండగా, జెమీమా రెం డుస్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచింది.

భారత్ X ఇంగ్లండ్
మహిళల నాలుగో టీ20 నేడు
రాత్రి 11 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

సెమీస్‌కు సబలెంక

అల్కారజ్, ఫ్రిట్జ్, అమందా కూడా..



లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ అర్యానా సబలంక వరుసగా మూడోసారి సెమీఫైనల్లో ప్రవేశించింది. మంగళవారం హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో సబలెంక (బెలారస్) 4-6, 6-2, 6-4తో అన్‌సీడెడ్ లౌరా సీగెముండ్ (జర్మనీ)పై గెలిచింది. 2021, 2023 టోర్నీల్లోనూ సబలెంక సెమీస్‌కు చేరగా.. 2022, 2024ల్లో పాల్గొనలేదు. 8వ సీడ్ స్వియాటెక్ (పోలెండ్) 6-4, 6-1తో టౌసన్ (డెన్మార్క్)పై, ఏడో సీడ్ ఆండ్రీవా 6-2, 6-3తో నవారో (యూఎస్‌ఏ)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

అల్కారజ్ అలవోకగా..: పురుషుల డిఫెండింగ్ చాంపియన్, రెండోసీడ్ అల్కారజ్ అలవోకగా సెమీస్‌లో అడుగుపెట్టాడు. క్వార్టర్స్‌లో అల్కారజ్ (స్పెయిన్) 6-2, 6-3, 6-3తో నోరి (బ్రిటన్)ని వరుససెట్లలో చిత్తు చేశాడు. ఐదోసీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-3, 6-4, 1-6, 7-6తో ఖచనోవ్ (రష్యా)ను ఓడించి కెరీర్‌లో తొలిసారి ఇక్కడ సెమీస్ చేరాడు. అంతకుముందు వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్ (ఇటలీ) వాకోవర్ కారణంగా క్వార్టర్స్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో 19వ సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 7-5, 2-2తో స్పష్టమైన ఆధిక్యంలో దూసుకుపోతున్న వేళ.. అతను హఠాత్తుగా ఛాతీ కండరాల నొప్పితో తప్పుకొన్నాడు. షెల్టన్ (యూఎస్‌ఏ) 3-6, 6-1, 7-6, 7-5తో సొనెగో (ఇటలీ)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు.



వింబుల్డన్‌లో 'విరుష్క'

విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మ జోడీ సెంటర్ కోర్టులో జొకోవిచ్-డి మినార్ మధ్య మ్యాచ్‌ను రాయల్ బాక్స్‌లో కూర్చుని తిలకించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'క్రికెట్‌లోకన్నా వింబుల్డన్‌లోనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. వరల్డ్‌కప్‌లో భారత్-పాక్ మ్యాచ్ తరహా టెన్షన్ ఇక్కడ ప్రతీ మ్యాచ్‌లోనూ కనిపిస్తుంటుంది' అని విరాట్ అన్నాడు.

నెట్స్‌లో బుమ్రా జోరుగా..!

లార్డ్స్ టెస్ట్ కోసం టీమిండియా ప్రాక్టీస్



లండన్: సిరీస్ సమం చేసిన జోష్‌లో ఉన్న భారత్.. గురువారం నుంచి లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్ కోసం సిద్ధమవుతోంది. పని భారం కారణంగా గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకొన్న పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నెట్స్‌లో బుమ్రా తీవ్రంగా శ్రమించాడు. ఆ తర్వాత లెఫ్టామ్ స్పిన్నర్లు, త్రోడౌన్ స్పెషలిస్టులతో బ్యాటింగ్ కూడా ప్రాక్టీస్ చేశాడు. కెప్టెన్ గిల్, రాహుల్, జైస్వాల్, పంత్, ఆకాశ్‌దీప్, సిరాజ్ నెట్స్‌కు దూరంగా ఉన్నారు.

డోప్ పరీక్షలో విఫలం.. రెజ్లర్ రీతికపై సస్పెన్షన్



న్యూఢిల్లీ: గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్‌ఫైనల్ చేరిన భారత యువ మహిళా రెజ్లర్ రీతిక హుడా డోప్ పరీక్షలో విఫలమైంది. ఇక్కడి ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయ శిక్షణ శిబిరం సెలెక్షన్ ట్రయల్స్‌లో భాగంగా జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిర్వహించిన డోప్ పరీక్షలో రీతిక (76 కిలోలు) పాజిటివ్‌గా తేలింది. దీంతో రీతిక వెంటనే శిక్షణ శిబిరాన్ని వీడింది. తక్షణమే ఆమెపై సస్పెన్షన్ విధిస్తున్నట్టు నాడా ప్రకటించింది. ఈనెల 7 నుంచి సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని తెలిపింది. కాగా, రీతికపై ఏడాదిపాటు నిషేధం విధించే అవకాశముందని సమాచారం. రీతికతో పాటు మరో ఇద్దరు రెజ్లర్లు కూడా డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో వారు కూడా తాత్కాలిక సస్పెన్షన్‌కు గురైనట్టు తెలిసింది. దేశ టాప్ రెజ్లర్లలో ఒకరైన 22 ఏళ్ల రీతిక.. ఈ ఏడాది ఆరంభంలో ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం, మేలో జరిగిన ఉలాన్‌బాటర్ ర్యాంకింగ్ సిరీస్‌లో స్వర్ణం గెలిచింది.

విశాఖలో ఏపీఎల్ తుఫాన్



- వచ్చే నెల 8 నుంచి సాగరతీరంలో లీగ్
- ఈ నెల 14న క్రికెటర్ల వేలం
- నితీష్, రషీద్, హనుమ విహారి, భరత్ కోసం ఫ్రాంచైజీల పోటీ
- ఆక్షన్‌లో మొత్తం 519 మంది ప్లేయర్లు

క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్ 4 వచ్చేస్తోంది. విశాఖపట్నం వేదికగా వచ్చే నెల 8వ తేదీ నుంచి ఐపీఎల్ తరహాలో అట్టహాసంగా ఏపీఎల్‌ను నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కసరత్తు చేస్తోంది. ఈసారి మ్యాచ్‌లన్నీ విశాఖలోనే నిర్వహించనున్నారు. ఈ సీజన్‌లో టైటిల్ కోసం ఏడు జట్లు తలపడుతున్నాయి. లీగ్‌లో ఆడేందుకు మొత్తం 519 మంది క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ 519 మందిని నాలుగు గ్రూపులుగా వర్గీకరించారు. ఐకానిక్ క్రికెటర్ల గ్రూపులో తొమ్మిది మంది స్టార్ క్రికెటర్లకు స్థానం కల్పించారు. వీరికి కనీస ధరగా రూ.10 లక్షలను నిర్ధారించారు. నితీష్ రెడ్డి, హనుమ విహారి, కేఎస్ భరత్, షేక్ రషీద్, సత్యనారాయణ రాజు, అవినాష్, రికీ భుయ్, అశ్విన్ హెబ్బర్, విజయ్‌కు ఐకానిక్ గ్రూపులో చోటు దక్కింది. మిగిలిన 510 మంది క్రికెటర్లలో ఏ-గ్రేడ్‌లో 20, బి-గ్రేడ్‌లో 112, సి-గ్రేడ్‌లో 378 మందిని కేటాయించారు. ఈనెల 14వ తేదీన విశాఖపట్నంలో వేలం జరగనుంది. ఒక్కో జట్టు క్రికెటర్ల కొనుగోలుకు గరిష్టంగా రూ.35 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. ప్రతీ జట్టు కనీసం 18, గరిష్టంగా 20 మందిని వేలంలో దక్కించుకోవచ్చు. కచ్చితంగా అన్ని జట్లలో ఇద్దరు అండర్-19 ప్లేయర్లు ఉండాలన్న నిబంధన విధించారు. ప్లేయర్ రిటెన్షన్ నిబంధన ప్రకారం ప్రతి జట్టు ఒక ప్లేయర్‌ను తమ దగ్గర అట్టి పెట్టుకోవచ్చు. వేలానికి రెండ్రోజుల ముందు వరకు ఫ్రాంచైజీలకు ఈ అవకాశం ఉంటుంది. ప్రధానంగా టీమిండియాతో పాటు ఐపీఎల్‌లో ఆడిన నితీష్ రెడ్డి, షేక్ రషీద్, హనుమ విహారి, కేఎస్ భరత్, రికీ భుయ్, అవినాష్, అశ్విన్ హెబ్బర్‌ను దక్కించుకునేందుకు ఫ్రాంచైజీల మధ్య పోటీ నెలకుంది. ఈసారి లీగ్‌లో మల్టీనేషనల్ కంపెనీలు ఫ్రాంచైజీలను సొంతం చేసుకోవడంతో క్రికెటర్ల వేలం ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి - హైదరాబాద్)

మహిళను మోసం చేసిన కేసులో.. క్రికెటర్ యశ్‌పై ఎఫ్‌ఐఆర్



ఘజియాబాద్ (యూపీ): లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బౌలర్ యశ్ దయాళ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. తనను పెళ్లి చేసుకొంటానని చెప్పి యశ్ మోసం చేశాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐదేళ్లుగా తనతో సంబంధం నడిపిన అతడు మానసికంగా, శారీరకంగా హింసించాడని తెలిపింది. పెళ్లి విషయమై నిలదీస్తే తనను వేధింపులకు గురిచేశాడని పేర్కొంది. యూపీ సీఎం గ్రీవెన్స్ పోర్టల్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేసిన పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మూడో వన్డేలో లంక గెలుపు

బంగ్లాపై 2-1తో సిరీస్ కైవసం

పల్లెకెలె: బంగ్లాదేశ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 2-1తో సొంతం చేసుకుంది. మంగళవారం జరిగిన ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో కుశాల్ మెండిస్ (124) శతక్కొట్టడంతో లంక 99 పరుగుల భారీ తేడాతో గెలిచింది. మొదట లంక 50 ఓవర్లలో 7 వికెట్లకు 285 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ సెంచరీకి తోడు కెప్టెన్ చరిత్ అసలంక (58) అర్ధ సెంచరీతో రాణించాడు. టస్కిన్ అహ్మద్, మెహ్దీ హసన్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో లంక సమష్టి బౌలింగ్ ధాటికి బంగ్లా 39.4 ఓవర్లలో 186 పరుగులకే కుప్పకూలింది. ఫెర్నాండో, చమీర చెరో 3, వెల్లలగె, హసరంగ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కుశాల్ మెండిస్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. తొలి వన్డేను లంక, రెండోది బంగ్లా గెలుపొందాయి.

అందుకే... హడావుడిగా ఆర్సీబీ విజయోత్సవాలు

పోలీసులు వారించినా వినని వైనం
సీఐడీ విచారణలో వెలుగులోకి..

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)జట్టు గెలిస్తే.. మరుసటి రోజే సంబరాలు జరపాలని, ఆ తర్వాత విరాట్ కోహ్లీ అందుబాటులో ఉండడని ఆర్సీబీ ముఖ్యులు ఒత్తిడి తెచ్చినట్టు సీఐడీ విచారణలో వెలుగులోకి వచ్చింది. బెంగళూరు జట్టు విజేతగా నిలిచిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ రాత్రి 12 గంటలకు ముగిసింది. మరుసటి రోజు మధ్యాహ్నామే విజయోత్సవాలు నిర్వహించే బాధ్యతను ఆర్సీబీ సీఈఓ రాజేశ్ మీనన్, సోషల్ మీడియా విభాగం ముఖ్యులు నిఖిల్ సొసలె తీసుకున్నారు. వేడుకల కోసం కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), చిన్నస్వామి స్టేడియం నిర్వాహకులపై ఒత్తిడి తీసుకొచ్చినట్టు సీఐడీ విచారణలో తేలింది. కోహ్లీ విదేశాలకు వెళ్తున్నాడని, అందుకే వెంటనే విజయోత్సవాలు జరపాలని ఒత్తిడి తెచ్చినట్టు సీఐడీ గుర్తించింది. వెంటనే విజయోత్సవాలంటే ఇబ్బంది కలుగుతుందని కేఎస్‌సీఏ, పోలీసులు అభ్యంతరం తెలిపారట. కానీ ఆర్సీబీకి, కోహ్లీకి అప్పుడిగా ముద్ర పడిన నిఖిల్ సొసలె ఒత్తిడి తేవడంతో వారు అంగీకరించారట. జూన్ 4న విజయోత్సవాల సమయంలో తొక్కిసలాట జరిగి 11 మంది అభిమానులు మృతి చెందిన విషయం విదితమే.

లిఫ్టర్ సాయిరాజ్‌కు కాంస్యం

అస్తానా (కజకిస్థాన్): ఆసియా జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్ సాయిరాజ్ పర్దేశి పతకంతో మెరిశాడు. 86 కిలోల విభాగంలో సాయిరాజ్ మూడోస్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు. ఈ ఏడాది ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో స్వర్ణం నెగ్గిన సాయిరాజ్.. విజేతగా నిలిచే క్రమంలో ఏకంగా మూడు యూత్ జాతీయ రికార్డులు నెలకొల్పిన సంగతి తెలిసిందే.

స్విస్ చెస్‌లో అర్జున్‌కు టాప్ సీడ్

న్యూఢిల్లీ: ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసికి టాప్ సీడింగ్ దక్కింది. ఉజ్బెకిస్థాన్‌లో సెప్టెంబరు 3 నుంచి 16 వరకు పోటీలు జరగనున్నాయి. వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు రెండో సీడ్, ప్రజ్ఞానందకు నాలుగో సీడ్ లభించింది. మహిళల విభాగంలో కోనేరు హంపి, డిఫెండింగ్ చాంప్ వైశాలి బరిలో నిలవనున్నారు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ విజయం

బులవాయో: జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి రోజు మంగళవారం రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 236 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఆ జట్టు టెస్టు చరిత్రలో మూడో అతిపెద్ద విజయమిది. ఓవర్‌నైట్ స్కోరు 51/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 220 పరుగులకు ఆలౌటైంది. వెల్చ్ (55), ఇర్విన్ (49) రాణించారు. బాష్‌కు 4, ముత్తుసామికి 3, యూసుఫ్‌కు 2వికెట్లు దక్కాయి. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 626/5 డిక్లేర్, జింబాబ్వే 170 పరుగులు చేశాయి.

బిజినెస్

జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు నా హయాంలోనే షురూ..



సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల ద్వారా భారత స్టాక్ మార్కెట్ నుంచి అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించిన అమెరికన్ హెడ్జ్ ఫండ్ కంపెనీ జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు తన హయాంలోనే మొదలైందని సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మంగళవారం అన్నారు. 2024 ఏప్రిల్ నుంచే జేన్ స్ట్రీట్ ట్రేడింగ్ విధానాలపై విచారణను ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే, జేన్ స్ట్రీట్ ఉదంతాన్ని నియంత్రణ వైఫల్యంగా చిత్రీకరించడం దురదృష్టకరమని ఆమె పేర్కొన్నారు. జేన్ స్ట్రీట్ మార్కెట్ సూచీలను కృత్రిమంగా ప్రభావితం చేసినట్లు గుర్తించడంతో పాటు అనైతిక ట్రేడింగ్ వ్యూహాలకు స్వస్తి పలకాలంటూ 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి మధ్య కాలంలో కంపెనీకి సర్క్యులర్లు, హెచ్చరికల జారీ సహా పలు చర్యలను సెబీ చేపట్టిందన్నారు. సెబీ సారథ్యం నుంచి బుచ్ ఈ మార్చిలో తప్పుకున్నారు. ఆమె స్థానాన్ని తుహిన్ కాంత పాండే భర్తీ చేశారు. కాగా, జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి తమ ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని నియంత్రణ మండలి ఆదేశించింది.

సెబీ ఆదేశాలను సవాలు చేయనున్న జేన్ స్ట్రీట్

కంపెనీపై సెబీ అభియోగాలను తోసిపుచ్చిన జేమ్‌స్ట్రీట్.. నియంత్రణ మండలి ఆదేశాలను చట్టపరంగా సవాలు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. కాగా, తాను అక్రమంగా లబ్ది పొందేందుకు మార్కెట్ సూచీలను కృత్రిమంగా ప్రభావితం చేయడం ద్వారా చిన్న ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చిన జేమ్ స్ట్రీట్‌పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కొందరు మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా కంపెనీపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకూ నియంత్రణ మండలికి సెబీ చట్టం అధికారం కల్పిస్తుందని న్యాయ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఈ మెసేజింగ్ యాప్‌కు ఇంటర్నెట్ అవసరం లేదు..!

బిట్‌చాట్‌ను విడుదల చేసిన ట్విటర్ వ్యవస్థాపకుడు జాక్ డోర్సీ

బ్లూటూత్ టెక్నాలజీ ఆధారంగా సందేశాలు పంపే సదుపాయం



న్యూయార్క్: 'ఎక్స్'గా పేరు మార్చుకున్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సీ బిట్‌చాట్ పేరుతో సరికొత్త మెసేజింగ్ యాప్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం బీటా వెర్షన్‌లో అందుబాటులో ఉన్న ఈ అప్లికేషన్ ద్వారా సందేశాలు పంపేందుకు ఇంటర్నెట్, వైఫై, మొబైల్ నెట్‌వర్క్, ఫోన్ నంబరు, సర్వర్లు, యూజర్ ఐడీ లాంటివేమీ అవసరం లేదు. సమాచార గోప్యతకు అత్యంత ప్రాధాన్యమిచ్చేందుకు బ్లూటూత్ సాంకేతికత ఆధారంగా పనిచేసే ఆఫ్ గ్రిడ్ పీర్-టు-పీర్ మెసేజింగ్ (ఒక వ్యక్తి మరో వ్యక్తికి సందేశాలు పంపే) ప్లాట్‌ఫామ్ ఇది. అంటే, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ లేని సమయంలోనూ బ్లూటూత్ మెష్ నెట్‌వర్క్ ద్వారా ఈ యాప్ నుంచి ఒక వ్యక్తి తన సమీప వ్యక్తికి సందేశం పంపేందుకు వీలుంటుందన్నమాట. వాట్సాప్, మెసెంజర్ వంటి సెంట్రలైజ్డ్ (కేంద్రీకృత) మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు ఇది ప్రత్యామ్నాయం కానుంది.

మళ్లీ గోల్డ్‌మన్ శాక్స్‌కు రుషీ సునాక్

అడ్వైజర్‌గా చేరిన బ్రిటన్ మాజీ ప్రధాని



లండన్: బ్రిటన్ మాజీ ప్రధాని రుషీ సునాక్ మళ్లీ వృత్తి బాట పట్టారు. అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్‌లో సునాక్ సీనియర్ సలహాదారు (అడ్వైజర్)గా చేరనున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం పేర్కొంది. 2024 జూలైలో జరిగిన బ్రిటన్ ఎన్నికల్లో సునాక్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీ ఘోర ఓటమి పాలైంది. అనంతరం సునాక్ బ్రిటన్ ప్రధాని పదవితో పాటు పార్టీ అధ్యక్ష హోదా నుంచీ తప్పుకున్నారు. అయితే, రిచ్‌మాండ్, నార్త్‌అల్లెర్టన్ ఎంపీగా మాత్రం కొనసాగుతున్నారు. రాజకీయాల్లో చేరక ముందు కూడా ఆయన గోల్డ్‌మన్ శాక్స్‌లోనే పనిచేశారు. 2001-2004 మధ్యకాలంలో ఆయన కంపెనీలో తొలుత సమ్మర్ ఇంటర్న్‌గా, ఆ తర్వాత జూనియర్ అనలిస్ట్‌గా పనిచేశారు. ఇప్పుడు సీనియర్ అడ్వైజర్ హోదాలో కంపెనీ యాజమాన్యం, క్లయింట్లకు భౌగోళిక రాజకీయ, ఆర్థిక సంబంధిత అంశాలపై సలహాలు ఇవ్వనున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ నుంచి లభించే పారితోషికాన్ని సునాక్ తన భార్య అక్షతా మూర్తి (ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి కూతురు)తో కలిసి ప్రారంభించిన రిచ్‌మాండ్ ప్రాజెక్ట్‌కు విరాళంగా ఇవ్వనున్నారు. ఈ చారిటీ సంస్థ బ్రిటన్ వాసుల్లో గణాంక నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది.

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ రెవ్‌ఎక్స్

ప్రారంభ ధర రూ.8.94 లక్షలు



మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. మార్కెట్లోకి సరికొత్త ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ రెవ్‌ఎక్స్ సిరీస్ కారును విడుదల చేసింది. మొత్తం మూడు వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.8.94 లక్షలు (ఎక్స్‌షోరూమ్). రెవ్‌ఎక్స్ సిరీస్‌తో ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పోర్టుఫోలియో మరింత బలోపేతమవుతుందని కంపెనీ పేర్కొంది. 1.2 లీటర్ ఎంస్టాలియన్ టీసీఎంపీఎఫ్‌ఐ ఇంజన్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, హిల్ హోల్డ్ కంట్రోల్, 4 డిస్క్ బ్రేక్స్‌తో ఈ కారును తీసుకువచ్చింది.

చైనా టెకీలు తిరిగి వెళ్లినా ఐఫోన్ 17 ఉత్పత్తిపై ప్రభావం ఉండదు..!


న్యూఢిల్లీ: భారత్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో పనిచేస్తున్న వందల మంది చైనా టెక్నాలజీ నిపుణులు గడిచిన రెండు నెలల్లో తిరిగి స్వదేశానికి వెళ్లిపోయినప్పటికీ, ఐఫోన్ 17 ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. దేశంలో ఐఫోన్ 17 తయారీ షెడ్యూల్ ప్రకారం సాగుతుందన్నారు. మన దేశం నుంచి ఐఫోన్ల ఉత్పత్తిని మరింత పెంచాలన్న యాపిల్ ప్రణాళికలోనూ ఎలాంటి మార్పు లేదని ఆ వర్గాలు ఈ సందర్భంగా పేర్కొన్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3.5-4 కోట్ల యూనిట్ల ఐఫోన్లు తయారవగా.. ఈసారి ఉత్పత్తిని 6 కోట్ల యూనిట్లకు పెంచాలని యాపిల్ భావిస్తోందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	515
చిత్తూరు	633	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	86	అనంతపురం	110
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,840 ▲	90,600 ▲	1,19,900 ▼
విజయవాడ	99,900 ▲	94,000 ▲	1,10,000 ▼
విశాఖపట్నం	1,00,000 ▲	90,601 ▲	1,20,000 ▼
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,10,500 ▲
ప్రొద్దుటూరు	97,100 ▲	89,330 ▲	1,08,800 ▲
ముంబై	96,972 ▲	88,871 ▲	1,07,500 ▲

కోవాసంట్ టెక్‌లో కోనాఏఐ, డీక్యూబ్ డేటా విలీనం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ టెక్ ప్రపంచంలో మరో విలీనం చోటు చేసుకుంది. పెద్దగా మానవ ప్రమేయం లేకుండా ఖాతాదారులకు కృత్రిమ మేధ (ఏజెంటిక్ ఏఐ) సేవలందించే కోవాసంట్ టెక్నాలజీస్.. అమెరికాకు చెందిన కోనాఏఐ, డీక్యూబ్ డేటా సైన్సెస్ కార్పొరేషన్ కంపెనీలను విలీనం చేసుకుంది. అయితే ఈ విలీనానికి సంబంధించిన లావాదేవీల వివరాలను మాత్రం ఈ కంపెనీలు వెల్లడించలేదు. విలీనం అనంతరం ఏర్పడిన కంపెనీని కోవాసంట్ టెక్‌గా వ్యవహరిస్తారు. ఏఐ ఆధారిత కంప్లయెన్స్‌లో కీలకంగా ఉన్న కోనాఏఐ, సైబర్ సెక్యూరిటీ సంస్థ డీక్యూబ్ విలీనంతో అంతర్జాతీయ క్లయింట్లకు ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ గవర్నెన్స్ సొల్యూషన్స్‌ను అందించటంతో పాటు సేవల పోర్టుఫోలియోను విస్తరించే అవకాశం లభిస్తుందని కోవాసంట్ వ్యవస్థాపకుడు సీవీ సుబ్రమణ్యం వెల్లడించారు. 2030 నాటికి ఏజెంటిక్ ఏఐ మార్కెట్ ఏటా 54 శాతం వృద్ధితో 170 కోట్ల డాలర్లకు చేరే అవకాశముందని, దీన్ని అందిపుచ్చుకునేందుకు ఈ విలీనం తోడ్పడుతుందని ఆయన తెలిపారు. మూడు కంపెనీల విలీనంతో ఏర్పడే సంస్థలో మొత్తం 400 మంది ఉద్యోగులు ఉండనున్నారు.

ఆస్ట్రా మైక్రోవేవ్‌కు రూ.2,000 కోట్ల ఆర్డర్ !

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఏఎంపీఎల్)కు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి మరో భారీ ఆర్డర్ లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్డర్ విలువ రూ.1,800 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని కంపెనీ డైరెక్టర్ అతిమ్ కాబ్రా సూచనప్రాయంగా వెల్లడించారు. ఆత్మ నిర్బర్ భారత్‌లో భాగంగా భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన 230 సుఖోయ్-30 యుద్ధ విమానాల ఆధునీకరణతో పాటు పెద్ద ఎత్తున క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ (క్యూఆర్ఎస్ఏఎం) అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన కీలక ఎలక్ట్రానిక్ ఉపకరణాల సరఫరా కాంట్రాక్టు తమకు దక్కే అవకాశం ఉందని కాబ్రా తెలిపారు. కాగా కంపెనీ ఇప్పటికే విరూపాక్ష రాడార్ కార్యక్రమంలో కీలకంగా ఉంది.

ప్రపంచంలో తొమ్మిదో అత్యంత రద్దీ విమానాశ్రయం ఢిల్లీ

న్యూఢిల్లీ: గత ఏడాదికి గాను ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐఏ) తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2023లో పదో స్థానంలో ఉన్న ఈ విమానాశ్రయం 2024లో 7.78 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఒక స్థానాన్ని మెరుగుపరచుకుందని ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వెల్లడించింది. అమెరికాలోని అట్లాంటా విమానాశ్రయం 10.8 కోట్ల ప్రయాణికులతో మొదటి స్థానంలో నిలవగా దుబాయ్ (9.23 కోట్ల ప్రయాణికులు), డల్లాస్/ఫోర్ట్ వర్త్ (8.78 కోట్ల ప్రయాణికులు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సాయి పేరెంటరల్స్‌కు రూ.50 కోట్ల నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఫార్మా సంస్థ సాయి పేరెంటరల్స్ లిమిటెడ్.. ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) ఇన్వెస్టర్ల నుంచి రూ.50 కోట్ల నిధులను సమీకరించింది. సమర్ష్ క్యాపిటల్, వ్యామ్ పార్టనర్స్ సహా బ్లూ లోటస్ క్యాపిటల్ అనుబంధ సంస్థల నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు సాయి పేరెంటరల్స్ ఎండీ అనిల్ కరుసాల తెలిపారు. వ్యాపార కార్యకలాపాల విస్తరణ, అంతర్జాతీయ ఫార్మా కంపెనీగా ఎదగాలన్న లక్ష్య సాధనకు ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు అనిల్ చెప్పారు.

● కిర్గిస్థాన్‌లో తమ కంపెనీ చేపట్టిన గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికే ప్రారంభమవుతుందని దక్కన్ గోల్డ్ మైన్స్ తెలిపింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు అవసరమైన యంత్ర పరికరాలకు ఆర్డర్ పెట్టామని, అవి చేతికి అందితే.. వచ్చే రెండు నెలల్లోనే ఖనిజం వెలికితీత, క్రషింగ్, పసిడి ఉత్పత్తి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది.

మళ్లీ 25,500 ఎగువకు నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్లో మంగళవారం ఆరంభం నుంచి ట్రేడింగ్ స్తబ్దుగా సాగినప్పటికీ, ఆఖరి అరగంటలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఎంపిక చేసిన ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెంచారు. దాంతో ప్రామాణిక సూచీలు మోస్తరు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 270.01 పాయింట్ల వృద్ధితో 83,712.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 61.20 పాయింట్లు బలపడి 25,522.50 వద్ద క్లోజైంది. అమెరికా సుంకాల అమలును ఈ నెల 9 నుంచి ఆగస్టు 1కి వాయిదా వేసింది. అయితే, మదుపరులు కొత్త పెట్టుబడులు పెట్టేందుకు భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై స్పష్టమైన పురోగతి కోసం వేచి చూస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.



హార్సిలీహిల్స్‌లో తిరుగుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పేదల ఊటీని పతంజలికి ధారాదత్తం చేస్తారా?

- రాందేవ్ బాబా సన్యాసి ముసుగులో ఉన్న కార్పొరేట్ వ్యాపారి
- ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచించాలి: సీపీఐ నారాయణ

బి.కొత్తకోట, జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం, పేదల ఊటీగా పిలవబడే హార్సిలీహిల్స్‌లోని ఏపీ టూరిజం యూనిట్‌ను పతంజలి అధినేత రాందేవ్ బాబాకు ధారాదత్తం చేయాలనుకోవడం పొరపాటు నిర్ణయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆయన మంగళవారం హార్సిలీహిల్స్‌కు వచ్చారు. ఇటీవల రాందేవ్ బాబా తిరిగిన ప్రదేశాలు, భవనాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'కమ్యూనిజం, సోషలిజం అవుట్ డేటెడ్, టూరిజమే ముఖ్యమన్న సీఎం చంద్రబాబు పర్యాటక అభివృద్ధిని మరిచారు. ప్రముఖ పర్యాటక యూనిట్లను ప్రైవేటుపరం చేస్తూ ఒక విష సంస్కృతిని తీసుకొస్తున్నారు. పతంజలి అధినేత రాందేవ్ బాబా ఒక దొంగ బాబా. సన్యాసి ముసుగులో రూ.కోట్ల వ్యాపారాలు చేస్తున్న కార్పొరేట్ దిగ్గజం. ఉత్తరాదిలో పతంజలి సంస్థ నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్లలో యోగా, ప్రకృతి వైద్యం పేరుతో అనైతిక, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సుందర ఆహ్లాదకర ప్రదేశమైన హార్సిలీహిల్స్‌లో పతంజలికి స్థానమిస్తే ఆ అభ్యంతరకరమైన విన్యాసాలు చేయించి అందాలకొండను అపవిత్రం చేస్తారు. హార్సిలీహిల్స్ కాస్ట్‌లీహిల్స్‌గా మారి సామాన్యులకు దూరం అవుతుంది. హార్సిలీహిల్స్‌పై పతంజలిని తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వం ఈ విషయమై ముందుకు వెళితే పోరాటాన్ని ఉధృతం చేస్తాం. హిల్స్‌కు సమీపంలోనే ఉన్న ప్రముఖ తత్వవేత్త జిడ్డు క్రిష్ణమూర్తి స్థాపించిన రిషివ్యాలీ లాంటి సంస్థలకు ఇచ్చినా అభ్యంతరం లేదు' అని నారాయణ అన్నారు.

8 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీలు

- 13 నుంచి అందుబాటులోకి..

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జోన్ పరిధిలోని వివిధ మార్గాల్లో నడుస్తున్న ముఖ్యమైన 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీలను జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతీ రైలుకు ఒక త్రీటైర్ ఏసీ(ఎకానమీ) బోగీని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్(17233/17234) రైళ్లు, సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201/17202), కాచిగూడ-విజయవాడ మధ్య నడిచే శాతవాహన(12713/12714), విజయవాడ- చెన్నై మధ్య నడిచే పినాకిని ఎక్స్‌ప్రెస్(12711/12712) రైళ్లకు అదనపు ఏసీ బోగీ సదుపాయం ఈ నెల 13 నుంచి అందుబాటులోకి వస్తుందని సీపీఆర్వో వెల్లడించారు.

10న పుట్టపర్తికి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ నెల 10న పుట్టపర్తిలో పర్యటించనున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహిస్తారు. రాష్ట్రంలో పంటల సాగు, దక్షిణాంధ్రప్రదేశ్‌లో కరువు పరిస్థితిపై ఆయన సమీక్షిస్తారు. ఈ నేపథ్యంలో ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో వ్యవసాయ పరిస్థితులపై అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు.

శ్రీకాకుళంలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పెట్టండి

- తోతాపురి మద్దతు 130 కోట్లు సాయం ఇవ్వండి
- కేంద్రమంత్రి చౌహాన్‌తో భేటీలో మంత్రి అచ్చెన్న విజ్ఞప్తి

అమరావతి, న్యూఢిల్లీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): 'విభజన చట్ట ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయండి. అలాగే గుంటూరులో మిర్చి బోర్డు, చిత్తూరులో మామిడి బోర్డు, శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డు ఏర్పాటు చేయండి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రాన్ని కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలసి, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మంత్రి అచ్చెన్నాయుడు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతు సమస్యలపై కేంద్ర మంత్రితో చర్చించారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. 'తోతాపురికి కనీస మద్దతు ధర కిలో రూ.12గా నిర్ణయించాం. ఇందులో కంపెనీలు రూ.8 ఇస్తే... ప్రభుత్వం కిలోకి రూ.4 భరిస్తోంది. దీనికి గాను రూ.260 కోట్లు ఖర్చవుతోంది. ఈ మొత్తంలో రూ.130 కోట్లు ధర లోటు చెల్లింపు కింద కేంద్రం సాయం చేయాలి. ఉత్తర కోస్తా, రాయలసీమలో వెనుకబడిన 8 జిల్లాల్లో ఉద్యాన రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకం సబ్సిడీ పెంచాలి. బుందేల్‌ఖండ్ తరహాలో ఏపీకి అదనపు సాయం చేయాలి' అనికోరారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. కాగా. శ్రీకాకుళం జిల్లాలో మత్స్యరంగ అభివృద్ధికి మరింత తోడ్పాటు, ప్రోత్సాహం అందించాలని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్)ని అచ్చెన్నాయుడు కోరారు. విజయనగరం జిల్లా గరివిడిలో వెటర్నరీ కాలేజీకి గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అచ్చెన్నాయుడు, పక్కన రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్

'సాఫ్ట్'గా.. సర్కారుకే టోకరా!

- భవన నిర్మాణ అనుమతుల వ్యవస్థ కూడా పక్కదారి
- వెలుగులోకి 'సాఫ్టెక్' సిబ్బంది మోసాలు
- లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కుమ్మక్కు
- ప్రభుత్వాదాయానికి పలు రకాలుగా గండి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

భవన నిర్మాణ అనుమతుల జారీని వేగవంతం చేయాలి.. పట్టణ ప్రణాళికా విభాగంలో వేళ్లూనుకున్న అవినీతిని అంతమొందించాలి.. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం! అయితే, ప్లాన్ల అనుమతుల విషయంలో నేరుగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల పాత్రను తప్పించి లైసెన్స్‌డ్ సర్వేయర్ల దశలోనే ప్రాథమికంగా అనుమతులిచ్చేలా సరికొత్త ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకువచ్చినా.. అక్రమాలు ఆగటం లేదు. ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన నూతన విధానాన్ని కూడా భ్రష్టు పట్టించేస్తున్నారు. అంతకుముందు అధికారులు అవినీతికి పాల్పడితే.. 'కొందరు లైసెన్స్‌డ్ సర్వేయర్లే'.. 'సాఫ్టెక్స్' సాంకేతిక సిబ్బందితో కలిసి అవినీతికి తెరతీస్తున్నారు!

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధి ఉన్నతాధికారుల దృష్టికి ఇటీవల కాలంలో భవన నిర్మాణాల విషయంలో పలు సంఘటనలు ఫిర్యాదులుగా వస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారుల లాగిన్ ఐడీలకు కనెక్ట్ అవుతూ ప్రైవేటుగా అప్లికేషన్లను యాక్సెస్ చేస్తున్న విషయం సీఆర్‌డీఏ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. సీఆర్‌డీఏనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఈ నయా దందా జరుగుతోందని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాన్ కోసం దరఖాస్తు చేస్తే ఒక పట్టాన ఆయా పట్టణాభివృద్ధి సంస్థలకు రావటం లేదు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అప్‌లోడ్ చేసిన ఫైల్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు రావాలంటే మధ్యలో సంధానకర్తగా సాఫ్ట్‌వేర్ ఉంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ నిర్వహణను సాఫ్టెక్ అనే సంస్థ నిర్వహిస్తోంది. ఈ సంస్థకు చెందిన సాంకేతిక సిబ్బంది.. నూతన విధానంలో అవినీతికి తెరతీస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి.

ఆ దరఖాస్తులే టార్గెట్!

నూతన భవన నిర్మాణాలకు నిబంధనల ప్రకారం ప్లాన్లకు దరఖాస్తు చేసుకునే వారి విషయంలో సమస్యలు రావటం లేదు కానీ, నిబంధనల ఉల్లంఘనకు అవకాశం ఉన్న దరఖాస్తుల విషయంలో మాత్రం సాఫ్టెక్‌కు చెందిన కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఉదాహరణకు నూతన నిబంధనల ప్రకారం 30 అడుగుల రోడ్డు తప్పనిసరి. ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకోగానే లైసెన్స్‌డ్ సర్వేయర్ స్థాయిలో ముందుగా అనుమతి వచ్చేస్తుంది. దరఖాస్తుదారుడు ఇల్లు కట్టుకుందామనుకుంటే 30 అడుగులు రోడ్డు లేకపోతే దానికి అనుగుణంగా తన సొంత స్థలాన్ని స్థానిక పంచాయతీకి దానపత్రంగా ఇవ్వాల్సి ఉంటుంది. అది ఇచ్చేముందు సీఆర్‌డీఏ టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి కానీ ఇతర పట్టణాభివృద్ధి సంస్థలు కానీ ఎండార్స్‌మెంట్ జారీ చేస్తాయి. ఈ ఎండార్స్‌మెంట్ల కోసం సీఆర్‌డీఏ, పట్టణాభివృద్ధి సంస్థల కార్యాలయాలకు వెళితే అసలు మీ ప్లాన్ దరఖాస్తులే రాలేదన్న సమాధానాలు రావటంతో దరఖాస్తుదారులు విస్తుపోతున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ దగ్గర అప్లికేషన్‌ను చెక్ చేసుకోమని చెబుతున్నారు. దీంతో సర్వేయర్ దగ్గరకు వెళ్లి మరో అప్లికేషన్ పెట్టించటం పరిపాటిగా మారుతోంది. కొంతమంది ఇంజనీర్లు, సాఫ్టెక్ సాంకేతిక ఉద్యోగులు కొందరు కలిసి ఈ పనులు చేయిస్తున్నారని తెలుస్తోంది. లైసెన్స్‌డ్ సర్వేయర్ స్థాయిలో అనుమతులు వచ్చేస్తున్నాయి కాబట్టి భవన నిర్మాణదారుడు ప్లాన్‌కు తగినట్టుగా నిర్మించాల్సి ఉంటుంది. ఉల్లంఘనలకు పాల్పడితే ఆ తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారుల స్థాయిలో తనిఖీలు చేసేటపుడు గుర్తిస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని కొందరు సర్వేయర్లు సాఫ్టెక్ ఉద్యోగులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. దీంతో అప్లికేషన్ నంబర్ వచ్చినా.. అది సీఆర్‌డీఏ అధికారులకు వెళ్లటం లేదు. సాఫ్టెక్ సంస్థలో పనిచేస్తున్న అవినీతి సిబ్బంది ఆ అప్లికేషన్‌ను తెలివిగా హోల్డ్‌లో పెడతారు. ఇలా అనేకసార్లు యజమానులను ఇబ్బంది పెట్టిన తర్వాత సాఫ్టెక్ దగ్గర సరిచేసుకోవచ్చని సర్వేయర్‌లు చెబుతారు. భవన నిర్మాణదారులు సాఫ్టెక్ సిబ్బందిని ఆశ్రయించగానే.. సీఆర్‌డీఏ, పట్టణాభివృద్ధి సంస్థల లాగిన్లలో దరఖాస్తు కనిపిస్తుంది. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఆపై స్థాయి అధికారుల లాగిన్ ఐడీల ద్వారా అప్లికేషన్లను యాక్సెస్ చేస్తున్నారనే అంశాలు పట్టణాభివృద్ధి సంస్థల అధికారుల దృష్టికి వచ్చాయి. ప్లాన్ అనుమతి ఇచ్చిన తర్వాత, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలన జరిపిన తర్వాత ఈ వ్యవహారాలు జరుగుతున్నాయి. ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణాలు సాగినట్టుగా కొలతలను నిర్దేశిస్తూ డిజైన్లను మార్చుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలుగా ఆన్‌లైన్‌లో సక్రమ కట్టడాలుగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి నష్టంకలిగించే విధంగా కొలతలను కుదించేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి!

అందరూ ఒకే ఫార్మాట్‌లో నివేదికలెలా ఇచ్చారు?

- కొన్ని నివేదికలపై నోడల్ అధికారుల సంతకాలు లేవు
- వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీ వేస్తాం
- పోలీసుస్టేషన్లలో సీసీకెమెరాల ఏర్పాటుపై నిలదీసిన హైకోర్టు


అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్టేషన్ మొత్తం కనిపించేలా రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సర్టిఫై చేస్తూ ఎస్‌డీపీవోలు(డీఎస్పీలు) ఇచ్చిన నివేదికలపై హైకోర్టు ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. ఎస్‌డీపీవోలందరూ ఒకే ఫార్మాట్‌లో నివేదికలు ఎలా సమర్పించారని ప్రశ్నించింది. కొన్ని జిల్లాల నివేదికలపై సంబంధిత జిల్లాల నోడల్ అధికారుల సంతకాలు లేవని, వారి బదులు ఇతర అధికారులు సంతకాలు చేశారని తెలిపింది. మంగళవారం ఓ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా విజయవాడ మూడవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నివేదికను ధర్మాసనం ప్రస్తావించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఒక సీసీ కెమెరా మాత్రమే ఉన్నట్లు మేజిస్ట్రేట్ నివేదికలో పేర్కొన్నారని గుర్తుచేసింది. అయితే, స్టేషన్‌ను వ్యక్తిగతంగా తనిఖీ చేసి రాణా మొత్తం కవర్ అయ్యేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు విజయవాడ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సర్టిఫై చేస్తూ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారని తెలిపింది. పరస్పర భిన్న నివేదికల నేపథ్యంలో ఎస్‌డీపీవోలు సమర్పించిన నివేదికల వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లలో పర్యటించి రాణాలో ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు? స్టేషన్ మొత్తం కనిపించేలా ఏర్పాటు చేశారా?లేదా? తదితర అంశాలపై కమిటీ నుంచి నివేదిక కోరతామని పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ని స్టేషన్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయలేదో వివరాలు తమ ముందు ఉంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆ మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జూలై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేష్ 2022లో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడుజిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారంటూ కటారు నాగరాజు గతేడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు రాగా న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా సీసీకెమెరాల ఏర్పాటు జరగలేదన్నారు. రాష్ట్రంలో 1392 పోలీసుస్టేషన్లు ఉండగా, 1001 పోలీసుస్టేషన్లలో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా లాకప్‌లు ఉన్న అన్ని స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అందుకే ఆ ట్యాగ్ తొలగించమన్నా

- విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు విజయ్ దేవరకొండ. 'లైగర్' సినిమా సమయంలో ఉపయోగించిన 'ది' ట్యాగ్, ఆ సందర్భంగా జరిగిన రచ్చపై వివరణ ఇచ్చారు. 'నాకు ఏదో ఒక ట్యాగ్ ఇవ్వాలని దర్శకనిర్మాతలు ప్రయత్నించారు. అది నాకిష్టం లేదు. ఫ్యాన్స్ నాపై చూపించే ప్రేమ, అభిమానాలే నాకు చాలు. వారు నన్ను నా నటనతో గుర్తుంచుకోవాలని కోరుకుంటాను. రౌడీ, సదరన్ సెన్సేషన్ ట్యాగ్‌లతో ప్రేక్షకులు నన్ను పిలిచినా నేను వాటిని అంగీకరించలేదు. దాంతో 'లైగర్' సినిమా ప్రచారంలో చిత్రబృందం 'ది' అనే ట్యాగ్‌ను జోడించింది. అయితే ఆ ట్యాగ్ ఎవరికీ లేకపోవడంతో అంగీకరించాను. కానీ తర్వాత చాలా విమర్శలు వచ్చాయి. వెంటనే ఆ ట్యాగ్‌ను తొలగించాలని నా టీమ్‌ని ఆదేశించాను' అని తెలిపారు. ఇక ఇండస్ట్రీ గురించి మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో సపోర్ట్ లేకపోతే, ఏదైనా స్క్రిప్ట్ మన దగ్గరకు వచ్చినప్పుడు..ఇది బాగోలేదు, ఈ స్క్రిప్ట్ నేను చేయలేను, ఇంకా మెరుగుపర్చాలి అని చెప్పలేం. అదే ఇండస్ట్రీలో సపోర్ట్ ఉన్న నా సమకాలీన నటుడికి ఈ అవకాశం వస్తే, వెంటనే ఆ స్క్రిప్ట్ చేయనని నిర్మొహమాటంగా చెప్పేస్తాడు' అని విజయ్ వ్యాఖ్యానించారు.

సందేశంతో వినోదం



సందేశం, వినోదం కలబోతగా తెరకెక్కిన చిత్రం 'పోలీసు వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మించారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్ ప్రధాన తారాగణం. ఈ నెల 18న విడుదలవుతోంది. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ 'ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే సందేశాత్మక చిత్రమిది. మానవ సంబంధాల్ని చక్కగా ఆవిష్కరించాం. అలరించే భావోద్వేగాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి' అని చెప్పారు. బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ 'కుటుంబంతో చూడదగ్గ వినోదాత్మక చిత్రమిది. నవ్వించడంతో పాటు చక్కటి సందేశంతో దర్శకుడు తెరకెక్కించారు. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు.

ఎన్టీఆర్‌తో కలసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా

హృతిక్ రోషన్



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'వార్'కు ఇది సీక్వెల్. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తి కావడంతో టీమ్ అంతా సెలబ్రేట్ చేసుకుంది. ఈ విషయాన్ని అభిమానులతో ఎక్స్ వేదికగా పంచుకున్నారు ఎన్టీఆర్. "ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చిన 'వార్ 2' చిత్రీకరణ పూర్తైంది. హృతిక్ రోషన్‌తో పనిచేయడం ఎంతో సరదాను ఇచ్చింది. అపారమైన ఆయన ఎనర్జీ లెవెల్స్ అంటే నాకెంతో అభిమానం. ఆయన నుంచి చాలా నేర్చుకున్నా. దర్శకుడు అయాన్ ముఖర్జీ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేయడానికి సిద్ధమయ్యారు" అని పేర్కొన్నారు. మరోవైపు, హృతిక్ కూడా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టి భావోద్వేగానికి గురయ్యారు. "మనసంతా భావోద్వేగాలతో నిండిపోయింది. 149 రోజుల షూట్‌లో చేసిన అద్భుతమైన యాక్షన్, వేసిన డ్యాన్సులు, అయ్యిన గాయాలు.. అన్నీ మరపురానివి. ఎన్టీఆర్‌తో కలసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అని అన్నారు. ఆగస్టు 14న సినిమా విడుదల కానుంది. కియారా అడ్వాణీ కథానాయిక. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.

తొలి హిందీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు



కథానాయికగా దక్షిణాదిన తనకంటూ సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు సాయిపల్లవి. కొన్నాళ్లుగా ఆమె బాలీవుడ్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. సాయిపల్లవి కథానాయికగా నటించిన తొలి హిందీ చిత్రం 'ఏక్ దిన్' విడుదల తేదీ ఖరారైంది. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబర్ 7న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ రొమాంటిక్ లవ్‌స్టోరీలో ఆమిర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటించారు. సునీల్‌పాండే దర్శకుడు. ఇక సాయిపల్లవి నటిస్తున్న మరో హిందీ చిత్రం 'రామాయణ్' వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

కదిలించే భావోద్వేగాలతో...



రమేశ్ ఉప్పు కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'వీడే మన వారసుడు'. లావణ్య రెడ్డి, సర్వాణి మోహన్ హీరోయిన్లు. ఈ నెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత రమేశ్ ఉప్పు మాట్లాడుతూ "రైతుల కష్టాలను అర్థవంతంగా ఆవిష్కరించిన చిత్రమిది. ఇందులోని భావోద్వేగాలు ప్రతీ ఒక్కరినీ కదిలిస్తాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

- ● కీరవాణి తండ్రి శివశక్తి దత్తా కన్నుమూత



'కళ లేకపోతే జీవితమే లేదు' అంటూ చిన్నతనం నుంచి కళపై మక్కువ పెంచుకుని, కళారంగంలో ఉన్నతస్థాయికి ఎదిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సంగీత దర్శకుడు కీరవాణి తండ్రి శివశక్తి దత్తా ఇక లేరు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో కొన్నాళ్లుగా బాధ పడుతున్న ఆయన సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ మణికొండలోని తన ఇంట్లో కన్ను మూశారు. దర్శకుడు రాజమౌళి, గుణ్ణం గంగరాజు, మహేశ్‌బాబు తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. శివశక్తిదత్తా అంత్యక్రియలను ఫిల్మ్‌నగర్ మహాప్రస్థానంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు.

1932 అక్టోబర్ 8న జన్మించిన శివశక్తి దత్తా అసలు పేరు కోడూరి సుబ్బారావు. ఆయన తండ్రి విజయ అప్పారావు ఆ రోజుల్లోనే పెద్ద కాంట్రాక్టర్. హైవే వర్క్స్, పీడబ్ల్యూ డి వర్క్స్ చేసేవారు. ఆయన రెండో సంతానమే సుబ్బారావు. ఊహ తెలిసిన తర్వాత తన పేరుని బాబూరావుగా మార్చుకున్నారు సుబ్బారావు. పదిహేనేళ్ల వయసు వచ్చాక చిత్ర లేఖనం నేర్చుకోవాలనే కోరికతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ముంబై వెళ్లి, అక్కడ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో చేరారు. రెండేళ్ల తర్వాత సొంతవూరుకి తిరిగి వచ్చి తను నేర్చుకున్న చిత్ర లేఖనంతో అందర్నీ ఆశ్చర్యపరిచారు. 'కమలేశ్' పేరుతో ఆయన గీసిన చిత్రాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత తన పేరుని 'శివశక్తి దత్తా' గా మార్చుకుని చివరి వరకూ అదే పేరుతో కొనసాగారు సుబ్బారావు.

ఆడ గొంతుతో పాటలు

శివశక్తి దత్తా ప్రతిభ కుంచెకే పరిమితం కాలేదు. సంగీతంపై మక్కువ కలిగి వీణ, గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. కథలు, కవితలు రాసేవారు. పాత సినిమాల్లో భానుమతి, కన్నాంబ, ఎస్.వరలక్ష్మి పాటలు అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆడ గొంతుతో ఆయన కాలేజీ ఫంక్షన్స్‌లో పాటలు పాడుతుంటే జనం మైమరచి వినేవారు. ఆయన పాట లేకుండా ఆ రోజుల్లో కాలేజీలో ఏ ఫంక్షన్ ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. సినిమా రంగం కూడా ఆయన్ని ఆకర్షించడంతో మద్రాసు వెళ్లి ఎల్వీ ప్రసాద్ దగ్గర అసిస్టెంట్‌గా చేరారు శివశక్తి దత్తా. రెండేళ్లు ఆయన దగ్గర పని చేసిన తర్వాత దర్శకుడు హేమాంబరధరరావు దగ్గర చేరారు. ఆయన తొలి చిత్రం 'తండ్రులు కొడుకులు' లో ఓ చిన్న పాత్ర కూడా పోషించారు. ఆ తర్వాత వారి తండ్రి మరణంతో సొంతవూరు వెళ్లిన శివశక్తి దత్తా 16 ఏళ్ల పాటు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో బాగా డబ్బు సంపాదించి, సొంతంగా సినిమాలు తీద్దామనే ఉద్దేశంతో తమ్ముడు విజయేంద్ర ప్రసాద్‌తో కలసి మళ్లీ మద్రాసులో అడుగుపెట్టారు. సొంత సినిమా నిర్మాణం వారికి కలసి రాలేదు. ఉన్న డబ్బు అంతా పోయింది. బతుకు తెరువు కోసం ఘోస్ట్ రైటర్స్‌గా చాలా చిత్రాలకు పని చేశారు. చివరకు దర్శకుడు రాఘవేంద్రరావు ప్రోత్సాహంతో 'జానకి రాముడు' 'జగదేకవీరుడు అతిలోక సుందరి' 'నారీ నారీ నడుమ మురారి' వంటి చిత్రాలకు రచన చేశారు.

నాలుగు భాషల్లో పాటలు

శివశక్తి దత్తా ప్రతిభా శాలి. తెలుగు చిత్రాల్లో పాటలు రాయడమే కాకుండా తమిళం, కన్నడం, హిందీ నేర్చుకుని ఆయా భాషా చిత్రాల్లో పాటలు రాశారు. సంస్కృతంలో కూడా పాండిత్యం ఉండడంతో ఆ భాషలో కూడా పాటలు రాశారు. ప్రభాస్ హీరోగా రాజమౌళి రూపొందించిన 'ఛత్రపతి' చిత్రంలో 'అగ్ని స్ఖలన సందగ్దయుతు వర్ష ప్రళయ రథ ఛత్రపతి' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను సంస్కృతంలోనే శివశక్తి దత్తా రాశారు. అలాగే 'బాహుబలి'లో 'మమతల తల్లి', 'ధీవర' పాటలను ఆయన రాశారు. ఎన్‌టీఆర్ బయోపిక్ 'కథానాయకుడు'లో టైటిల్ సాంగ్ కూడా రాశారు.

కొడుకుకు ఆ రాగం పేరు



శివశక్తి దత్తాకు కొడుకు కీరవాణి అంటే ఎంతో అభిమానం. ఆయనకు కూడా తండ్రి అంటే ప్రాణం. 'విప్రనారాయణ' చిత్రంలోని 'ఎందు కోయి తోటమాలీ' పాట అంటే శివశక్తి దత్తాకు ఎంతో ఇష్టం. కీరవాణి రాగంతో ఆ పాటను స్వరపరిచారని తెలుసుకున్న శివశక్తి దత్తా తన కొడుకుకి అదే పేరు పెట్టారు. సంగీతమే తన కుమారుడి రూపంలో జన్మించిందని తరచూ చెప్పే శివశక్తి దత్తా కీరవాణి ఆస్కార్ అవార్డ్ అందుకుంటున్నప్పుడు ఉద్వేగానికి లోనయ్యారు.

దర్శకుడిగానూ...

శివశక్తి దత్తా దర్శకుడిగా కూడా తన ప్రతిభ చాటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'పిల్లన గ్రోవి' చిత్రంలో జేవీ సోమయాజులు ప్రధాన పాత్ర పోషించారు. 1995లో మొదలైన ఈ చిత్రంలో మూగ బాలికగా ఐదేళ్ల ఎం.ఎం.శ్రీలేఖ కీలక పాత్ర పోషించారు. ఉన్న డబ్బంతా ఖర్చు కావడంతో పతాక సన్నివేశాలు తీయడానికి డబ్బు లేక సినిమా ఆగిపోయింది. ఈ సినిమాలో శివశక్తి దత్తా, ఆయన సోదరులతో పాటు రాజమౌళి, కీరవాణి కూడా నటించడం విశేషం. ఆ సినిమాకు కీరవాణి సంగీత దర్శకుడు. ఈ ప్రింట్ ఇప్పటికీ చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లోని బాక్సుల్లో భద్రంగా ఉంది. ఆ తర్వాత 'అర్ధాంగి' చిత్రానికీ, 'చంద్రహాస్' సినిమాకు ఆయన దర్శకత్వం వహించారు. చిత్ర పరిశ్రమలో ఇన్ని శాఖలలో పని చేసినా దర్శకత్వం అంటేనే తనకు ఇష్టమని శివశక్తి దత్తా చెప్పేవారు.

ప్రముఖుల నివాళి

శివ శక్తి దత్తా మరణం పట్ల తెలంగాణ ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. చిత్రకారుడిగా జీవితాన్ని ప్రారంభించి, తనదైన శైలిలో రచనలు చేస్తూ, ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న శివశక్తిదత్తా ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కోరారు. 'శివశక్తి దత్తా శివైక్యం చెందారన్న వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని చిరంజీవి అన్నారు. 'కళలు, సాహిత్యంపై ఎంతో మక్కువ కలిగిన మంచి మనిషి శివశక్తి దత్తా. ఆయన మరణం బాధించింది. వారి కుటుంబానికి నా సానుభూతి' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

సీఎంని కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మాధవ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం తనను కలిసిన మాధవ్‌కు సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

వసతి గృహాల్లో అడ్మిషన్లు పూర్తి చేయండి: సీఎస్

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్లు, భోజన వసతి, వాటి నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. అన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ముఖ ఆధారిత హాజరు విధానాన్ని (ఎఫ్ఆర్ఏఎస్) ఆర్టీజీఎస్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలన్నారు. భోజనశాలలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులందరికీ ఆప్కో ద్వారా బెడ్ షీట్లు, కార్పెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

రేపు కొత్తచెరువుకు సీఎం చంద్రబాబు

- శ్రీసత్యసాయి జిల్లాలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

పుట్టపర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీట్ 2.0లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వస్తున్నారు. కొత్తచెరువులోని శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాగంణంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మెగా పేరెంట్ టీచర్స్ మీట్ నిర్వహిస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి మంగళవారం పరిశీలించారు.

మెడ్‌టెక్ జోన్‌కు రూ.34 కోట్లు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్ లిమిటెడ్‌కు పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఇతర గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ప్రభుత్వం రూ.34 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్లీపర్ సెల్స్‌పై సింగిల్ జడ్జి ఉత్తర్వులు నిలిపివేత

- ఆ తరహా ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సిందికాదన్న సీజే ధర్మాసనం

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్లీపర్ సెల్స్‌కు సంబంధించి పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరిపి నివేదికను కోర్టు ముందుంచాలని డీజీపీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు ధర్మాసనం స్టే విధించింది. ఈ తరహా ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సిందికాదని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది.

కస్టోడియల్ టార్చర్‌పై అఫిడవిట్ వేయండి

- పల్నాడు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు హరికృష్ణను పోలీసులు కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని తండ్రి ఎల్లయ్య ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని పల్నాడు ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మే 21 సాయంత్రం 4 గంటల నుంచి 23వ తేదీ మధ్యాహ్నం వరకు దాచేపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి తంగేడు గ్రామ సమీప చెన్నయ్య పాలెం వరకు సీసీటీవీ ఫుటేజ్‌ను తమ ముందు ఉంచాలని దాచేపల్లి పోలీసులను ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. హరికృష్ణను పల్నాడు జిల్లా దాచేపల్లి సీఐ పొన్నూరు భాస్కర్, ఎస్ఐ సౌందర్య రాజు కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొనేలా పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించాలని కోరుతూ తంగేడు గ్రామానికి చెందిన యు.ఎల్లయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

జిల్లా స్థాయిలో డీసీఓ విధానం అమలు

- గిరిజన గురుకులాల సొసైటీ పాలకమండలి నిర్ణయం

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ పాఠశాలల్లో స్నానపు గదులు, మరుగుదొడ్లు, నీటి సరఫరా, సక్రమంగా ఉండే విధంగా చూడాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ 27వ పాలకమండలి సమావేశం మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా స్థాయిలో డీసీఓ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. గిరిజన ప్రాంతాల్లో అవసరమైన చోట గురుకుల పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న 81 గురుకుల విద్యాలయాల్లో నాలుగో తరగతి సిబ్బందిని సర్వీస్ ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించుకోవడానికి ఆమోదం తెలిపారు. 12 మినీ గురుకులాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

సాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు

మాచర్ల రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, పరిశోధన సంస్థలో శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 37 మంది ప్రతినిధులు మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు.

ఉన్నత విద్యలో క్వాంటం టెక్నాలజీ!

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో క్వాంటం టెక్నాలజీపై సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు దశల వారీగా క్వాంటం టెక్నాలజీ సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులోకి తెస్తారు. ఈ టెక్నాలజీపై రాష్ట్రంలోని 500 మంది అధ్యాపకులకు ఐఐటీ మద్రాసు ద్వారా శిక్షణ ఇప్పిస్తారు. ఆరు నెలల్లో శిక్షణ పూర్తిచేసిన తర్వాత దశల వారీగా కోర్సులు అందుబాటులోకి తేవాలని అధికారులు భావిస్తున్నారు. కాగా ఈ సంవత్సరం నుంచి ఆంధ్రా యూనివర్సిటీలో కొత్తగా ఇంజనీరింగ్‌లో క్వాంటం కోర్సులకు ఏఐసీటీఈ అనుమతిచ్చింది.

నేటి నుంచి డీసెట్ కౌన్సెలింగ్ ఆప్షన్లు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): డైట్ కాలేజీల్లో ప్రవేశాలకు డీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు బుధవారం నుంచి ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకునేందుకు గడువు ఇచ్చినట్లు ఏపీ డీసెట్ కన్వీనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 16 వరకు సీట్ల కేటాయింపు, 17 నుంచి 22 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటాయని, 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అధ్యాపక పోస్టుల పరీక్షకు హాల్ టికెట్ల విడుదల

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి 15 నుంచి జరిగే రాత పరీక్షకు హాల్‌టికెట్లు విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు మంగళవారం తెలిపారు. ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

పదవీ విరమణ ప్రయోజనాలు పట్టవా: ఎస్టీయూ

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, ఇతర చెల్లింపులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్టీయూ ఆందోళన వ్యక్తం చేసింది. గత పది నెలలుగా రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ అందడం లేదని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి తెలిపారు.



అమరావతిలోని లింగాయపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ



రాజధానిలో నిర్మాణంలో ఉన్న హెచ్ఓడీ టవర్లు

శరవేగంగా

రాజధానిలో నిర్మాణాలు

ఏ కారణంతోనూ జాప్యం చేయొద్దు.. నిర్దేశించిన సమయంలో పూర్తిచేయాల్సిందే

- అనుమతుల్లో ఎక్కడా జాప్యం ఉండదు
- రాజధానిలో భూములు పొందిన సంస్థల యాజమాన్యాలతో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో భూములు పొందిన సంస్థలు వెంటనే నిర్మాణాలను ప్రారంభించి పూర్తి చేయాలి. ఏ కారణంతోనూ జాప్యాన్ని అంగీకరించేది లేదు' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, హోటళ్లు, కార్యాలయాలు, వివిధ ప్రాజెక్టుల కోసం రాజధానిలో కేటాయించిన స్థలాల్లో ప్రస్తుత పరిస్థితిపై మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎవరు ఏ సమయంలో నిర్మాణాలను మొదలుపెడతారు? ఎప్పటికి పూర్తి చేస్తారు? అనే విషయాలపై ఆయా సంస్థల యజమానులు, ప్రతినిధులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. 'అనుమతుల విషయంలో ఎక్కడా జాప్యం ఉండదు. ఒకవేళ ఏమైనా ఆలస్యం జరిగితే నేరుగా నన్ను సంప్రదించండి' అని సీఎం ఈ సందర్భంగా వారికి సూచించారు. రాజధానిలో స్థలాలు పొందినవారు.. నిర్దేశించిన సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. నెలలో నిర్మాణాలు ప్రారంభిస్తామని మూడు సంస్థలు ఈ సందర్భంగా సీఎంకు తెలిపాయి. రెండు నెలల్లో పనులు చేపడతామని 15 సంస్థలు, ఐదు నెలల్లో ప్రారంభిస్తామని 13, ఆర్నెల్లలో చేపడతామని 17 సంస్థల ప్రతినిధులు చెప్పారు. రాజధానిలో సీఆర్‌డీఏ ఇప్పటి వరకు 72 సంస్థలకు 947 ఎకరాలు కేటాయించింది. స్థలాలు పొందిన వారిలో స్కూళ్లు, బ్యాంకులు, యూనివర్సిటీలు, హోటళ్లు, హెల్త్‌కేర్, మత సంస్థలు, ఐటీ, టెక్ పార్కులు వంటివి ఉన్నాయి.



అభివృద్ధిలో మీరూ భాగస్వాములే!

సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతి నగరాన్ని ఒక ప్రత్యేక ప్రాంతంగా, ఒక ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇది సాధారణంగా నగరంలా ఉండదని, అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉండేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అమరావతి నిర్మాణంలో భూములు తీసుకున్న సంస్థలు కూడా ఇందులో భాగస్వాములేనన్నారు. భూములు తీసుకున్న సంస్థలకు ఇప్పుడు చాలా అంశాలు కలిసి వస్తాయన్నారు. గ్రీన్, బ్లూసిటీగా రాజధాని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. జీరో ఎమిషన్ సిటీగా అమరావతి ఉండబోతుందని, ఎలక్ట్రిక్ వాహనాలకు రాజధానిలో పెద్ద పీట వేస్తామని సీఎం చెప్పారు.

అదనపు స్థలాలు ఇవ్వండి

తమకు అదనంగా భూములు కేటాయించాలని వివిధ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రిని సమావేశంలో కోరారు. ప్రధానంగా హోటళ్లకు చెందిన వివిధ సంస్థల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం, కొన్ని సంస్థలు పార్కింగ్ కోసం అదనపు స్థలం కావాలని కోరాయి. ఏపీ, తెలంగాణల్లోని తమ సిబ్బందికి శిక్షణ కోసం అదనంగా స్థలం కేటాయించాలని పోస్టల్ శాఖ ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

25% పనులు పూర్తికాని నీటి ప్రాజెక్టులూ ముందుకే!

- సీఎం నిర్ణయం.. నేడు క్యాబినెట్ భేటీలో ప్రతిపాదన
- బనకచర్ల, మహిళలకు ఉచిత బస్సుపైనా చర్చ

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల్లో 25శాతం పనులు కూడా పూర్తికాని వాటినీ చేపట్టాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 25 శాతం కంటే తక్కువ పనులు చేపట్టిన ప్రభుత్వ శాఖల పనులన్నింటినీ రద్దుచేసి మళ్లీ టెండర్లు పిలవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలా రద్దు చేసినవాటిలో మెజారిటీ పనులకు తిరిగి టెండర్లు పిలువకుండా వదిలేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక.. గతంలో టెండర్లు పొందాక పనులు సకాలంలో చేపట్టని సంస్థలను తొలగించి కొత్త టెండర్లు పిలవాలని భావించింది. దీంతో.. ఏడాది కాలంగా 25 శాతం పనులు పూర్తిగాని సాగునీటి ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. ఇలా ఆగిన పలు ప్రాజెక్టులు స్థానికంగా ప్రాధాన్యం కలిగినవి కావడంతో.. వాటిని పూర్తిచేయాలంటూ కూటమి ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వస్తోంది. దీంతో.. సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖను సీఎం ఆదేశించారు. ముఖ్యమైన ప్రాజెక్టులను పునఃప్రారంభించాలని బుధవారం జరిగే క్యాబినెట్ భేటీలో ప్రతిపాదించనున్నారు. దీనికి ఆమోదం లభిస్తే పాత ధరలకే పనులు పూర్తి చేయాలంటూ కాంట్రాక్టు సంస్థలతో ఆ శాఖ సంప్రదింపులు జరుపనుంది. క్యాబినెట్‌లో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ జరుగనుంది. అలాగే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుపైనా చర్చ జరుగనుంది.

ఆ స్థానాల్లో టీడీపీ ఇన్‌చార్జులు!

- 'జనసేన, బీజేపీ' నియోజకవర్గాలపై నాయకత్వం కసరత్తు
- విభేదాలకు తావివ్వని నేతలకు అవకాశం
- పిఠాపురం బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే వర్మకే!
- విజయవాడ పశ్చిమకు బుద్దా వెంకన్న?

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, బీజేపీలకు కేటాయించిన నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించింది. ఆ రెండు పార్టీల నాయకులతో సమన్వయం చేసుకుంటూనే టీడీపీని పటిష్ఠం చేసే నాయకులను నియోజకవర్గ ఇన్‌చార్జులుగా నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఆయాచోట్ల ప్రస్తుతం పార్టీ సమన్వయకర్తలు ఉన్నా.. వారు పూర్తి స్థాయిలో పార్టీ కార్యకలాపాలు చేపట్టకపోవడం.. మిత్రపక్షాలతో సమన్వయలోపం వంటి కారణాలతో కొత్త ఇన్‌చార్జులను నియమించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా టీడీపీ 21 అసెంబ్లీ స్థానాలను జనసేనకు, 10 సీట్లను బీజేపీకి కేటాయించింది. జనసేన పోటీచేసిన అన్ని స్థానాల్లో.. తిరుపతి, రైల్వే కోడూరు, తెనాలి, అవనిగడ్డ, పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం, నిడదవోలు, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, పిఠాపురం, కాకినాడ రూరల్, అనకాపల్లి, విశాఖపట్నం దక్షిణం, యలమంచిలి, పెందుర్తి, పాలకొండ, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో విజయం సాధించింది. బీజేపీ 10 స్థానాలకు గాను 8 స్థానాల్లో.. విశాఖ ఉత్తరం, విజయవాడ పశ్చిమ, ఆదోని, ధర్మవరం, జమ్మలమడుగు, ఎచ్చెర్ల, అనపర్తి, కైకలూరుల్లో గెలిచింది. బద్వేలు, అరకు సీట్లలో ఓడిపోయింది. ఈ 31 స్థానాల్లో ఇప్పుడు టీడీపీ సమన్వయకర్తలున్నా పార్టీ కార్యకర్తలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో కేడర్ బలహీనపడే ప్రమాదం ఉందని భావించిన నాయకత్వం పూర్తిస్థాయి ఇన్‌చార్జుల నియామకంపై దృష్టిపెట్టింది.

సమన్వయంతో నడిచే నాయకులకే పెద్దపీట

టీడీపీ ఇన్‌చార్జుల నియామకంపై టీడీపీ పెద్దలు ఆచితూచి అడుగు వేస్తున్నారు. ఆ నియోజకవర్గంలో ఉన్న జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ విభేదాలకు తావు లేకుండా పనిచేసే నాయకులను ఎంపిక చేయాలని భావిస్తున్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు అప్పగించాలని నిర్ణయించారు. వర్మ తనకు ఎమ్మెల్సీ ఇవ్వలేదన్న అసంతృప్తితో ఉండడంతో ఆయన్ను ఇటీవల చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడారు. నియోజకవర్గంలో జనసేన శ్రేణులతో సమన్వయం చేసుకుంటూనే టీడీపీని బలోపేతంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. కాకినాడ రూరల్‌లో ప్రస్తుతం సమన్వయకర్తగా పిల్లి అనంతలక్ష్మి, సహాయ సమన్వయకర్తగా కటకంశెట్టి బాబీ ఉన్నారు. పిల్లి వర్గంపై స్థానికంగా టీడీపీ శ్రేణుల్లో వ్యతిరేకత ఉందని.. దీంతో బాబీకి బాధ్యతలు అప్పగించే అవకాశముందని అంటున్నారు. అనపర్తి ఇన్‌చార్జిగా ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తనయుడు మనోజ్‌ను నియమించనున్నారు. రాజోలు ఇన్‌చార్జిగా గుబ్బల శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ-మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, తిరుపతి-సుగుణమ్మ, అవనిగడ్డలో బొబ్బా గోవర్ధన్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. మిగతా నియోజకవర్గాలపై కసరత్తు జరుగుతోంది.

నిండా ముంచి పరామర్శలా?

- అధికారంలో ఉన్నప్పుడు మామిడి రైతులకు మొండిచెయ్యి
- ఐదేళ్లలో ఒక్కపైసా సబ్సిడీ కూడా ఇవ్వని జగన్
- కూటమి ప్రభుత్వం కిలోకు రూ.4 ఇస్తుంటే ఆక్రోశం
- నేడు బంగారుపాళ్యంలో రైతుల పరామర్శకు మాజీ సీఎం
- జగన్ పర్యటనలో రోడ్డుషో, సభలకు అనుమతి లేదు: ఎస్పీ

(చిత్తూరు-ఆంధ్రజ్యోతి)

అధికారంలో ఉన్నప్పుడు మామిడి రైతుల్ని జగన్ కనీసం పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం వారికి అన్యాయం జరిగిపోతోందంటూ తెగ హడావిడి చేసేస్తున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో మామిడి రైతులు రెండుసార్లు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. 2023లో అప్పటి కలెక్టర్ షన్మోహన్ మద్దతు ధర ప్రకటించినా పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోలేదు. అవన్నీ వైసీపీ పెద్దాయన పర్యవేక్షణలో సిండికేట్‌లో ఉండటంతో కలెక్టర్ కూడా గట్టిగా ఆదేశాలు ఇవ్వలేకపోయారు. అలాగే 2021 సీజన్‌లోనూ తోతాపురి ధరలు పాతాళానికి పడిపోయాయి. పరిశ్రమలు కిలో రూ.6-7కే కొనుగోలు చేశాయి. ఈ రెండు సీజన్లలో రైతులు దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొన్నా, అప్పటి సీఎం జగన్ జోక్యం చేసుకోలేదు. కిలోకు నయా పైసా కూడా సబ్సిడీ ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు మాజీ సీఎం పరామర్శకు రావడాన్ని రైతులే తప్పుబడుతున్నారు. మామిడి కాయలు అమ్ముడుపోక పరిస్థితి దయనీయంగా ఉన్న సమయంలో పట్టించుకోని జగన్... సీజన్ ముగిసే సమయంలో వచ్చి ఓదార్చడమేంటని ప్రశ్నిస్తున్నారు. మామిడి రైతులతో మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అప్పుడు.. ఇప్పుడు ఆదుకుంది చంద్రబాబే

ఈ ఏడాది మామిడి రైతులు నష్టపోతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించారు. ఈ లెక్కన జిల్లా రైతులకు సుమారు రూ.200 కోట్లు ఇస్తున్నారు. ఆయా ఫ్యాక్టరీలు రూ.8 చెల్లించాలని ఆదేశించినా పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రూ.6 ధరను కచ్చితంగా అమలు చేయిస్తున్నారు. ప్రతిరోజూ ఫ్యాక్టరీల వద్ద సుమారు 340 మంది ప్రభుత్వ ఉద్యోగులు షిఫ్టుల వారీగా విధుల్లో ఉంటున్నారు. రైతుల నుంచి బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుంటున్నారు. 2018లో ధరలు పతనమైనప్పుడు కూడా అప్పటి సీఎం చంద్రబాబు కిలోకు రూ.2.50 సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారు.

పెద్దిరెడ్డి ఫ్యాక్టరీ ఇస్తోంది రూ.3 మాత్రమే

ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించి ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని ఆదేశించినా డిమాండ్ లేదంటూ జిల్లాలో సగం ఫ్యాక్టరీలు రూ.6 ఇస్తుండగా, మిగిలినవి రూ.5 చొప్పున ఇస్తున్నాయి. కానీ, సదుంలో ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబసభ్యుల ఫ్యాక్టరీ 'పీఎల్ఆర్ ఫుడ్స్' కిలోకు రూ.3 మాత్రమే ఇస్తోంది. అందులోనూ పరిమితులు పెట్టుకుని ఇప్పటివరకు 8వేల టన్నులే కొనుగోలు చేసింది. వైసీపీ హయాంలో ఆ ప్రాంతంలోని రైతులంతా పీఎల్ఆర్ ఫ్యాక్టరీకే మామిడిని తరలించేలా ఒత్తిడి చేశారు. అప్పట్లో ఆయన చెప్పిన ధరే జిల్లా వ్యాప్తంగా అమలైంది.



సదుంలోని పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల పీఎల్ఆర్ ఫుడ్స్ ఫ్యాక్టరీ

వైసీపీ నేతల ర్యాంపుల్లో రూ.2లే

తవణంపల్లె మండలం గాజులపల్లె సమీపంలో వైసీపీ నేత మురళీమోహన్‌రెడ్డి తిరుమల వే బ్రిడ్జి పేరిట ఓ ర్యాంపును లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు. అక్కడ కిలోకు రూ.2 మాత్రమే చెల్లిస్తున్నారు. విషయం తెలుసుకున్న తవణంపల్లె ఎమ్మార్వో, ఏవో అక్కడికెళ్లి ప్రశ్నించారు. వినకపోవడంతో ఇటీవల కరెంటు కనెక్షన్ తొలగించారు. దీంతో ఆ యజమాని తన బంధువైన రైతు సుబ్రమణ్యంరెడ్డితో మామిడి కాయలు రోడ్డుపై వేయించి నిరసన చేయించారు. దీంతో ఎమ్మార్వో మళ్లీ కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సి వచ్చింది. కాయలు రోడ్డుపై పోస్తున్న ఫొటోను రోత పత్రికలో పదేపదే వేస్తూ అందరు రైతులకు ఆపాదించి వార్తలు వండి వారుస్తున్నారు.

తమిళనాడులో రైతులపై కేసులు

పొరుగును ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే రైతుల్ని పెద్దఎత్తున ఆదుకుంటోంది. కర్ణాటకలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయంతో అనేక ఆంక్షలతో రూ.4 సబ్సిడీ ఇస్తుండగా.. తమిళనాడులో అసలు పట్టించుకోవడం లేదు. వేలూరులో ఇప్పటికి మూడుసార్లు రాస్తారోకో, బంద్ చేసిన రైతులపై అక్కడి ప్రభుత్వం కేసులు నమోదు చేసింది.

రైతులతో ముఖాముఖికే పర్యటన: ఎస్పీ మణికంఠ

బంగారుపాళ్యం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యం పర్యటనలో ర్యాలీలు, రోడ్డు షోలు, బహిరంగ సభలకు అనుమతులు లేవని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకునేందుకే ఈ పర్యటన పరిమితమని తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయటి ప్రాంతాల నుంచి కొంతమందిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.

మామిడి ఎందుకు కొనడం లేదో మీ నేతల ఫ్యాక్టరీలకు వెళ్లి అడగండి

- జగన్ వెళ్తోంది పరామర్శకా? దండయాత్రకా: నీలాయపాలెం

తిరుపతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మామిడికి మార్కెట్‌లో డిమాండు ఎందుకు తగ్గిందో జగన్ పార్టీకి చెందిన మ్యాంగో పరిశ్రమలకు వెళ్లి తెలుసుకోవాలని బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ సలహా ఇచ్చారు. తిరుపతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 'జగన్ మామిడి రైతుల పరామర్శకు వస్తున్నారా? దండయాత్రకు వస్తున్నారా? అర్థం కావడంలేదు. ఆయన పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్, వైసీపీ నేతలకు సంబంధించిన సీజీఆర్ ఫుడ్స్, టాస్ తదితర పరిశ్రమలు మామిడి పండ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదో అడగాలి' అని సూచించారు.

జగన్ జీవితమంతా ఇక ఓదార్పు యాత్రలే

- బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి

తిరుపతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధినేత జగన్‌కు ఇక జీవిత కాలంలో జైత్ర యాత్రలు ఉండవు. ఓదార్పు యాత్రలు చేసుకోవాల్సిందే' అని బీజేపీ నేత, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మామిడి రైతులను పరామర్శించేందుకు చిత్తూరు జిల్లాకు వస్తున్న జగన్... ఎన్ని రకాల మామిడి పండ్లు ఉన్నాయో, వాటిలో నాలుగు పేర్లయినా తెలుసుకుని రావాలి. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏరోజైనా మామిడి రైతుల గురించి మాట్లాడావా?' అని భానుప్రకాశ్ ప్రశ్నించారు.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు నజరానా

- ఐఐటీ, నీట్‌లో అర్హత సాధిస్తే రూ.లక్ష బహుమతి
- గురుకుల సొసైటీ బోర్డు నిర్ణయం

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, నీట్‌లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజనీరింగ్‌లో సీట్లు సాధించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులకు రూ.లక్ష ప్రోత్సాహక నగదు బహుమతి అందిస్తామని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ బోర్డు నిర్ణయించింది. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన మంగళవారం తాడేపల్లిలోని గురుకుల సొసైటీ కార్యాలయంలో 75వ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఐఐటీ, నీట్‌లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజనీరింగ్ సీట్లు పొందిన విద్యార్థులకు రూ.ఒక లక్ష ప్రోత్సాహం అందించడంతో పాటు అతి తక్కువ మార్కుల తేడాతో అర్హత సాధించలేకపోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 10 ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లలో డిప్యుటేషన్‌పై గురుకులాల్లోని ఉత్తమ ఉపాధ్యాయుల నియామకం, గురుకులాలు, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మెటిక్ కిట్స్ అందజేయనున్నారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందిన పల్నాడు జిల్లా వినుకొండ గురుకులం ఆరో తరగతి విద్యార్థిని సంకీర్తన భాయ్ తల్లిదండ్రులకు సాంత్వన పథకం కింద ఆర్థిక సాయంగా రూ.3 లక్షల చెక్కును మంత్రి డోలా అందించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్, గురుకుల సొసైటీ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్యవేణి పాల్గొన్నారు.

10 లక్షల మందికి రేపు రెండో విడత తల్లికి వందనం

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రెండో విడత తల్లికి వందనం నిధులను ప్రభుత్వం రేపు విడుదల చేయనుంది. సుమారు 10 లక్షల మంది విద్యార్థులు రెండో విడతలో లబ్ధి పొందనున్నారు. ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ చేరిన విద్యార్థులకు రెండో విడతలో తల్లికి వందనం నిధులు అందుతాయి. అలాగే మొదటి విడతలో అర్హుల జాబితాలో ఉన్నా ఒకే కుటుంబంలో ముగ్గురి కంటే ఎక్కువ మంది ఉన్నవారు, ఆధార్ నంబర్లు సరిగా నమోదుచేయని సుమారు లక్ష మందికి గత నెలలో జమను పెండింగ్‌లో ఉంచారు. వారికి కూడా ఇప్పుడు విడుదల చేయనున్నారు. విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు పొందిన 46 వేల మంది విద్యార్థుల నగదును వారి తల్లులకు కాకుండా నేరుగా పాఠశాలలకు చెల్లించనున్నారు. మొత్తం 11 లక్షల మంది వివరాలను పాఠశాల విద్యాశాఖ సచివాలయాల శాఖకు పంపింది. అర్హతల వడపోత అనంతరం సుమారు 10 లక్షల మందికి పథకం అందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ వారంలోనే ధాన్యం బకాయిల సొమ్ము విడుదల

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులకు ధాన్యం బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ద్వారా గత రబీ సీజన్‌లో సేకరించిన ధాన్యానికి మద్దతు ధరను రైతుల ఖాతాల్లో జమ చేయడంలో జాప్యం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతిస్తూ ఈ నెల 4న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం బకాయిల సొమ్ములు జమ కానున్నాయి.

'అన్నదాత-సుఖీభవ' జాబితాలు సిద్ధం

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్నదాత-సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాలు సిద్ధమయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారులు వీటిని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. లబ్ధిదారులు జాబితాలను ప్రింట్ తీసుకునే అవకాశం కల్పించారు. ఆధార్ నంబరు ద్వారా 'నో యువర్ స్టేటస్'లో నకలు తీసుకోవచ్చు. అలాగే 'మన మిత్ర వాట్సాప్' ద్వారా కూడా లబ్ధిదారులు వివరాలను తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. జాబితాలో పేరు లేని అర్హులైన రైతులు రైతుసేవా కేంద్రంలో ఆధార్, భూమి వివరాలతో తగిన ధ్రువపత్రాలు సమర్పించి, గ్రీవెన్స్ మాడ్యూల్‌లో నమోదు చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మంగళవారం తెలిపారు. ఈ గ్రీవెన్స్‌ను జూలై 13 వరకు పొడిగించామన్నారు. 'పీఎం కిసాన్' నిధులను కేంద్రం విడుదల చేసిన రోజే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత- సుఖీభవ నగదు విడుదల చేయనుంది.

కనీస ఇంగిత జ్ఞానం ఉండాలి: లోకేశ్

[illegible] మంత్రి లోకేశ్ కూడా ప్రసన్నకు [illegible] మహిళలంటే [illegible] ఖండించారు. వైసీపీ నేతల తీరులో మార్పు రావడం లేదని, మహిళలను [illegible]

వైసీపీ డీఎన్ఏలోనే అసభ్యత, అనైతికత: అనిత

[illegible] ప్రవర్తిస్తున్న వారు అసలు మనుషులేనా? ఇది రాజకీయమా? అని ఆవేదన వ్యక్తం చేశారు. మహి [illegible]

మహిళలను అవమానిస్తే చర్యలు తప్పవు: సవిత


[illegible] జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత తెలిపారు. మంగళవారం [illegible] ఆమె మీడియాతో మాట్లాడారు. [illegible] గౌరవిస్తాడని ప్రశ్నించారు. మహిళలను కన్నీరు పెట్టిస్తే రాజకీ [illegible] ఖాయమన్నారు.

జగన్ మద్దతుతోనే ఆ నేతలు పేట్రేగుతున్నారు

[illegible] లేదని శాసనమండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రసన్నకుమార్‌రెడ్డి చేయలేకపోయిన అభివృద్ధిని ప్రశాంతిరెడ్డి చేస్తుంటే చూసి ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ మద్దతుతోనే వైసీపీ నేతలు పేట్రేగుతున్నారని, ప్రసన్న వ్యాఖ్యలపై జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైసీపీ నేతలు రోజురోజుకి మరింత దిగజారిపోతున్నారని, దానికి నిదర్శనం వారి దిగజారుడు వ్యాఖ్యలేనని అన్నారు. జగన్ రెడ్డి డైరెక్షన్‌లో వైసీపీ నేతలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, విద్వేషం సృష్టించేలా, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా పేట్రేగుతున్నారని ఆరోపించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ, 'వైసీపీ నేతల తీరు యథారాజా తథా ప్రజా అన్నట్లు ఉంది. జగన్‌లా ఆయన అనుచరులూ వ్యవహరిస్తున్నారు. గతంలో జగన్ తన చెల్లి కట్టుకున్న చీరపై కూడా కామెంట్ చేశాడు. నిన్న ప్రసన్నకుమార్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలు భారతీయ కుటుంబ వ్యవస్థపై చేసిన దాడిగా భావిస్తున్నాం. ఆయన వ్యాఖ్యలపై పోలీసులు వెంటనే కేసు రిజిస్టర్ చేసి, అరెస్టు చేయాలి. ఆయనలా టీడీపీలోఎవరు మాట్లాడినా మా పార్టీ అధినేత ఆ చెంపా ఈ చెంపా వాయిస్తారు' అని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం మాట్లాడుతూ... 'అరాచకం, అవినీతి, బూతు వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ. ఆంధ్ర రాజకీయలకు చీడ పట్టినట్లు వైసీపీ పట్టింది. బూతు వ్యాఖ్యలతో రెచ్చిపోవడం వైసీపీ నేతలకు సంప్రదాయంగా మారింది' అని మండిపడ్డారు. నల్లపురెడ్డి లెంపలు వాయించుకొని ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రసన్న వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం

- మహిళలను అవమానించడం వైసీపీ డీఎన్ఏలోనే ఉంది
- మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు: సీఎం



అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. మహిళలను దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడాన్ని వైసీపీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుందని విమర్శించారు. మహిళలను అవమానపర్చడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వైసీపీ డీఎన్ఏలోనే ఉందన్నారు. వారి ఘోర ఓటమికి ఇలాంటి పోకడలే కారణమని తెలిసినా వారి సహజ గుణంలో మార్పు రావడం లేదన్నారు. చెల్లి పుట్టుకపైనా వ్యాఖ్యలు చేసిన వారి నాయకత్వంలో పనిచేస్తున్న నేతలు అంతే దారుణంగా మాట్లాడుతూ నీచ సంస్కృతిని చాటుకుంటున్నారని ధ్వజమెత్తారు. మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వారు అసలు మనుషులేనా? ఇది రాజకీయమా అని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, మహిళా నాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, ప్రణాళికాబద్ధంగా వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రతి పౌరుడు గమనించాలన్నారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ఏఎస్పీ సౌజన్యకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

మారని ప్రసన్న మాట తీరు!

- ప్రశాంతిరెడ్డిపై అవే అనుచిత వాఖ్యలు
- వాటికే కట్టుబడి ఉంటా.. వెనక్కి తీసుకోనని స్పష్టం
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన సెగలు రేగుతున్నా.. నిస్సిగ్గుగా సమర్థించుకున్న వైసీపీ నేత

నెల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు మహిళా సంఘాలు కూడా ఆయన వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండించాయి. వైసీపీ తప్ప మిగిలిన పార్టీలన్నీ ప్రసన్న తీరుపై మండిపడ్డాయి. అయినప్పటికీ.. ఆయన మాటతీరు మాత్రం మారలేదు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రశాంతిరెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలకు వందశాతం కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ మంటలు రేపిన ప్రసన్న వ్యాఖ్యలు యథాతథంగా..

సోమవారం.. పిచ్చి ప్రేలాపనలు

కోవూరులో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ...

"ప్రశాంతిరెడ్డి చెబుతోంది.. నేను అవినీతిలో పీహెచ్‌డీ చేశానంట. మరి నీ సంగతేంది తల్లీ. రేణిగుంట దగ్గర మెస్‌లో పీహెచ్‌డీ చేశావు. బెంగళూరులో, హైదరాబాద్, మద్రాసులో పీహెచ్‌డీ చేశావు. చివరికి మాగుంట లేఅవుట్లో కూడా పీహెచ్‌డీ చేశావు. అది ఏ పీహెచ్‌డీ అనేది అందరికీ తెలుసు. ఆఖరికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని బ్లాక్‌మెయిల్ చేసి పెళ్లి చేసుకుంది. ఆయనో పిచ్చోడు. ఈమెను ఎందుకు చేసుకున్నాడో ఎవరికీ అర్థం కాలే. ఆయన అడిగితే ఏదో మంచి కుటుంబంలో ముక్కుపచ్చలారని అమ్మాయిని ఇచ్చి ఆయనకు పెళ్లి చేసుండేవాళ్లం. ఈ బోరు బావిలో పడిపోయారు. ప్రభాకరరెడ్డిని పెళ్లి చేసుకోకముందు నీ చరిత్ర ఏందమ్మా. నెల్లూరు జిల్లాలో ఏ మారుమూల అడిగినా చెబుతారు. ఆ ప్రభాకరరెడ్డికి కూడా మనసు బాగున్నట్లు లేదు. ఆయనను నానా హింసలు పెడుతున్నట్లు ఉంది. ఆయనకీ అర్థమైనట్లు ఉంది.. ఎందుకొచ్చిన ఖర్మరా అనుకొంటున్నట్లు ఉన్నారు. నేనైతే ప్రభాకరరెడ్డికి ఒకటి చెప్పాలనుకున్నా. ప్రభాకరన్నా.. నువ్వు నిద్రలో ఉన్నా చనిపోతావ్... బయట ఎక్కడో ఒకదగ్గర నిన్ను లేపేస్తారు. జాగ్రత్తగా ఉండు.. నీ దగ్గర వేల కోట్ల ఆస్తులున్నాయి. వాటికోసం నిన్ను లేపేస్తారు. ఇప్పటికే రెండు సిట్టింగ్‌లు అయినట్లు సమాచారం ఉంది. నడమంత్రపు సిరి రాజమాత కదా..!" అని ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి అనుచితంగా మాట్లాడారు.

మంగళవారం నిస్సిగ్గుగా సమర్థన

మహిళా ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శలు వస్తున్నా.. ఆయన మాత్రం వాటిని నిస్సిగ్గుగా సమర్థించుకున్నారు. తన మాటలకు వందశాతం కట్టుబడే ఉన్నానని, వాటిని వెనక్కు తీసుకోనని తెగేసి చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...



"కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతోంది. ఎన్నికలప్పుడు తప్ప.. ఈ ఏడాది కాలంలో నేను ఎంపీ ప్రభాకరరెడ్డిని కానీ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కానీ వ్యక్తిగతంగా విమర్శించలేదు. ఇటీవల ఆమె ముదివర్తిపాలెం వెళ్లింది. ఆ కాజ్ వే ఏదో ఆమే చేయించినట్లు, ప్రసన్నకుమార్‌రెడ్డి ఒక తట్ట మన్ను కూడా వేయలేదని, అన్నీ తానే చేశానని ప్రగల్భాలు పలికింది. అవినీతిపరుడినని ఏదేదో మాట్లాడింది. ఆమె మాట్లాడినదానికి సోమవారం నేను కౌంటర్ ఇచ్చాను. ఈ మాటలకు కట్టుబడి ఉన్నాను. వాటిని వెనక్కు తీసుకోను. నేను చెప్పింది నూటికి నూరుశాతం నిజం. నా మీదకు వ్యక్తిగతంగా వచ్చావు కాబట్టి నేనూ వ్యక్తిగతంగా వచ్చాను. దమ్ము, ధైర్యం ఉంటే ప్రభాకరరెడ్డి, నువ్వు ప్రెస్ మీట్ పెట్టండి. మళ్లీ దానికి కౌంటర్ ఇచ్చుకుంటాం. ఏదో ఈవీఎంల దయతో ఎంపీలు, ఎమ్మెల్యేలు అయిపోయినంత మాత్రాన పెద్ద పుడింగులు అయిపోయారా.. మీరంతా..? ఇళ్ల మీదకు వచ్చిధ్వంసం చేశారు. నేను ఉండి ఉంటే నన్ను చంపేసేవారు. దేవుడు నన్ను బయటకు పంపించాడు. 1961 నుంచి రాజకీయాల్లో ఉన్నాం. ఎంతో మంది నాయకులను చూశాం. ఎవరూ కూడా ఇలాంటి సంప్రదాయాలకు శ్రీకారం చుట్టలేదు. చాలా తప్పు చేశారు. మంచిది కాదిది...' అంటూ ప్రసన్న వాఖ్యానించారు.

ప్రసన్నకుమార్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: శైలజ

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అసభ్యకర వ్యాఖ్యలను రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోందని కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రసన్నకుమార్‌రెడ్డి మాటలు మహిళా లోకాన్ని కించపరిచేలా, సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. మహిళలను అవమానించేలా, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం హేయం. మహిళలను చులకనగా చూడడం, నీచమైన వ్యాఖ్యలు చేయడం వంటివి మహిళల గౌరవాన్ని దెబ్బతీసే కుట్రగా పరిగణించాలి. ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు.

వెల్లువెత్తిన నిరసన

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పలువురి సంఘీభావం
- ప్రసన్నను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్

నెల్లూరు, నెల్లూరు (క్రైం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నెల్లూరు జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. నెల్లూరులో మాజీ మేయర్ భానుశ్రీ నేతృత్వంలో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. ప్రసన్నను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కోవూరులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రసన్నను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐ సుధాకరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రసన్న వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

ఏఎస్పీకి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు

సంస్కారంలేని ప్రసన్నను ప్రజాజీవితం నుంచి బహిష్కరించాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను కలిసి ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రసన్న హయాంలో జరిగిన గ్రావెల్ దోపిడీ, అవినీతి, అక్రమాల గురించి మాట్లాడుతుంటే.. మహిళనని కూడా చూడకుండా నోరు పారేసుకున్న ప్రసన్నను చట్టపరంగా ఎదుర్కొంటానని హెచ్చరించారు.

సోషల్ మీడియాలో ప్రశాంతిరెడ్డికి మద్దతు


ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి మద్దతుగా సామాజిక మాధ్యమాల్లో 'వీ స్టాండ్ విత్ ప్రశాంతిరెడ్డి' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న హ్యాష్‌ట్యాగ్‌ల్లో ఇది మూడో స్థానంలో నిలిచింది. ప్రసన్న వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేసు నమోదు చేయకపోవడం అన్యాయం: వైసీపీ

ప్రసన్న ఇంటిపై దాడి జరిగి ఒక రోజైనా పోలీసులు కేసులు నమోదు చేయకపోవడం అన్యాయమని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఏఎస్పీ సౌజన్యకు ఫిర్యాదు చేశాక ఆయన మీడియాతో మాట్లాడారు. దాడిలో పాల్గొన్న వారందరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

నిండు కుండలా ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ఏరియల్ వ్యూ





మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగులలో శ్రీశైలం గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

జలమే జీవం!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఏటా సముద్రంలోకి రెండు వేల టీఎంసీలు కలుస్తున్నాయి. అందులో 200 టీఎంసీలు చొప్పున ఏపీ, తెలంగాణ వాడుకుంటే రెండు తెలుగు రాష్ట్రాలూ సుభిక్షమవుతాయి. పోలవరం నుంచి బనకచర్లకు నీరు రావాలి. గోదావరి నీరు బనకచర్ల వరకు వస్తే కరువు అనే మాటే ఉండదు. రెండు తెలుగు రాష్ట్రాలూ కరువు కాటకాలకు దూరంగా ఉండాలన్నదే నా తపన" అని తెలిపారు. ముందుగా శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. సాక్షి గణపతిని దర్శించుకున్న అనంతరం... ప్రధాన ఆలయం వద్దకు ముఖ్యమంత్రి రాగానే అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీశైల మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు, అర్చకులు సీఎంను ఘనంగా సత్కరించి, ఆలయ జ్ఞాపికను అందజేశారు. అనంతరం చంద్రబాబు రోడ్డు మార్గం ద్వారా సున్నిపెంట చేరుకున్నారు. అక్కడ జలాశయంలో కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చి, గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. అనంతరం శ్రీశైలం డ్యాం నాలుగు గేట్లను ఎత్తి కృష్ణా జలాలను దిగువన సాగర్‌కు విడుదల చేశారు. రాయలసీమను రతనాల సీమగా మార్చడమే తన సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే పోలవరాన్ని ఇప్పటికే పూర్తి చేసి తెలుగుజాతికి అంకితం చేసేవాళ్లమని తెలిపారు.

రిజర్వాయర్లు ఆధునిక దేవాలయాలు

శ్రీశైలం గేట్లు ఎత్తిన అనంతరం సీఎం సున్నిపెంటలోని ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ స్థానికులు, రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రిజర్వాయర్లు ఆధునిక దేవాలయాలని అన్నారు. '2014-19 మధ్య సాగునీటి రంగానికే రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. ఒక్క సీమకే రూ.12,500 కోట్లు ఖర్చు చేశాం. కానీ దురదృష్టవశాత్తు గత ఐదేళ్లు ఒక పార్టీ పాలించింది. దదాని పేరును నా నోటి నుంచి పలికేందుకు కూడా ఇష్టం లేదు. ఐదేళ్లలో కేవలం రూ.2వేల కోట్లు ఖర్చు చేసి సాగునీటి రంగాన్ని నాశనం చేసింది" అని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలను చక్కదిద్దుతున్నామన్నారు. 'వ్యవసాయానికి ప్రధానమైన సాగునీటి కోసం ఎంతో కృషి చేస్తున్నాం. నిజానికి జలాలే మన సంపద.. మన అభివృద్ధి. వాటితోనే మన రైతుల కష్టాలు పూర్తిగా తీరతాయి. రూ.3,590 కోట్లతో హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు వేగవంతం చేశాం. గోదావరితో రాయలసీమకు సాగునీరు వస్తోంది. ప్రస్తుతం కృష్ణా డెల్టాకు కూడా గోదావరి ద్వారా నీళ్లు ఇస్తున్నాం. ఈనెల 15లోగా అనంతపురం జిల్లాలోని జీడీపల్లి, పీఏబీఆర్‌తో పాటు ఈనెల 30లోపు కుప్పం, మదనపల్లెకు కూడా నీటిని తీసుకెళ్తాం. రాయలసీమను అన్ని విధాలుగా అభివృద్ధిపరచి ప్రపంచంలో నెంబర్ వన్ వ్యవసాయ ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. హార్టికల్చర్ హబ్‌గాను..ఇండస్ట్రియల్ కారిడార్‌గాను మార్చేస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు. తాను రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. "సమైక్య రాష్ట్రంలో 9 ఏళ్లు సీఎం, 10 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నా. విభజన తరువాత రెండో సారి సీఎం అయ్యాను. నన్ను బలమైన శక్తిగా మార్చిన తెలుగు ప్రజలకు జీవితాంతం కృతజ్ఞుడనై ఉంటాను. 2027నాటికి పోలవరం పూర్తిచేస్తాం. రాయలసీమ అభివృద్ధికి నా వద్ద బ్లూప్రింట్ ఉంది. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో రహదారి, పోర్ట్ వ్యవస్థ మన వద్ద ఉంది. గత ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌ను రద్దు చేసింది. ఇప్పుడు మళ్లీ 90శాతం సబ్సిడీతో ఆ సదుపాయం కల్పిస్తున్నాం. తెలుగుగంగ, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, నగరి, గాలేరు, హంద్రీనీవా కింద ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలో 1,004 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం 554 టీఎంసీలు మాత్రమే నీళ్ల ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఉన్నాయి. మరో 450 టీఎంసీలు వస్తే రాష్ట్ర జలాశయాలు కళకళలాడతాయి" అని సీఎం తెలిపారు.



ఏరియల్ సర్వే చేస్తూ శ్రీశైలం డ్యాంను ఫోన్‌లో వీడియో తీస్తున్న చంద్రబాబు

"శ్రీశైలంలో ప్రధానంగా రెండు దేవాలయాలు ఉన్నాయి. ఒకటి శ్రీశైల మల్లన్న ఆలయమైతే, మరొకటి ఆధునిక దేవాలయం శ్రీశైలం జలాశయం. శ్రీశైల మల్లన్నను ఎంత పవిత్రంగా పూజిస్తారో... జలాశయం నీటిని కూడా అదే తరహాలో పూజిస్తే రైతుల కష్టాలన్నీ తీరిపోతాయి. గతంలో రాయలసీమను రాళ్లసీమ అన్నారు. సంకల్పంతో రాయలసీమ స్థితిగతులను మార్చేలా జలప్రణాళికలకు ఎన్టీఆర్ రూపకల్పన చేశారు. అదేబాటలో నడిచి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే నా లక్ష్యం.'

\- సీఎం చంద్రబాబు

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఫ్రీ బస్

రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు సీఎం చెప్పారు. ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇది కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈ హామీ అమలుపై కూటమి ప్రభుత్వ కసరత్తు పూర్తయింది. ముఖ్యమంత్రి వెంట జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్త జయసూర్య, భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

1.06 లక్షల క్యూసెక్కుల విడుదల

శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారడంతో చంద్రబాబు 6,7,8,11 క్రస్ట్ గేట్లను పదడుగులు ఎత్తి నీటిని విడుదల చేశారు. 1,06,976 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు వదిలారు. ప్రస్తుతానికి శ్రీశైలంలోకి సుంకేసుల, జూరాల నుంచి 1,86,534 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కుడి ఎడమ విద్యుత్ ఉత్పాదన కింద 65,719 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



పోలవరం స్పిల్వే నుంచి విడుదలవుతున్న గోదావరి వరద జలాలు

ధవళేశ్వరం గేట్లన్నీ ఎత్తివేత

పోలవరం, ధవళేశ్వరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు పొంగి పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం స్వల్పంగా పెరిగింది. స్పిల్‌వేలోకి చేరుకున్న 2,02,463 క్యూసెక్కుల వరదను అధికారులు దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం సాయంత్రానికి 1,98,710 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మొరాయించిన గేట్లను రిపేర్ చేసి కాటన్ బ్యారేజ్‌లోని మొత్తం 175 గేట్లను పైకి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.80అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 13,550 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న షర్మిల, చిత్రంలో తల్లి విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు

వైఎస్సార్‌కు జగన్, షర్మిల వేర్వేరుగా నివాళి

- అన్న వచ్చి వెళ్లాక ఇడుపులపాయకు చెల్లి



వైఎస్‌కు నివాళులర్పిస్తున్న జగన్, విజయలక్ష్మి, భారతి తదితరులు

వేంపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, మాజీ సీఎం జగన్, కుమార్తె, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వేర్వేరుగా నివాళి అర్పించారు. ముందుగా మంగళవారం ఉదయం 7:30కు తల్లి విజయలక్ష్మి, భార్య భారతితో కలిసి జగన్ పులివెందుల నుంచి రోడ్డుమార్గం ద్వారా ఇడుపులపాయ చేరుకున్నారు. బంధువులతో కలిసి వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రార్థనలు చేశారు. తండ్రి సమాధిపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఘాట్ ఆవరణలోని విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. 8.15 గంటలకు జగన్ అక్కడి నుంచి వెనుదిరిగారు. 8.30 ప్రాంతంలో తల్లి విజయలక్ష్మి, బాబాయ్ సుధీకర్ రెడ్డి, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి తదితరులతో కలిసి షర్మిల వైఎస్సార్ సమాధికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఘాట్ ఆవరణలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. రెండు సార్లు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన ఘనత వైఎస్‌దేనన్నారు. ఆయనకు తెలంగాణలో జయంతి, వర్ధంతి రోజున వైఎస్సార్ మెమోరియల్ లేదన్నారు. ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయాలని కోరతానన్నారు.

ఎదురెదురుగా జగన్, షర్మిల కాన్వాయ్

ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్ సమీపంలో మంగళవారం ఉదయం ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మాజీ సీఎం జగన్, ఆమె సోదరి షర్మిల మధ్య విభేదాలున్న సంగతి తెలిసిందే. వారి తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7:30గంటలకు వైఎస్సార్ ఘాట్‌కు వచ్చిన జగన్ 8.15గంటలకు ఘాట్ నుంచి బయల్దేరారు. అప్పటివరకు ఇడుపులపాయ గెస్ట్‌హౌస్‌లో వేచిఉన్న వైఎస్ షర్మిల 8.15గంటలకు ఘాట్‌కు బయల్దేరారు. ఆ సమయంలో ఘాట్ సమీపంలోని రోడ్డులో ఇరువురి కాన్వాయ్‌లు ఎదురుపడ్డాయి. 'అన్న వెళ్లారు.. చెల్లెలు వచ్చారు' అంటూ అక్కడ పలువురు చర్చించుకున్నారు.

ఏయూలో వైఎస్ జయంతి వేడుకలు!

- విధులు పక్కనబెట్టి విగ్రహం వద్ద కేక్ కట్ చేసిన ఉద్యోగులు

విశాఖపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో కొంతమంది ఉద్యోగుల తీరు ఏమాత్రం మారలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వర్సిటీని నాటి పాలకులు అధికార పార్టీ రాజకీయాలకు కేంద్రంగా మార్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ తరహా కార్యక్రమాలకు కొంతవరకూ అడ్డుకట్ట పడింది. అయితే.. మంగళవారం వైఎస్ జయంతి సందర్భంగా.. పది మంది వర్సిటీ ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సిన సమయంలో క్యాంపస్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు వచ్చి కేక్ కట్ చేసి, విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. ఇది చూసి మిగిలిన ఉద్యోగులు విస్మయానికి గురయ్యారు. వేడుకలు జరిగిన ప్రాంతానికి సమీపంలోనే వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ విషయం వారి దృష్టికి వెళ్లిందో, లేదో... కానీ ఎవరూ పట్టించుకోలేదు.

రాష్ట్రాభివృద్ధిపై జగన్ కుట్రలు!



- ఎండీసీ బాండ్లు కొనొద్దంటూ 200 మంది ఇన్వెస్టర్లకు మెయిళ్లు
- ప్రధాని, ఆర్థికమంత్రి, ఆర్‌బీఐ, సెబీ, ఇతర ఎక్స్ఛేంజీలకు ఫిర్యాదు
- హైకోర్టులో కేసులు.. వాటిపై బుగ్గన ప్రెస్‌మీట్లు.. జగన్ ట్వీట్లు
- అయినా చంద్రబాబు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోని ఇన్వెస్టర్లు
- వైసీపీ విష ప్రచారాలపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజం

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునేందుకు మాజీ సీఎం జగన్ కుట్రలు చేస్తున్నారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. జగన్‌కు తోడు మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గంటల తరబడి ప్రెస్‌మీట్లు పెడుతూ రాష్ట్రాభివృద్ధిపై అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు బ్రాండ్ ఏపీని ప్రత్యక్షంగా నాశనం చేసి, ఇప్పుడు తప్పుడు ట్వీట్లతో, విష ప్రచారాలతో పరోక్షంగా నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) బాండ్ల జారీ ద్వారా రూ.9వేల కోట్ల రుణం సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అయితే ఈ బాండ్లను ఎవరూ కొనకుండా జగన్‌తోపాటు వైసీపీ నేతలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, ఉదయ భాస్కర్ అనే మరో వ్యక్తి ఎలాంటి కుట్రలు పన్నారో, వాటిని ప్రభుత్వం ఎలా అధిగమించిందో వివరించారు. "జర్మనీలో ఉద్యోగం చేసే ఉదయ్ భాస్కర్ అనే వ్యక్తి ద్వారా ఏపీఎండీసీ ఇష్యూ చేసే బాండ్లు కొనొద్దంటూ 200 మందికి పైగా ఇన్వెస్టర్లకు మెయిళ్లు పెట్టించారు. వీటిని ఆ ఇన్వెస్టర్లు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఏపీఎండీసీ బాండ్ల వ్యవహారంపై వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డితో హైకోర్టులో పిల్ వేయించారు. విషయం కోర్టు పరిధిలో ఉందని, పెట్టుబడులు పెట్టొద్దని ఇన్వెస్టర్లకు మరోసారి మెయిళ్లు పంపారు. కోర్టులో ఉండగా బాండ్ల జారీపై ముందుకెలా వెళ్తారంటూ రోతపత్రికలో రాతలు రాశారు. వాటిపై బుగ్గన ప్రెస్‌మీట్లు, జగన్ ట్వీట్లు చేసి, మళ్లీ వాటిని ఇన్వెస్టర్లకు పంపించారు. అయినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వంపై ఇన్వెస్టర్లు విశ్వాసం కోల్పోలేదు. ఈ బాండ్లకు పెట్టుబడులు రాకూడదని జగన్ విశ్వప్రయత్నాలు చేసినా ఎండీసీ ఇష్యూ ఓవర్ సబ్‌స్క్రైబ్ అవడం చంద్రబాబు ప్రభుత్వంపై వారికున్న విశ్వాసానికి ప్రతీక" అని పయ్యావుల పేర్కొన్నారు.

ఆర్‌బీఐ, సెబీ చెప్పినా వినరా?

"లేళ్ల అప్పిరెడ్డి విష ప్రచారం సరైన ఫలితాలు ఇవ్వడం లేదని భావించి వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి దించారు. ఆయన ఏపీఎండీసీ బాండ్ల వ్యవహారం రాజ్యాంగ విరుద్ధం, నిబంధనలకు విరుద్ధమంటూ ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్‌బీఐ, సెబీ, ఇతర ఎక్స్ఛేంజీలకు ఫిర్యాదులు ఇచ్చారు. సాధారణంగా బాండ్ల ఇష్యూకి 4 గంటల్లోగా అనుమతి వస్తుంది. కానీ, ఈ ఫిర్యాదుల కారణంగా 15 రోజులు పట్టింది. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్నది సరైనదేనని, ఇందులో నిబంధనల ఉల్లంఘన లేదని కేంద్రం, సెబీ, ఆర్‌బీఐ తేల్చిచెప్పిన తర్వాతే బాండ్ల ఇష్యూకి అనుమతి దొరికింది. రూ.9,000 కోట్ల రుణం కూడా వచ్చింది. ఇంత జరిగాక కూడా ఇది తప్పంటూ జగన్ ట్వీట్లు, బుగ్గన ప్రెస్‌మీట్లు పెడుతున్నారు. సెబీ, ఆర్‌బీఐ చెప్పినా కూడా వినరా?" అని మంత్రి ప్రశ్నించారు. "డైరెక్ట్ డెబిట్ విధానం తప్పంటూ గగ్గోలు పెడుతున్న బుగ్గన... ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే దాన్ని బెవరేజెస్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు. ఇప్పుడు దీన్ని ఆర్‌బీఐ కూడా ఆమోదించింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి డైరెక్ట్ డెబిట్ విధానంలో అప్పు తీసుకోవడానికి అనుమతిచ్చింది. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో ఇదే అమలవుతోంది" మంత్రి పయ్యావుల వెల్లడించారు.

ఎవరిచ్చిన జీవో తప్పు

"ఏపీఎండీసీ బాండ్ల జారీ ద్వారా రూ.7వేల కోట్లు అప్పు తెచ్చుకునేందుకు అనుమతిస్తూ వైసీపీ ప్రభుత్వంలో 2024 మార్చి 15న బుగ్గన జీవో 35 ఇచ్చారు. ఇప్పుడు అదే బాండ్ల జారీ ద్వారా రూ.9,000 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు 2025 మార్చి 11న మేం జీవో 32 ఇచ్చాం. ఇందులో ఏ జీవో తప్పో బుగ్గన చెప్పాలి. బెవరేజెస్ కార్పొరేషన్ వ్యవహారంలో అప్పు కోసం ఏకంగా గవర్నర్ పేరునే వివాదాల్లోకి లాగారు. దీంతో ఆగ్రహించిన గవర్నర్ అప్పటి సీఎస్‌ను పిలిపించి, తిడితే దాన్ని సవరించుకున్నారు' అని పయ్యావుల గుర్తు చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం కోసం 75 కేంద్ర పథకాలను తిరిగి ప్రారంభించామని మంత్రి తెలిపారు. 'జగన్ హయాంలోని 24,000 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాం. ఇందులో ఉద్యోగులకు రూ.7,000 కోట్లకు పైగా చెల్లించాం. ఉద్యోగుల సంక్షేమం కోసం బాధ్యతగా పనిచేస్తున్నాం. వారి కష్టాలు గుర్తున్నాయి'అని మంత్రి అన్నారు.

విశాఖలో జీసీసీ

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. సంస్థ సీఈవో లలిత్ ఆహూజా మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి ప్రతిభ, బలమైన మౌలిక సదుపాయాలు, విజనరీ నాయకత్వం మేలుకలయికగా ఉండే విశాఖలో అద్భుతాలు సాధ్యం కానున్నాయని తెలిపారు. ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రపంచ స్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థలకు గమ్యంగా మారుతుందని చెప్పారు. లోకేశ్ మాట్లాడుతూ రాబోయే నాలుగేళ్లలో ఏపీలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో ఐటీ జీసీసీ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది తమ టార్గెట్ అన్నారు. 5 లక్షల ఉద్యోగాల టార్గెట్‌లో ఇప్పటికే 12 శాతం సాధించామని చెప్పారు. బెంగళూరు, గోవా మేలు కలయికగా విశాఖ కూడా వ్యాపార, వాణిజ్యాలకు అనువైన కేంద్రంగా రూపుదిద్దుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ ప్రతిభావంతులకు వేదిగా మారబోతోందన్నారు. ప్రభుత్వ విధానాల మేరకు అక్కడ ఐటీ రంగం వృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఆర్థిక వృద్ధి వ్యూహంలో జీసీసీదే కీలకపాత్రగా లోకేశ్ వెల్లడించారు. కొద్ది నెలల్లోనే ఐటీ రంగంలో గ్లోబల్ ప్లేయర్లను ఆకర్షించడం తమ తొలి విజయమన్నారు. జీసీసీలను స్ట్రాటజిక్ హబ్‌లుగా మార్చేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని అన్నారు. ఇందులో భాగంగా టీసీఎస్, కాగ్నిజెంట్‌లకు ఎకరా 99 పైసలకే భూములు అప్పగించామని తెలిపారు. జాతీయ స్థాయిలో టాప్ 100 ఐటీ కంపెనీలకు రాష్ట్రానికి రప్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కేవలం ప్రోత్సాహకాలు అందించడమే కాకుండా.. ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. జీసీసీల అవసరరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, క్లౌడ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ప్రొడక్ట్ ఇంజనీరింగ్‌ను బలోపేతం చేస్తూ.. టాలెంట్ పైప్‌లైన్ కోసం పలు కంపెనీలతో కలసి పని చేస్తున్నామని వెల్లడించారు.



బెంగళూరులో జీసీసీ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి లోకేశ్

విశాఖ వైపు ప్రపంచ సంస్థలు..

విశాఖ నగరంపై ఇప్పటికే ప్రపంచ స్థాయి సంస్థలు దృష్టి సారించాయని లోకేశ్ చెప్పారు. 'గూగుల్ అమెరికా వెలుపల ఇక్కడే అతిపెద్ద డేటా సెంటర్‌ను నిర్మించబోతోంది. ఇక్కడ హైపర్ స్కిల్ క్లౌడ్ మౌలిక సదుపాయాలు, ఏఐ ల్యాబ్‌లు, ఎనలిటిక్ హబ్‌లు, కంప్యూటింగ్ క్లస్టర్లు ఉంటాయి. ప్రపంచంలోనే డిజిటల్ లీడర్‌షిప్‌కు ఏపీ సిద్ధంగా ఉందనడానికి ఇదొక సంకేతం. ఎమర్జింగ్ సిటీస్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా అమరావతి, తిరుపతి, అనంతపురం, కాకినాడ వంటి నగరాల్లో స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తున్నాం. గ్లోబల్ సిటీ విశాఖకు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ కోసం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్నాం. విశాఖ నగరాన్ని ప్రపంచ జీసీసీ నూతన రాజధానిగా మార్చేందుకు ఏఎన్ఎస్సార్ మాతో కలసి పనిచేయాలని కోరుతున్నాం. విశాఖలో నూతనాధ్యాయం కోసం మేం చేస్తున్న కృషిలో భాగస్వాములవ్వాలి' అని పిలుపిచ్చారు. వాస్తవానికి.. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఈ ఏఎన్ఎస్సార్ విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్ హౌస్ కేప్టివ్ యూనిట్ల ఏర్పాటుకు 2017 అక్టోబరులోనే రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అప్పట్లోనే ఈ సంస్థకు రుషికొండ ఐటీ సెజ్‌లో పది ఎకరాలు కేటాయించారు. అయితే అనుకోని పరిణామాలతో ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించలేకపోయింది. ఇప్పుడు ఏపీలో ఐటీకి మంచి పాలసీలు పెట్టి, ప్రభుత్వం చక్కటి ప్రోత్సాహం అందిస్తుండడంతో మళ్లీ ముందుకొచ్చింది.

డబ్ల్యూఎన్ఎస్‌ను కొన్న క్యాప్‌జెమిని

- విశాఖలో సొంత కార్యాలయానికి సన్నాహాలు

బడా ఐటీ కంపెనీలు ఒక్కొక్కటిగా విశాఖ వస్తున్నాయి. ఇక్కడ పదేళ్లుగా బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం)లో అగ్రశ్రేణి సంస్థగా ఉన్న డబ్ల్యూఎన్ఎస్ కంపెనీని ఫ్రాన్స్‌కు చెందిన పేరొందిన కంపెనీ 'క్యాప్‌జెమిని' కొనుగోలు చేసింది. డబ్ల్యూఎన్ఎస్‌కు ఇండియాలో విశాఖతోపాటు పుణె, గుర్గావ్, ముంబైల్లో శాఖలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తున్న ఈ సంస్థలో 65 వేల మంది ఉద్యోగులు ఉండగా ఒక్క విశాఖలోనే ఐదు వేల మంది పనిచేస్తున్నారు. ఈ ఏడాది చివరికల్లా క్యాప్‌జెమినిలో డబ్ల్యూఎన్ఎస్ విలీనం పూర్తవుతుంది. ప్రస్తుతం ఈ సంస్థ అద్దె భవనంలో నడుస్తుండగా.. క్యాప్‌జెమినికి కూడా భూమి ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం సుముఖంగా ఉంది. సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకుని ఏఐ టెక్నాలజీ సేవలు కూడా అందించాలని క్యాప్‌జెమిని భావిస్తోంది. దీంతో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే విశాఖలో టీసీఎస్, కాగ్నిజెంట్‌కు ప్రభుత్వం భూములు కేటాయించింది. గూగుల్ కూడా రాబోతోంది. అన్ని పెద్ద కంపెనీలూ విశాఖలో అడుగుపెడుతుండడంతో ఇతర సంస్థలు కూడా రావడానికి ఆసక్తి చూపుతున్నాయి.

ఏపీకి స్వాగతం

- స్థిరాస్తి రంగంలో పెట్టుబడులతో రండి
- ప్రెస్టేజ్, సత్వ అధినేతలకు లోకేశ్ ఆహ్వానం

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రెస్టేజ్, సత్వ గ్రూపుల అధినేతలను ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. బెంగళూరులో విభిన్న రంగాల పారిశ్రామిక నిపుణులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఎంజీ రోడ్డులోని ప్రెస్టేజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ గ్రూప్ చైర్మన్ ఇర్ఫాన్ రజాక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయాద్ నోమాన్‌తో చర్చలు జరిపారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులకు పూర్తి అనుకూల వాతావరణం ఉందని లోకేశ్ వారికి వివరించారు. రాజధాని అమరావతి పనులు రూ.65 వేల కోట్లతో శరవేగంగా సాగుతున్నాయని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థల రాకతో విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారుతోందని తెలిపారు. రిలయన్స్, రెన్యూ వంటి సంస్థలు రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్, గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయన్నారు. గత ఏడాదిలో రాష్ట్రంలో రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయని తెలిపారు. రియల్ ఎస్టేట్ డెవలపర్స్ కంపెనీగా దేశవ్యాప్త గుర్తింపు పొందిన ప్రెస్టేజ్‌ను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ప్లగ్ అండ్ ప్లే మోడల్, ప్రీ-బిల్ట్ మౌలిక సదుపాయాల్లో పేరొందిన సత్వ గ్రూప్ ఎండీ విజయ్ అగర్వాల్‌తోనూ లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలంగా ఉందని, పెట్టుబడులు పెట్టాలని కోరారు. రియల్ ఎస్టేట్, వాణిజ్య, రెసిడెన్షియల్, విద్య, ఉన్నత విద్య, డీ అండ్ బీ సొల్యూషన్స్, హాస్పిటాలిటీ, రిటైల్, కో-లివింగ్, కో-వర్కింగ్ అండ్ డేటాసెంటర్‌లు ఏపీకి రానున్నాయని వివరించారు. సత్వ గ్రూప్ ఎండీ సానుకూలంగా స్పందించారు. విశాఖలో రియల్ ఎస్టేట్ రంగంలో 30 ఎకరాల్లో దాదాపు 1,500 కోట్ల మేర పెట్టుబడులు పెడతామని వెల్లడించారు. వీటివల్ల 2,500 ఉద్యోగాలు దక్కుతాయి.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ గేమ్ చేంజర్

అమరావతిలో మరో ఆరు నెలల్లో క్వాంటమ్‌వ్యాలీ అందుబాటులోకి వస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. జీసీసీ గ్లోబల్ లీడర్లతో రోడ్‌షోలో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. మాన్యతా ఎంబసీ బిజినెస్ పార్క్‌లో పలువురు ప్రముఖులతో చర్చించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్‌వైపు చూస్తోందని, పెట్టుబడులకు ఇదే సరైన సమయమని అన్నారు. అమరావతిలో మరో ఆరు నెలల్లో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభం కానుందని తెలిపారు. ఇది భారత సాంకేతిక విప్లవంలో గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని చెప్పారు.. ఈ రోడ్‌షోలో లోవ్స్ ఇండియా ఎండీ అంకూర్ మిట్టర్, రోల్స్ రాయ్స్ వైస్ ప్రెసిడెంట్ హరిహరన్ గణేశన్, షాక్స్ గ్లోబల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మధు నటేశన్, జేసీ పెన్నీ ఇండియా ఎండీ కౌశిక్ దాస్, లులు లెమన్ వైస్ ప్రెసిడెంట్ సైఫ్ అహ్మద్ షరీఫ్, విక్టోరియా సీక్రెట్ వైస్ ప్రెసిడెంట్ వసుధారిణి శ్రీనివాసన్, నాసుని ఇండియా సీనియర్ డైరెక్టర్ పెద్ద రెడ్డెప్ప, ఏఎన్‌జెడ్ సీఎఫ్‌వో కవితా రమేశ్, ఆస్ట్రల్ ల్యాబ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ ఆర్ కోటేశ్వర్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ సీఈవో లలితా ఇంద్రకంటి పాల్గొన్నారు.



చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న టీటీడీ ఏఈవో రాజశేఖర్

టీటీడీలో పనిచేస్తూ.. చర్చిలో ప్రార్థనలు

- ఏఈవో రాజశేఖరబాబు సస్పెన్షన్

తిరుమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగిగా పనిచేస్తూ చర్చికి వెళుతున్నారన్న అభియోగంపై అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఏఈవో) రాజశేఖర్ బాబును సస్పెండ్ చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. టీటీడీ వేలం విభాగంలో ఏఈవోగా పనిచేస్తున్న రాజశేఖర్‌బాబు పుత్తూరులోని ఆయన స్వగ్రామంలో ప్రతి ఆదివారం చర్చికి వెళ్లి ప్రార్థనల్లో పాల్గొంటున్నారంటూ వీడియోలు, ఫొటోలు సహా ఓ వ్యక్తి టీటీడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై రాధామనోహర్ దాస్ కూడా స్పందించారు. టీటీడీలో పని చేస్తూ స్వామి సొమ్ము తింటూ, హుండీలో హిందువులు కానుకలు సమర్పిస్తే.. దాంతో జీతం తీసుకుంటూ చర్చిలకు వెళ్లే ఉద్యోగులు చర్చిలను వదిలేయాలని, లేకుంటే టీటీడీని వదిలేయాలని మీడియా ఎదుట డిమాండ్ చేయడం తీవ్రస్థాయిలో చర్చనీయాంశమైంది. రాజశేఖరబాబు చర్చికి వెళ్తున్నట్లు టీటీడీ విజిలెన్స్ అధికారుల విచారణలో కూడా తేలింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు టీటీడీ మంగళవారం ప్రకటించింది. 'రాజశేఖరబాబు టీటీడీ ఉద్యోగిగా సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదు. హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగి అయివుండి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. టీటీడీ విజిలెన్స్ నివేదిక, ఇతర ఆధారాలను పరిశీలించి, ఆయనపై శాఖాపరమైన చర్యలతో పాటు ఆయన్ను సస్పెండ్ చేస్తున్నాం' అని టీటీడీ పేర్కొంది.

కాకాణిపై దావా.. విచారణ వాయిదా

విజయవాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వేసిన పరువు నష్టం దావాపై విచారణను విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. కాకాని మంత్రిగా ఉన్నప్పుడు సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో సోమిరెడ్డి పరువు నష్టం దావా వేశారు.

అరెస్టు నుంచి మోహిత్‌రెడ్డికి రక్షణ వద్దు

- రెండుసార్లు నోటీసులిచ్చినా విచారణకు హాజరుకాలేదు
- హైకోర్టులో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం ద్వారా ముడుపుల రూపంలో వచ్చిన రూ.8 కోట్ల సొమ్మును తరలించేందుకు మోహిత్‌రెడ్డి తుడా వాహనాలు వినియోగించారని సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా మంగళవారం హైకోర్టుకు నివేదించారు. విచారణ నిమిత్తం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చినా మోహిత్‌రెడ్డి స్పందించలేదన్నారు. దీంతో ఆయన పై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశామని తెలిపారు. అరెస్ట్ నుండి పిటిషనర్‌కు రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. "దర్యాప్తు అధికారి ముందు హాజరయ్యేందుకు పిటిషనర్ సిద్ధంగా ఉన్నారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించండి" అని కోరారు. కేసులో పిటిషనర్‌ను నిందితుడిగా (ఏ39) చేర్చారని, కానీ సాక్షిగా విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, మోహిత్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈనెల 11కు వాయిదా వేశారు.

సీబీఐ నుంచి ఆస్తులను విడుదల చేయించండి: గాలి

హైదరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): సీబీఐ సీజ్ చేసిన తన ఆస్తులను విడుదల చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ఓఎంసీ కేసులో దోషిగా తేలిన గాలి జనార్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని సీబీఐకి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 23కు వాయిదా వేసింది.

గోవిందప్ప బెయిల్‌పై 14న తీర్పు

విజయవాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో తీర్పును ఈనెల 14వ తేదీకి వాయిదా వేస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. విజయవాడలోని జిల్లా జైలులో ఉన్న మరో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సిట్ పోలీసులు మంగళవారం కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై వాదనలను వినడానికి విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారానికి వాయిదా వేశారు. కాగా, బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నామని సిట్ పోలీసులు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. మంగళవారం ఈ మెమోను న్యాయాధికారి పి.భాస్కరరావుకు అందజేశారు.

కొమ్మినేని బెయిల్ షరతుల్లో సవరణ

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు బెయిల్ షరతులను హైకోర్టు పాక్షికంగా సవరించింది. చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు ప్రతీ నెల రెండవ, నాలుగవ శనివారం తుళ్లూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలని ట్రయల్ కోర్టు విధించిన షరతులో వెసులుబాటు ఇచ్చింది. తుళ్లూరు స్టేషన్‌లో హాజరయ్యేందుకు వెళ్తే దాడి జరిగే ప్రమాదం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తాడేపల్లి స్టేషన్ ఎస్‌హెచ్‌వో ముందు హాజరయ్యేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

పెగ్గు మీద పెగ్గు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగదారుల్లో అనేక మంది నాటు సారా, గంజాయి వైపు మళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాసిరకం బ్రాండ్లకు ఫుల్‌స్టాప్ పడింది. మరోవైపు క్వార్టర్ రూ.99కే జాతీయ స్థాయి కంపెనీల మద్యం రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో కనుమరుగైన పాపులర్ బ్రాండ్లు తిరిగొచ్చాయి. ఫలితంగా నాటు సారా, గంజాయి తగ్గింది. బ్రాండ్ మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. ఈఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొదటి క్వార్టర్‌లో భారీగా అమ్మకాలు పెరగడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది.

ఏప్రిల్ నుంచి జూన్ వరకు అమ్మకాలు (లిక్కర్, బీర్ కేసుల్లో)

కేటగిరీ	ఏప్రిల్- జూన్ 2024	ఏప్రిల్- జూన్ 2025	వృద్ధి
లిక్కర్	83 లక్షలు	103 లక్షలు	23.77 %
బీర్	28 లక్షలు	65 లక్షలు	129 %
విలువ	7,087 కోట్లు	7,890 కోట్లు	11.33 %
ఆదాయం	6,051కోట్లు	6,899 కోట్లు	14.02 %

అమ్మకాలు ఇలా

గత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 82.98 లక్షల కేసుల మద్యం అమ్మితే, ఈ ఆర్థిక సంవత్సరంలో 102.7 లక్షల కేసుల మద్యం అమ్ముడైంది. అంటే 23.77 శాతం పెరిగింది. బీరు గతేడాది మొదటి క్వార్టర్‌లో 28.22 లక్షల కేసులు అమ్మితే, ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో 64.6లక్షల కేసులు అమ్మారు. అంటే 128.9శాతం పెరిగింది. ఫలితంగా గతేడాది మొదటి క్వార్టర్‌లో 7,086 కోట్ల విలువైన మద్యం అమ్ముడైతే, ఈ ఏడాది అది రూ.7,889కోట్లకు పెరిగింది. దీంతో గతేడాది 6,050.87కోట్ల ఆదాయం వస్తే, ఈ ఏడాది 6,899 కోట్లు వచ్చింది. ఆదాయం 14.02 శాతం పెరిగింది. నెలకు రూ.2300 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

అమ్మకాల స్థాయిలో ఆదాయం లేదు

వాస్తవానికి లిక్కర్‌లో 24శాతం, బీరులో 129శాతం అమ్మకాలు పెరిగితే అంతే స్థాయిలో ఆదాయం కూడా పెరగాలి. కానీ అమ్మకాల విలువ 11.33శాతం, ఆదాయం 14.02శాతం మాత్రమే పెరిగింది. దానికి కారణం కూటమి ప్రభుత్వంలో క్వార్టర్ రూ.99 మద్యం ప్రవేశపెట్టడమే. వినియోగదారులపై భారం పెరగకుండా నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తేవాలని నిర్ణయించిన ప్రభుత్వం రూ.99 బ్రాండ్లను తీసుకొచ్చింది. ఆ బ్రాండ్ల అమ్మకాలు మొత్తం మార్కెట్ విలువలో దాదాపు 30శాతంగా ఉన్నాయి. దీంతో అమ్మకాలు పెరిగినా.. విలువ, ఆదాయంలో అది కనిపించడం లేదు. గత ప్రభుత్వంలో తక్కువ స్థాయి మద్యం బ్రాండ్ల ధరలను కూడా అమాంతం పెంచారు. కమీషన్ల కోసం ఆమేరకు పెంచగా, ప్రభుత్వం మారగానే కంపెనీలే స్వచ్ఛందంగా ధరలను తగ్గించుకున్నాయి. అమ్మకాల విలువ, ఆదాయం తగ్గడంలో ఈ రెండు అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

తిరుపతిలో అత్యధిక అమ్మకాలు

అమ్మకాల్లో తిరుపతి టాప్‌లో నిలిచింది. మొదటి క్వార్టర్‌లో ఈ జిల్లాలో ఏకంగా రూ.494 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఆ తర్వాత విశాఖపట్నంలో రూ.492 కోట్లు, నెల్లూరులో రూ.416కోట్లు, ఎన్టీఆర్‌లో రూ.408 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అత్యల్పంగా అల్లూరు సీతారామరాజు జిల్లాలో రూ.71కోట్ల మద్యం అమ్ముడైంది. పార్వతీపురం మన్యంలో రూ.110 కోట్లు మాత్రమే అమ్మారు. అమ్మకాల వృద్ధిరేటు పరంగా చూస్తే కర్నూలులో 59, అల్లూరి జిల్లాలో 54, శ్రీసత్యసాయి జిల్లాలో 51, చిత్తూరులో 46శాతం అమ్మకాలు పెరిగాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమ్మకాల విలువ పెరిగితే ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో 2.34శాతం అమ్మకాలు తగ్గాయి. ఈ జిల్లాలో నకిలీ మద్యం అమ్మకాలు పెరగడం దీనికి కారణంగా అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారికి సన్నిహితంగా ఉండే ఓ అధికారి జిల్లాలో ఎమ్మార్పీ ఉల్లంఘనలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆ అధికారిని ఎవరూ ఏం అనలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. ఇది జిల్లాస్థాయిలో అధికారుల మధ్య సమన్వయాన్ని దెబ్బతీసింది. ఫలితంగా రాష్ట్రమంతా ఒక దారిలో వెళ్తుంటే, పశ్చిమ రివర్స్ ట్రెండ్‌లో నడుస్తోంది.

బార్ల విక్రయాలు కారణమే..

అమ్మకాలు పెరగడానికి గత ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణం అయితే, బార్ల అక్రమాలను పూర్తిగా వదిలేయడం మరో కారణంగా కనిపిస్తోంది. వచ్చే ఆగస్టుతో బార్ పాలసీ గడువు ముగుస్తుంది. సెప్టెంబరు నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుంది. దీంతో బార్ లైసెన్సీలు ఇష్టారాజ్యంగా మద్యం అమ్ముతున్నారు. బార్లను ఉదయం 11 నుంచి రాత్రి 11గంటల వరకు మాత్రమే తెరవాలి. కానీ ఉదయం 10గంటల నుంచే ఎక్కువ బార్లు తెరుచుకుని మద్యం అమ్మకాలు ప్రారంభిస్తున్నాయి. నిబంధనల ప్రకారం బార్‌లోనే మద్యం సేవించాలి. కానీ చాలావరకు బార్ల లైసెన్సీలు షాపుల తరహాలో బయటకు మద్యం సీసాలు అమ్మేస్తున్నారు. పాలసీ చివరి దశకు రావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అటు ఎక్సైజ్, ఇటు స్టేట్ టాస్క్‌ఫోర్స్ రెండు విభాగాలు బార్లను నియంత్రించడంలో విఫలమవుతున్నాయి. గతంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ నిఘా ఉందనే భయం బార్ల యాజమాన్యాల్లో కనిపించేది. ఇప్పుడు ఆ విభాగం కూడా పట్టించుకోకపోవడంతో కొన్ని బార్లలో 24గంటలూ మద్యం దొరుకుతోంది.



ఈవో, దేవస్థానం సిబ్బందిపై దౌర్జన్యానికి దిగిన ఆక్రమణదారులు

భద్రాద్రి ఆలయ ఈవోపై భూ ఆక్రమణదారుల దాడి

- తోపులాటలో స్పృహ కోల్పోయిన ఈవో రమాదేవి, ఉద్యోగి వినీల్
- పోలీసులకు సమాచారమిచ్చినా స్పందించలేదన్న ఆలయ అధికారులు

భద్రాచలం/ఎటపాక, జూలై 8(ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ భూముల ఆక్రమణ అంశం మరోసారి రణరంగాన్ని తలపించింది. ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి రామయ్య భూముల్లో అక్రమార్కులు చేస్తున్న నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, కాంట్రాక్టు ఉద్యోగి వినీల్‌తో పాటు మరికొందరు సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేశారు. ఈ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ఆలయ అధికారులు సోమవారమే ప్రయత్నం చేశారు. అయితే ఆక్రమణదారులు దాడికి యత్నించడంతో వెనుదిరిగారు. రెండోరోజు మంగళవారం ఈవో ఆలయ సిబ్బందితో కలిసి వెళ్లారు. నిర్మాణాలు ఆపేందుకు మీరెవరని వారిని ఆక్రమణదారులు ప్రశ్నించారు. ఈ భూములు భద్రాద్రి ఆలయానివని, తమ వద్ద అన్ని పత్రాలూ ఉన్నాయని ఈవో స్పష్టం చేశారు. ఈ సమయంలో అధికారుల చేతుల్లో ఉన్న పత్రాలను ఆక్రమణదారులు లాక్కున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. 'మా స్థలంలోకి ఎందుకొచ్చారు? వెళ్లిపోండి' అంటూ ఆక్రమణదారులు ఆలయ అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా తోపులాటకు దారితీసింది. అదే సమయంలో కొందరు ఈవో రమాదేవిపై దాడి చేశారు. ఆమె స్పృహ కోల్పోవడంతో భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనలో కాంట్రాక్టు ఉద్యోగి వినీల్ కూడా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడినీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు అడ్డుకునేందుకు వెళ్లే సమయంలో ఎటపాక రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా సరిగా స్పందించలేదని ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. కేవలం ఒక్క హెడ్ కానిస్టేబుల్‌ను పంపారని వాపోయారు. భద్రాచలం పోలీసులు కూడా ఎటపాక పోలీసులకు సమాచారం ఇచ్చారని, అయినా వారు స్పందించకపోవడంతోనే దాడి జరిగిందని అధికారులు ఆరోపిస్తున్నారు. ఘటనపై ఇరు వర్గాలూ పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని సీఐ కన్నపరాజు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.